కలం నిఘా
WWW.KALAMNIGHA.COM
తెలుగు దినపత్రిక
హైదరాబాద్ బుధవారం 29 జనవరి 2025
సంపుటి: 14, సంచిక: 300 పేజీలు 8, వెల: 4.00
Published from : Hyderabad, Karimnagar, Nizamabad, Warangal, Vijayawada, Tirupati, Kurnool, Visakhapatnam

## అమీన్‌పూర్‌లో...
# హైడ్రా కూల్చివేతలు

మరోసారి కూల్చి వేతలు చేపట్టిన హైడ్రా



2

## టీడీపీ ఎంపీలకు బాబు దిశా నిర్దేశం

ఈనెల 31 నుండి ప్రారంభంకానున్న పార్లమెంటు సమావేశాలు



2

# టెంపుల్ టూరిజం పట్ల నిర్లక్ష్యం

ఎకో టూరిజం అభివృద్ధికి కృషి

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటేలే ప్రోత్సహిస్తాం

కో ఫ్రెండ్లీ ఎక్స్‌పీరియం పార్కును ప్రారంభించిన సీఎం రేవంత్‌రెడ్డి

ఇది సినిమా షూటింగ్‌లకు అద్భుతమని చెప్పిన నటుడు చిరంజీవి




హైదరాబాద్ జనవరి 28 (నిఘా న్యూస్):: ప్రకృతి రమణీయతకు మారుపేరుగా తెలంగాణను తీర్చిదిద్దాలన్న సంకల్పంతో ఉన్నామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఏటా కోటి మొక్కలు నాటాలన్న లక్ష్యంతో ఉన్నామని అన్నారు. తెలంగాణను ప్రకృతివనంగా మార్చాల్సి ఉంది. తల్లి పేరిట విద్యార్థులు మొక్కలు నాటి సంరక్షించే విధానం తీసుకొస్తాం. త్వరలో విధివిధానాలు ఖరారుచేస్తాంఅని సీఎం అన్నారు. రంగారెడ్డి జిల్లా పొద్దుటూరులో ప్రపంచస్థాయి ఎకో ఫ్రెండ్లీ ఎక్స్‌పీరియం పార్కును సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రముఖ సినీనటుడు చిరంజీవి, ప్రభుత్వ విప్ మహేందర్‌రెడ్డి ..మిగతా 2లో



## 150 ఎకరాల్లో ఏకో ఫ్రెండ్లీ పార్కు

సుమారు 25 వేల జాతులకు చెందిన మొక్కలు ప్రారంభించిన సీఎం రేవంత్‌రెడ్డి

2



## హైదరాబాద్‌లో...
# రెండు ఐటీ పార్కులు

హైటెక్ సిటీ తరహాలో ఏర్పాటు చేసే లక్ష్యం

వందకోట్ల పెట్టుబడితో ముందుకొచ్చిన 'డ్యూ' సాఫ్ట్‌వేర్ కంపెనీ ప్రతినిధులతో చర్చించిన ఐటిశాఖ మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్ జనవరి 28 (నిఘా న్యూస్): నగర శివారుల్లో కొత్తగా రెండు ఐటీ పార్కులను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు రాష్ట్ర ఐటీ,పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు తెలిపారు. హైటెక్ సిటీ తరహాలోనే కొత్తగా మరో రెండు ఐటీ పార్కులను ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు. హైదరాబాద్‌లో రూ.100 కోట్ల పెట్టుబడి పెట్టేందుకు ముందుకొచ్చిన 'డ్యూ' సాఫ్ట్‌వేర్ కంపెనీ ప్రతినిధులతో సచివాలయంలో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఐటీ రంగంలో హైదరాబాద్ వేగంగా అభివృద్ధి చెందుతోందని, ప్రముఖ కంపెనీలు ఇక్కడ పెట్టుబడి పెట్టేందుకు ముందుకొస్తున్నాయని తెలిపారు. వీటిని ఎంత విస్తీర్ణంలో ఏర్పాటు చేయాలి. నగర శివారుల్లో ఏయే ప్రాంతాలు ఇందుకు అనుకూలంగా ఉన్నాయో సంబంధిత యంత్రాంగం అధ్యయనం చేస్తోందని తెలిపారు. ఐటీ పార్కుల్లో పనిచేసే ఉద్యోగులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తామని, రవాణా సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు. ఎక్కడి నుంచ్కెనా ఈ పార్కులకు చేరుకునేలా ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. ఈ పార్కుల్లో కొత్తగా పెట్టుబడులు పెట్టేందుకు ..మిగతా 2లో

# హైదరాబాద్ ఓ బిజినెస్ బ్రాండ్

## దావోస్ ఒప్పందాలతో రూ.1.80 లక్షల కోట్ల పెట్టుబడులు



గతంలో ఇక్కడ కొల్లగొట్టిన సొమ్మునే విదేశీ పెట్టుబడులుగా చూపారు

వన్ ట్రిలియన్ ఎకానమీయే లక్ష్యం

గతం కంటే నాలుగు రెట్ల అధిక ఒప్పందాలు

స్కిల్ వర్సిటీ కోసం సింగపూర్‌తో ఒప్పందం

మూసీ పునరుజ్జీవం యువత ఉపాధిపై దృష్టి

రాజకీయంగా విభేదించినా అభివృద్ధిని అడ్డుకోవడం తగదు

మంత్రులతో కలసి మీడియా సమావేశంలో రేవంత్

హైదరాబాద్ జనవరి 28 (నిఘా న్యూస్): తమ ప్రభుత్వం సాధించిన విజయాల్లో దావోస్ ఒప్పందాల సాధన అతి పెద్దదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. దావోస్ సదస్సు ద్వారా దాదాపు రూ.1.80లక్షల కోట్ల పెట్టుబడులు సాధించినట్టు చెప్పారు. హైదరాబాద్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చిన సంస్థలకు సీఎం ధన్యవాదాలు తెలిపారు. అయితే కొందరు దీనిని జీర్ణించుకోలేక వెకిలి వ్యాఖ్యలు చేస్తున్నారని సిఎం మండిపడ్డారు. సచివాయలంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సిఎం రేవంత్ రెడ్డి, మంత్రులు మాట్లాడారు. ప్రభుత్వంపై కొందరు చేసిన దుష్ప్రచారం పటాపంచలు అయ్యింది. ప్రభుత్వంపై, రాష్ట్రంపై నమ్మకం ఉంచుతూ భారీ పెట్టుబడులకు చాలామంది ముందుకు వచ్చారు. ఈ ప్రభుత్వంపై విశ్వాసం ఉంచుతూ అంతర్జాతీయ సంస్థలు భారీ పెట్టుబడులు పెడుతున్నాయని సీఎం వివరించారు. తెలంగాణ రాష్ట్రాన్ని వన్ ట్రిలియన్ ఎకానమీగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చిన సంస్థలకు ధన్యవాదాలు తెలిపారు. ఇది మా ప్రభుత్వం సాధించిన కీలక విజయమన్నారు. తెలంగాణ రాష్ట్రంలో పెట్టుబడులు రాకుండా కొందరు కుట్రలు చేశారని ఆరోపించారు. రాష్ట్ర అభివృద్ధిపై దుష్ప్రచారం చేశారని మండిపడ్డారు. దావోస్ పర్యటనతో రూ.1.80 లక్షల కోట్ల పెట్టుబడులను ..మిగతా 2లో

కాంగ్రెస్ పాలనపై ప్రపంచ పారిశ్రామిక వేత్తలకు నమ్మకం కుదిరింది



## బాకీ అడిగినట్లు...
# కాంగ్రెస్‌ను నిలదీయండి

మోసం చేయడంలో చరిత్ర సృష్టించిన కాంగ్రెస్

రైతు భరోసా పేరుతో కాంగ్రెస్ డ్రామాలు

భారాస రైతు మహా ధర్నాలో కేటీఆర్

నల్గొండ జనవరి 28 (నిఘా న్యూస్): నిజాం సర్కారును నిలదీసిన గడ్డ నల్గొండ అని బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. ఈ జిల్లాకు మాజీ సీఎం కేసీఆర్ ఏం చేశారని అసెంబ్లీలో ఓ మంత్రి అడిగారన్న ఆయన వరి ఉత్పత్తిలో జిల్లాను నెంబర్ వన్ చేశారని చెప్పారు. ఇక్కడికి గోదావరి జలాలలను తరలించిన ఘనత కెసిఆర్‌దని అన్నారు. నల్గొండ క్లాక్‌టవర్ కూడలిలో భారాస రైతు మహా ధర్నాలో పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ సహా పలువురు ముఖ్య నేతలు ఈ ధర్నాలో పాల్గొన్నారు. తొలుత నాగార్జున కళాశాల వద్ద తెలంగాణ తల్లి విగ్రహానికి కేటీఆర్ నివాళులర్పించారు. అక్కడి నుంచి క్లాక్ టవర్ వరకు భారీ ర్యాలీ ..మిగతా 2లో

## జూన్‌లోగా....
# నామినేటెడ్ పోస్టుల భర్తీ

పార్టీకోసం కష్టపడ్డ వారికే పదవులు

క్షేత్ర స్థాయిలో పనిచేసిన వారినే ప్రోత్సహించాలి

పార్టీ నేతలతో చంద్రబాబు టెలి కాన్ఫరెన్స్



అమరావతి జనవరి 28(నిఘా న్యూస్): జూన్ లోపు ప్రభుత్వంలో ఉన్న అన్ని నామినేటెడ్ పదవులు భర్తీ చేస్తామని టిడిపి అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఇతర పార్టీల నుంచి వచ్చి చేరిన వారికంటే ఎప్పటి నుంచో పార్టీలో ఉండి పనిచేసిన వారిని నేతలు ప్రోత్సహించాలన్నారు. మొదటి నుంచి పార్టీని నమ్ముకున్న వారికే పదవులు దక్కేలా చూడాల్సిన బాధ్యత ఎమ్మెల్యేలదేనని తేల్చి చెప్పారు. 214 మార్కెట్ కమిటీలు, 1100 ట్రస్ట్ బోర్డులు ఉన్నాయని, రానున్న రోజుల్లో ఈ నియామకాలు పూర్తి చేస్తామన్నారు. పార్టీ ముఖ్య నాయకులు, ఎమ్మెల్యేలు, ఎంపిలు, మంత్రులు, పార్టీ ఇన్‌ఛార్జ్‌లతో ..మిగతా 2లో

# సినిమా థియేటర్లలో సెకండ్ షోలకు పిల్లల ప్రవేశంపై నిషేధం



థియేటర్లకు హైకోర్టు షాక్

16 ఏళ్ల లోపు పిల్లలు.. ఉదయం 11 గంటలు రాత్రి 11 లోపు మాత్రమే అనుమతి

హైదరాబాద్ జనవరి 28 (నిఘా న్యూస్): పుష్ప 2' సినిమా ప్రీమియర్ సందర్భంగా సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటన అనంతరం తెలంగాణ హైకోర్టు సంచలన తీర్పును ఇచ్చిన విషయం తెలిసిందే. హైకోర్టు తీర్పును తెలంగాణ ప్రభుత్వం ..మిగతా 2లో



## కేస్లాపూర్‌లో నాగోబా జాతర
# ప్రారంభం

ఫిబ్రవరి నాలుగవ తేదీ వరకు వేడుకలు

600 మంది పోలీసులు, 100 సీసీ కెమెరాల ఏర్పాటు

ఆదిలాబాద్ జనవరి 28(నిఘా న్యూస్): ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కెస్లాపూర్‌లో మెస్రం వంశీయులు మంగళవారం నాగోబా జాతర పూజలను ప్రారంభించారు. గంగా జలాన్ని, ఆలయ ప్రాంగణంలోని మురాడి వద్దకు మెస్రం వంశీయులు తీసుకొచ్చారు. గ్రామంలోని పాత ఆలయం నుంచి నాగోబా విగ్రహాన్ని ఊరేగింపుగా గర్భగుడిలో భద్ర పరిచారు. అనంతరం ఆలయ సమీపంలోని కోనేరు నుంచి మట్టి కుండల్లో నీటిని తీసుకువచ్చి పుట్టలు చేస్తారు. అర్ధరాత్రి 11:30 సమయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం జాతర ప్రారంభం కానుంది. పూజా కార్యక్రమంలో జిల్లా అధికారులతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు మెస్రం వంశీయులు పాల్గొంటారు. ఐదు రోజులపాటు జరిగే జాతరలో తెలుగు రాష్ట్రాల నుంచి కాక మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఒడిషా రాష్ట్రాల నుంచి లక్షలాది మంది భక్తులు హాజరవుతారు.

### సీఎం రేవంత్‌రెడ్డి శుభాకాంక్షలు

ఈ సందర్భంగా ..మిగతా 2లో



## కేస్లాపూర్‌లో నాగోబా జాతర ప్రారంభం

మొదటి పేజీ తరువాయి...

సీఎం రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. వనమే ఆలంబనగా అత్యంత నియమ నిష్ఠలతో ఆదివాసీలందరూ జరుపుకునే వేడుక నాగోబా జాతర అని, గిరిజన సోదర, సోదరీమణులు అందరికీ శుభాకాంక్షలు అంటూ పేర్కొన్నారు. పుష్య అమావాస్య నాడు ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్‌లో అంబరాన్నంటే ఈ ఆదివాసీ సంబరం తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని పేర్కొన్నారు. దేశంలో రెండో అతిపెద్ద ఆదివాసీ వేడుకలో ఆధ్యాత్మిక వెలుగులు నింపే ఆదిశేషువు కరుణా కటాక్షాలు అందరిపైనా ఉండాలని ఆకాంక్షించారు. వనమే ఆలంబనగా అత్యంత నియమ నిష్ఠలతో ఆదివాసీలందరూ జరుపుకునే వేడుక నాగోబా జాతర సందర్భంగా ముఖ్యమంత్రి గిరిజన సోదర, సోదరీమణులు అందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. పుష్య అమావాస్య నాడు ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్‌లో అంబరాన్నంటే ఈ ఆదివాసీ సంబరం ప్రారంభం కానుంది. గోండుల సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన నాగోబా జాతరను ఆదివాసీ, గిరిజనులు ఘనంగా జరుపుకుంటారు. ఈ జాతరకు తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాలనుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తారు. దీంతో ప్రభుత్వం సుమారు 600 మంది పోలీసులు, 100 సీసీ కెమెరాలతో పటిష్ట భద్రత ఏర్పాటు చేసింది. ప్రతి సంవత్సరం పుష్య అమావాస్య సందర్భంగా గిరిజనులు ఇలవేల్పు నాగోబా మహాపూజ చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఇందుకోసం మెస్రం వంశీయులు నెల రోజుల ముందు నుండే ఏర్పాట్లు చేపడతారు. కాలి నడకన సుమారు 250 కిలోమీటర్ల దూరం నడిచి వెళ్లి తీసుకువచ్చిన పవిత్ర గోదావరి జలాలతో నాగోబాకు అభిషేకం, మహాపూజ చేయడంతో ఈ ఇక్కడ జాతర మహోత్సవం ప్రారంభమవుతుంది. ఇప్పటికే నాగోబా అభిషేకానికి కావాల్సిన పవిత్ర గంగా జలాలను తీసుకొని కేస్లాపూర్ కు వచ్చిన మెస్రం వంశీయులు ఆలయ సమీపంలోని మర్రి చెట్టు వద్ద విడిది చేసి ఉన్నారు. మంగళవారం రాత్రి అక్కడి నుండి గిరిజన సంప్రదాయ దుస్తుల్లో వాయిద్యాలతో ఆలయానికి చేరుకుంటారు. అనంతరం మెస్రం వంశీయులు, కట్లోలాలు ఆలయాన్ని శుద్ధి చేస్తారు. ప్రత్యేకంగా ఆదిలాబాద్ జిల్లా సిరికొండలో తయారు చేయించిన కుండలను మాత్రమే గిరిజనులు ఇక్కడ పూజలకు వినియోగించడం ఆనవాయితీగా వస్తుంది.

## సినిమా థియేటర్లలో సెకండ్ షోలకు పిల్లల ప్రవేశంపై నిషేధం

మొదటి పేజీ తరువాయి...

కూడా సీరియస్‌గా తీసుకుని ఇకపై బెనిఫిట్ షోలు, టికెట్ల ధరలు పెంచుకోవడాలు వంటి వెసులుబాటు ఉండదని స్పష్టంగా ప్రకటించింది. సంక్రాంతికి వచ్చిన 'గేమ్ ఛేంజర్' సినిమాకు టికెట్ల ధరను పెంచుకునే వెసులు బాటు కల్పించగా, కోర్టు కలగజేసుకోవడంతో వెంటనే టికెట్ల ధరలను తగ్గించారు. దీంతో చిన్న సినిమాలకు ఏమోగానీ, భారీ బడ్జెట్‌తో రూపొందే సినిమాలకు మాత్రం అంతే భారీగా ఇబ్బంది నెలకొంది. ఇదిలా ఉంటే తాజాగా హైకోర్టు ఫ్యామిలీ ఆడియన్స్‌కు, థియేటర్ సినిమాలకు మరో భారీ షాక్ ఇచ్చింది. ఇకపై థియేటర్లలో పిల్లలు సినిమా చూడాలంటే నిర్దిష్ట సమయంలో మాత్రమే చూడాలని తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలను జారీ చేసింది. ఉదయం 11 గంటలలోపు, రాత్రి 11 గంటల తరువాత 16 ఏళ్లలోపు పిల్లలను సినిమాలకు అనుమతించరాదని థియేటర్లకు హైకోర్టు తెలిపింది. 'గేమ్ ఛేంజర్' మూవీ టికెట్ ధరల పెంపు, అదనపు షోలకు అనుమతించడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన 4 పిటిషన్లపై విచారణ చేపట్టగా, పిటిషనర్ల తరపు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ హైకోర్టు గత ఉత్తర్వుల మేరకు బెనిఫిట్ షోకు అనుమతిస్తూ గతంలో ఇచ్చిన ఉత్తర్వులు పునః సమీక్షించి, ఇకపై బెనిఫిట్ షోలకు అనుమతించరాదని నిర్ణయం తీసుకుంటూ జనవరి 11న ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ప్రజా ప్రయోజనాలు, ఆరోగ్యం, రక్షణలు దృష్టిలో పెట్టుకుని భవిష్యత్తులో బెనిఫిట్ షోలకు అనుమతి ఇవ్వకూడదనే నిర్ణయం తీసుకుందని తెలిపారు. అలాగే సినిమాటోగ్రఫీ నిబంధనల ప్రకారం ఉదయం 8.40లోపు, అర్ధరాత్రి 1.30 గంటల తర్వాత సినిమాలకు అనుమతించరాదని పేర్కొన్నారు. ముఖ్యంగా మైనర్లను అనుమతించరాదని, వీరి వల్లలో అది వారి శారీరక, మానసిక ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందని వివరించారు. ప్రస్తుత మల్టీప్లెక్స్ థియేటర్లలో చివరి షో అర్ధరాత్రి 1.30 గంటల వరకు నడుస్తుందని, ఇందులో మైనర్ల ప్రవేశానికి ఎలాంటి నియంత్రణలు లేవని కోర్టుకు తెలిపారు. అంతేకాకుండా, 'పుష్ప 2' బెనిఫిట్ షో సమయంలో జరిగిన తొక్కిసలాటలో మహిళ మృతి చెందగా, బాలుడు తీవ్రంగా గాయపడ్డాడని, ఈ నేపథ్యంలో ప్రభుత్వం సరైన నిర్ణయం తీసుకోవాల్సి ఉందని కోరారు. ఇప్పుడు కోర్టు ఇచ్చిన ఆదేశాలతో సెకండ్ షోలకు 16 సంవత్సరాల లోపు వారి నిషేధాన్ని అమలు చేయటం వల్ల అది ఖచ్చితంగా వసూళ్లపై ప్రభావం చూపుతుంది. అసలే ఓటీటీలు వచ్చి ప్రేక్షకులను థియేటర్లకు రానివ్వకుండా చేస్తుంటే.. ఇప్పుడీ ఆదేశాలు మరింతగా థియేటర్లపై ప్రభావం చూపే అవకాశం అయితే లేకపోలేదు.

## టిడిపి ఎంపీలకు బాబు దిశా నిర్దేశం

**ఈనెల 31 నుండి ప్రారంభం కానున్న పార్లమెంటు సమావేశాలు**

**అమరావతి జనవరి 28 (నిఘా న్యూస్):** ఈ నెల 31 వ తేదీ నుంచి ఢిల్లీలో జరుగబోవు పార్లమెంట్ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై మంగళవారం సాయంత్రం అమరావతి లోని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉండవల్లి లోని తన నివాసంలో టీడీపీ పార్లమెంట్ సభ్యులతో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న కూటమి ఎంపీలు.

## హైదరాబాద్‌లో... రెండు ఐటీ పార్కులు

మొదటి పేజీ తరువాయి...

ముందుకొచ్చే సాఫ్ట్ వేర్ కంపెనీలకు అవకాశం కల్పిస్తామన్నారు. పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చే పరిశ్రమలకు భూకేటాయింపులపై ఇప్పటి వరకు ప్రత్యేక పాలసీ అంటూ ఏదీ లేదని, దీని వల్ల పారిశ్రామికవేత్తలు ఇబ్బంది పడుతున్నారన్నారు. అందుకే ప్రత్యేక పాలసీ రూపొందించా లాలని నిర్ణయించామని, పెట్టుబడితో పాటు కల్పించే ఉద్యోగాల సంఖ్య ఆధారంగా భూమిని కేటాయిస్తా మని శ్రీధర్ బాబు తెలిపారు. హైదరాబాద్‌లో 100 కోట్లు పెట్టుబడి పెట్టేందుకు ముందుకొచ్చిన ద్యూ సాఫ్ట్ వేర్ కంపెనీని సంతోషంగా ఆహ్వానిస్తున్నామని, ప్రభుత్వం తరఫున అన్ని రకాలుగా సహకరిస్తామన్నారు. రాబోయే ఐయిదేళ్లలో ఈ సంస్థ 900 మందికి ఉపాధి అవకాశాలను కల్పించనుందని పేర్కొన్నారు.

# హైదరాబాద్ ఓ బిజినెస్ బ్రాండ్

మొదటి పేజీ తరువాయి...

పెట్టేలా మన రాష్ట్రం ఆకర్షించగలిగిందని చెప్పుకొచ్చారు. ఇది నిరంతర ప్రక్రియ అని చెప్పారు. రాజకీయంగా విభేదించినా రాష్ట్ర అభివృద్ధి విషయంలో రాజకీయ వివాదాలకు వెళ్లొద్దని హితవు పలికారు. పెట్టుబడులకు అవసరమైన భూ కేటాయింపులు చేసి అన్ని రకాలుగా ఆ సంస్థలను ప్రోత్సహిస్తామన్నారు. మనందరం కలిసి కష్టపడితేనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమని చెప్పారు. సింగపూర్ ఆధ్వర్యంలో నడుస్తున్న ఐటీఈ సంస్థతో కూడా ఒప్పందాలు చేసుకున్నామని తెలిపారు. ఇది భవిష్యత్‌లో మన సాంకేతికను పెంపొందించ డానికి ఉపయోగపడుతుందని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. 'విదేశాల నుంచి పెట్టుబడులు తీసుకుని రావాలనేది మా ప్రయత్నం అని అన్నారు వాళ్లు ఇక్కడి నుంచి విదేశాలకు నిధులు తరలించారు. ఇక్కడ కొల్లగొట్టిన సొమ్మునే విదేశీ పెట్టుబడులుగా చూపారు. మేం విఫలమైతే పైశాచిక ఆనందం పొందాలని కొందరు చూశారు. ఇతర రాష్ట్రాలకంటే గొప్పగా పెట్టుబడులు సాధించాం. అసూయతోనే మమ్మల్ని వారు అభినందించడం లేదు. భారీ పెట్టుబడులు తేవడం చూసి కొందరికి కడుపుమంటగా ఉందని పరోక్షంగా బిఆర్ఎస్ నేతలను ఉద్దేశించి అన్నారు. ప్రతిపక్షంలో ఓ నేత అటెన్షన్ డిజార్డర్‌తో బాధపడుతున్నారు. చాలా సంస్థలు మన పెవిలియన్‌కు వచ్చి ఒప్పందాలు చేసుకున్నాయి. కేసీఆర్ ప్రభుత్వంలో ఈస్థాయిలో పెట్టుబడులు రాలేదనే అక్కసుతో ఉన్నారు. ఎనర్జీ పాలసీతోనే తెలంగాణలో పెట్టుబడులు పెరిగాయి. అంతర్జాతీయ సంస్థలను



హైదరాబాద్‌కు తీసుకువచ్చేందుకు దావోస్ వెళ్లాం. ప్రపంచ ఆర్థిక సదస్సులో భారీగా పెట్టుబుడులపై ఒప్పందాలు చేసుకున్నాం. తలసరి ఆదాయంలో తెలంగాణ అగ్రస్థానంలో ఉంది. స్కిల్ డెవలప్‌మెంట్ వర్సిటీ కోసం సింగపూర్ ప్రభుత్వంతో ఎంవోయూ చేసుకున్నాం. స్కిల్ డెవలప్‌మెంట్‌లో ఇదో అద్భుత పరిణామం' అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. దావోస్ పర్యటనలో గతేడాది కంటే నాలుగు రెట్లు ఎక్కువ పెట్టుబడులు వచ్చాయని ఐటిశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. తెలంగాణ ప్రజలు, యువతకు మేలు చేయాలనేదే తమ ప్రభుత్వ ఆలోచన అని చెప్పారు. ఎన్ని విమర్శలు చేసినా సలహా లాగే తీసుకున్నామన్నారు.

సింగపూర్ ప్రభుత్వంతో కలిసి పనిచేయాలని నిర్ణయించామని అన్నారు. సాంకేతిక నైపుణ్యం, విద్యార్థుల బదిలీ జరిగేలా ఒప్పందం చేసుకున్నామని చెప్పారు. రూ.450 కోట్లతో స్కిల్ సెంటర్ ఏర్పాటుకు క్యాపిటలాండ్ ముందుకు వచ్చిందని చెప్పుకొచ్చారు. స్విట్జర్లాండ్‌కు చెందిన మల్టీవాక్ గ్రూప్‌తో ఒప్పందాలు చేసుకున్నామని వివరించారు. దావోస్ పర్యటనలో రూ.1.80 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించామని ఉద్ఘాటించారు. వన్ ట్రిలియన్ ఎకానమీ దిశగా అడుగుపడిరదని చెప్పారు. మూసీ పునరుజ్జీవం, యువతకు ఉపాధిపై దృష్టిపెట్టామని తెలిపారు. మూసీని ప్రక్షాళన చేసి ప్రజలకు స్వచ్ఛమైన గాలి అందిస్తామన్నారు. హైదరాబాద్ అంటేనే బిజినెస్ అనే బ్రాండ్ ఏర్పడిరదని చెప్పుకొచ్చారు. సాంకేతిక నైపుణ్యాలకు హైదరాబాద్‌ను కేంద్రంగా మారుస్తామని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. 'గతేడాది దావోస్ సదస్సులో రూ.40వేల కోట్ల పెట్టుబడులపై ఒప్పందాలు జరిగాయి. ఇది స్థిరమైన, వ్యాపార అనుకూలమైన ప్రభుత్వం అని వ్యాపారులు విశ్వసించారు. అందుకే 2024 దావోస్ పర్యటనకంటే ఈసారి నాలుగు రెట్లు అధికంగా ఒప్పందాలు జరిగాయి. అధునాతన సాంకేతిక నైపుణ్యాలకు హైదరాబాద్‌ను కేంద్రంగా మార్చేలా ప్రణాళిక రూపొందించాం అని అన్నారు. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు యువతకు అందించేలా స్కిల్ యూనివర్సిటీ ప్రణాళిక ఉంది. దావోస్ ఒప్పందాల పెట్టుబడులతో కొత్తగా 49,500 ఉద్యోగాలు వస్తాయి. మూసీ నదిని ప్రక్షాళన చేసి నగర ప్రజలకు స్వచ్ఛమైన గాలిని అదిస్తాం అని శ్రీధర్‌బాబు తెలిపారు. మీడియా సమావేశంలో మంత్రి పొంగులేటి తదితరులు పాల్గొన్నారు.

# టెంపుల్ టూరిజం పట్ల నిర్లక్ష్యం

మొదటి పేజీ తరువాయి...

తదితరులు పాల్గొన్నారు. ప్రపంచస్థాయి ప్రమాణాలతో 150 ఎకరాల్లో ఈ పార్కును తీర్చిదిద్దారు. దీనిలో 25వేల జాతుల మొక్కలు ఉన్నాయి. 85 దేశాల నుంచి దిగుమతి చేసుకున్న అరుదైన వృక్షాలు, చెట్లు ఉన్నాయి. ఎక్స్ పీరియం పార్కులో రూ.లక్ష నుంచి రూ.3.5కోట్ల విలువ చేసే అరుదైన వృక్షాలను అందుబాటులో ఉంచారు. ఇప్పటికే పలు వృక్షాలను సినీ, రాజకీయ, వ్యాపార ప్రముఖులు కొనుగోలు చేశారు. రాందేవ్‌రావ్ ఆరున్నరేళ్ల పాటు శ్రమించి ఎక్స్ పీరియంను తీర్చిదిద్దారు. దీనిలో వివిధ ఆకృతుల్లో రాక్ గార్డెన్‌ను సిద్ధం చేశారు. 1500 మంది కూర్చునేలా యాంఫీ థియేటర్‌ను ఏర్పాటు చేశారు. రూ.150 కోట్ల విలువైన మొక్కలు, చెట్లు, వృక్షాలు కలిగిన ఏకైక పర్యాటక ప్రాంతంగా ఇది నిలిచింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఎం రేవంత్ మాట్లాడారు. అటవీ ప్రాంతాల సందర్శనకు మధ్యప్రదేశ్, ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి. మందిరాల దర్శనాల కోసం తమిళనాడు, ఇతర ప్రాంతాలకు వెళుతున్నాం. అన్ని సహజ వనరులు ఉన్న తెలంగాణపై గత ప్రభుత్వాలు దృష్టి పెట్టలేదన్నారు. ఎకో టూరిజంపై ఇటీవలే అసెంబ్లీలో చర్చించాం. పర్యాటక పాలసీ తీసుకువచ్చి ఎకో టూరిజాన్ని ప్రోత్సహిస్తాం అన్నారు. ఎకో టూరిజం కింద త్వరలో వికారాబాద్‌ను అభివృద్ధి చేస్తాం. రాష్ట్రంలో మరిన్ని పర్యాటక క్షేత్రాలు రావాల్సి ఉంది. వరితో పాటు వాణిజ్య పంటల ప్రోత్సాహానికి ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోందన్నారు. అనంతరం నటుడు చిరంజీవి మాట్లాడుతూ రాందేవ్‌ను కొనియాడారు. 'పొద్దుటూరు ప్రదేశం నాకు ముందే తెలుసు. నేను ఇల్లు కట్టుకున్నప్పుడే రాందేవ్ నాకు కొన్ని విదేశీ మొక్కలు ఇచ్చారు. మా ఇంటి వద్ద పెరిగిన మొక్కలను చూస్తే చాలా ఆహ్లాదకరంగా అనిపిస్తుంది. మన హైదరాబాద్‌లోనే ఇలాంటి మొక్కలను రాందేవ్ తీసుకురావడం అభినందనీయం. ఆయన వ్యాపారవేత్తగా కాకుండా కళాకారుడిగా కనిపించారని చిరంజీవి అన్నారు. ఎక్స్‌పీరియం పార్కు హైదరాబాద్‌కు తలమానికం అవుతుందని, ఒక కళాఖండంగా మిగిలిపోతుందని చిరంజీవి అన్నారు. విదేశాలకు వెళ్లినప్పుడు ఇలాంటి మొక్కలు, కళాకృతులు చూస్తుంటాం. ఇండియాకు తీసుకెళ్తే బాగుండని అనిపించేది. ఇక్కడ హైదరాబాద్ శివారులో అవి లభిస్తున్నాయంటే, చాలా ఆనందంగా ఉంది. మా ఇంటి దగ్గర నేను రోజూ కూర్చొనే ప్రదేశంలో బయటకు కనపడకుండా ఫెన్సింగ్‌లా డిజైన్ చేయమంటే, రాందేవ్ అద్భుతంగా చేసి ఇచ్చారు. నా ఇంటి చుట్టూ చాలా చక్కని చెట్లు పెట్టుకున్నా. రాందేవ్ 'కొత్తగా మొక్కలు వచ్చాయి చూస్తారా' అని అడుగుతూ ఉంటారు. ఒకప్పుడు వాటి ధరలు వేలు, లక్షల్లో ఉండేవి. ఇప్పుడు కోట్లలో ఉంటున్నాయి. అసలే నా సంపాదన అంతంత మాత్రంగా ఉంది.



కొనలేనేమో అనిపించింది. ముఖ్యమంత్రితో ఇక్కడకు వచ్చి, చూస్తే ఇవన్నీ కొనేయాలనిపిస్తోంది' 'ఇలాంటి వాటిని పెట్టాలంటే వ్యాపార దృక్పథం ఉంటే సరిపోదు. అందుకే రాందేవ్‌లో ఒక ఆర్టిస్ట్‌ను చూస్తా. మొక్కలపై అంత ఇష్టం లేకపోతే దాదాపు పాతికేళ్లు ప్రయోగాలు చేస్తూ, విదేశాల్లో ఉన్న అరుదైన మొక్కలను సైతం ఇక్కడకు తీసుకొచ్చి, ఇది సాధ్యమే అని నిరూపించారు. ఎక్స్‌పీరియంలోని శిలాకృతులు మన హైదరాబాద్‌కు అందం తీసుకొస్తాయి. డబ్బులు, స్థలం ఉంటే ఎవరైనా రియల్ ఎస్టేట్ చేద్దామని అనుకుంటారు. ప్రభుత్వ అనుమతి తీసుకుని, పెద్ద మల్టీస్టోర్ బిల్డింగ్ కడితే, తరాలు నిలిచిపోతుంది. కానీ, రాందేవ్ తన మదిలో ఉన్న దాన్ని వాస్తవంలోకి, తీసుకొచ్చారంటే నిజంగా హ్యాట్సాప్. ఇది షూటింగ్స్‌కు ఇస్తారా రాందేవ్' అని అడిగితే, 'ఫస్ట్ మీ మూవీ షూట్ అయితే ఇస్తా' అన్నారు. ఇప్పుడు కొత్త హీరోయిన్‌ను తీసుకొచ్చి స్టెప్పులు వేయాలంటే ఈ ఎండలో ఎలా ఉంటుందో. వచ్చే శీతాకాలంలో చూద్దాం. ఈలోగా వర్షాలు పడి, మరింత పచ్చదనం పెరుగుతుంది. ఒకట్రెండు ఏళ్లలో కంటికి ఇంపుగా ఉంటుంది. ప్రభుత్వం కూడా రాందేవ్ ఆలోచనలకు సహకారం అందించి, టూరిజం అభివృద్ధికి కృషి చేస్తుందని ఆశిస్తున్నానని అన్నారు. ఎక్స్‌పీరియం హైదరాబాద్‌కు అద్భుతమైన ల్యాండ్ మార్క్ అవుతుంది. హైదరాబాద్ ఇల్లు అనుకుంటే, ఇంట్లో చక్కని పెయింటింగ్ పెట్టుకుంటే ఎలా ఉంటుందో ఈ రోజు ఎక్స్‌పీరియం లాంటిదని చిరంజీవి అన్నారు.

## 150 ఎకరాల్లో ఏకో ఫ్రెండ్లీ పార్కు

**హైదరాబాద్ జనవరి 28 (నిఘా న్యూస్):** శంకర్‌పల్లి మండలం, ప్రొద్దుటూరులో ప్రపంచంలోనే అతిపెద్ద ఫ్రెండ్లీ పార్కును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రముఖ సినీ నటుడు మెగాస్టార్ చిరంజీవి మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, పలువురు నేతలు, ముఖ్య అధికారులు పాల్గొన్నారు. ప్రకృతి ప్రేమికుల కోసం నగర శివార్లలో నిర్మించిన అతిపెద్ద ఎకో ఫ్రెండ్లీ 'ఎక్స్ పీరియం' పార్క్‌ను ప్రారంభించారు. అంతర్జాతీయ స్థాయిలో రామ్‌దేవ్‌రావు 150 ఎకరాలలో ఏర్పాటు చేసిన పార్కులో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న 25 వేల జాతులకు సంబంధించిన మొక్కలు ఉన్నాయి. అర్జెంటీనా, ఉరుగ్వే, మెక్సికో, సౌత్ అమెరికా, స్పెయిన్, ఇటలీ, న్యూగినియా, ఆస్ట్రేలియా, థాయ్‌లాండ్, ఇండోనేషియా, మలేషియా తదితర దేశాల నుంచి అరుదైన మొక్కలు, చెట్లు, రకరకాల స్టోన్స్, అందమైన శిలలు సేకరించి గార్డెన్‌ను ఏర్పాటు చేశారు. దీని కోసం సుమారు రూ. 150 కోట్లు ఖర్చు చేశారు. ఒక్కో శిల్పానికి రూ. 5 లక్షల నుంచి కోటి రూపాయల వరకు ఖర్చు చేశారు. 1,500 మంది కూర్చునేలా ఇండియాలోనే అతిపెద్ద హంపి థియేటర్‌ను ఏర్పాటు చేశారు. 30 అడుగుల ఎత్తులో 20 స్టెయిన్ లెస్ స్టీల్ శిల్పాలు ఏర్పాటు చేసి వాటిని ఎంతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. రూ. 50 కోట్లతో 12 ఎకరాలలో మ్యాన్‌మేడ్ బీచ్ ఏర్పాటు చేశారు. 40 గదులు, 20 కాటేజీలతో సుందరమైన సహజ రిసార్టు ద్వీపంగా తీర్చిదిద్దారు. పీవెడ్డింగ్, పోస్టు వెడ్డింగ్, ఫొటో షూట్‌లకు ఎక్స్‌పీరియంను రామ్‌దేవ్‌రావు ఎంతో శ్రమకోర్చి ఏర్పాటు చేశారు. దేశానికి గర్వకారణంగా, రాష్ట్ర ప్రతిష్టకు చిహ్నంగా, హైదరాబాద్‌కు ఐకానిక్‌గా ఎక్స్‌పీరియం ఉంటుందన్నారు.

## జూన్‌లోగా.... నామినేటెడ్ పోస్టుల భర్తీ

మొదటి పేజీ తరువాయి...

చంద్రబాబు టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవి పొందిన వాళ్ల రెండేళ్ల పనితీరుపై సమీక్ష చేస్తామని తెలిపారు. దాని ఆధారంగా మళ్లీ నిర్ణయాలు, భవిష్యత్ అవకాశాలు ఉంటాయని వివరించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీలు, దేవాలయ కమిటీల నియామకంపై ఎమ్మెల్యేలు సరైన ప్రతిపాదనలు పంపాలని సూచించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీలు, దేవాలయ కమిటీల్లో పదవి ఆశిస్తున్న వాళ్లు క్యాబ్స్ విభాగాల్లో సభ్యులుగా ఉండాలన్నారు. కష్టపడిన కార్యకర్తలు, నాయకులకు న్యాయం చేసేలా నామినేటెడ్ పదవులు ఇస్తామని వెల్లడిరచారు. ప్రభుత్వ కార్యక్రమాలు, పార్టీ వ్యవహారాలు, నేతల పనితీరు వంటి అంశాలపై ఇందులో చర్చించారు. 2029లో మళ్లీ గెలిచేలా ప్రతి ఒక్కరి పనితీరు ఉండాలని తేల్చి చెప్పారు. 7 నెలల కాలంలో ఎన్నో పథకాలు, కార్యక్రమాలు, అభివృద్ధి పనులు చేపట్టామన్న చంద్రబాబు ఈ విషయాలను నిరంతరం ప్రజలకు వివరించాలని స్పష్టం చేశారు. ఎన్నికల హామీల్లో ఇచ్చిన పథకాలన్నీ అమలు చేస్తామని, ఈ విషయంలో వైకాపా తప్పుడు ప్రచారాన్ని ఎండ గట్టాలని నేతలకు సూచించారు. మెంబర్ షిప్ బాగా చేసిన వారికి పదవుల్లో ప్రోత్సాహం ఇస్తామన్నారు. అలాగే ప్రభుత్వ కార్యక్రమాలు, పార్టీ వ్యవహారాలు, నేతల పనితీరు వంటి అంశాలపై వారితో చర్చించారు. ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎంపిలు పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని కార్యకర్తలకు, ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలని సూచించారు. చరిత్రలో తిరుగులేని విజయాన్ని అందించిన ప్రజలు, కార్యకర్తల ఆశలు తీర్చేందుకు, ఆకాంక్షల మేరకు ప్రతి ఒక్కరూ పనిచేయాలన్నారు. 2029లో మళ్లీ గెలిచేలా ప్రతి ఒక్కరి పనితీరు ఉండాలన్నారు. ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను, పథకాలను ప్రజలకు వద్దకు తీసుకువెళ్లాలని కార్యకర్తలకు తెలిపారు. ప్రభుత్వ పని తీరును నిరంతరం పర్యవేక్షించుకుంటూ, మెరుగు పరుచుకుంటూ పనిచేయాలని నిర్దేశిరచారు. ఏడు నెలల కాలంలో ఎన్నో పథకాలు, కార్యక్రమాలు, అభివృద్ధి పనులు చేపట్టామని, ఈ విషయాలను నిరంతరం ప్రజలకు వివరించాలని తెలిపారు. ఎన్నికల హామీల్లో ఇచ్చిన పథకాలన్నీ అమలు చేస్తామని, ఈ విషయంలో వైసీపీ తప్పుడు ప్రచారాన్ని ఎండగట్టాలని ఆదేశించారు. గత 5 ఏళ్లు కార్యకర్తలు తిరుగులేని పోరాటం చేశారని, వారి కష్టం ఫలితమే మొన్నటి ఎన్నికల విజయమని చెప్పుకొచ్చారు. కార్యకర్తలను ఎప్పుడూ గౌరవించుకోవాలని ఎన్నికలు అయిపోయాయి తాను ఎమ్మెల్యే, ఎంపి అయిపోయాను అని ఎవరూ భావించవద్దన్నారు. కష్టపడిన కార్యకర్తలు, నాయకులకు న్యాయం చేసేలా నామినేటెడ్ పదవులు ఇస్తామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. పేర్నినాని ముందస్తు బెయిల్‌పై హైకోర్టులో ఏం జరిగిందంటే వ్యవసాయ మార్కెట్ కమిటీలు, దేవాలయ కమిటీల నియామకంపై ఎమ్మెల్యేలు సరైన ప్రతిపాదనలు పంపాలన్నారు.

# బాకీ అడిగినట్లు కాంగ్రెస్‌ను నిలదీయండి

మొదటి పేజీ తరువాయి...

నిర్వహించారు. అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ రైతు బంధు కింద కేసీఆర్ ప్రభుత్వం రైతులకు రూ.73 వేల కోట్లు ఇచ్చింది. నల్గొండ బిడ్డలు జీవచ్ఛవంగా మారడానికి కారణం కాంగ్రెస్ పార్టీ అని దుయ్యబట్టారు. ఆ పార్టీ అధికారంలోకి వస్తే రైతుబంధుకు రాం రాం అవుతుందని కేసీఆర్ ఎప్పుడో చెప్పారు. అధికారంలోకి వచ్చి ఏడాదైనా రైతుబంధు నిధులు ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని కేటీఆర్ విమర్శించారు. రాష్ట్రంలో రైతుబంధు పథకాన్ని కొనసాగిస్తే ఆయనను ఎవరూ దేకరని, ఆ పథకాన్ని తీసుకొచ్చిన కేసీఆర్ పేరే నిలబడుతదనే భయం సీఎం రేవంత్ రెడ్డి లో ఉన్నదని కేటీఆర్ ఎద్దేవా చేశారు. అందుకే రైతుబంధు ఇవ్వడంలేదని ఆరోపించారు. ఇప్పుడు స్థానిక సంస్థలు, పంచాయతీ ఎన్నికల కోసం రేవంత్ మళ్లీ రైతుభరోసా నాటకం ఆడుతున్నాడని, ఎన్నికలు అయిపోంగనే రైతుబంధు మళ్లీ బందేనని ఆయన విమర్శించారు. ఓట్ల కోసం వచ్చే కాంగ్రెస్ నేతలను జనం నిలదీయాలని పిలుపునిచ్చారు. ఎన్నికల ముందు రేవంత్ రెడ్డి అన్ని పంటలకు క్వింటల్‌కు రూ.500 బోనస్ ఇస్తమన్నడు. మరె ఎవరికన్నా బోనస్ పైసలు పడ్డయా..? ఇప్పుడు మాట మార్చి సన్నవడ్లు పండిస్తెనే బోనస్ ఇస్తం అంటున్నరు. ఇగ వ్యవసాయ మంత్రి అయితే సన్నవడ్లకు బోనస్ ఇచ్చుడు బాగుంది, రైతు భరోసా అక్కెరే లేదని రైతులే చెప్తున్నరు అంటున్నడు. ఇప్పుడు ఎన్నికలు ఉన్నయ్ కాబట్టి రైతుభరోసా ఇస్తం అని నాటకమాడుతున్నరు. ఈ నాటకాలను మీరు గమనించాలె. ఎన్నికలు అయిపోంగనే రైతు భరోసా కూడా బంద్కెతది' అని కేటీఆర్ హెచ్చరించారు. ఇప్పుడు ఆరోగ్య శ్రీ అంటే వైఎస్ఆర్ యాదికొస్తరు. రైతుబంధు అంటే కేసీఆర్ గుర్తుకొస్తరు. అందుకే రైతుబంధు ఇస్తే కేసీఆర్‌కే పేరు వస్తదని, ఆయనను ఎవరూ దేకరని రేవంత్‌రెడ్డి భయపడుతున్నడు. రాష్ట్రంలో కేసీఆర్ ఆనవాళ్లే లేకుండా చేస్తానని రేవంత్ రెడ్డి చెప్పిన విషయాన్ని మీరు ఇక్కడ గమనించాలె అని అన్నారు. రైతు భరోసా పేరుతో రేవంత్ రెడ్డి ఇచ్చిన ఎన్నికల హామీ ప్రకారం ఇప్పుడు రైతులకు ఒక్కో ఎకరానికి రూ.17,500 బాకీ ఉన్నడు. కాంగ్రెసోళ్లు ఇప్పుడు మళ్లా ఓట్లు అడగడానికి వస్తరు. అప్పుడు ఈ బాకీ డబ్బులు అడుగుండ్రి.

రుణమాఫీ ఏమైందని అడుగుండ్రి. ఏమైంది బోనస్ అని అడుగుండ్రి. ఆరుగ్యారంటీలు ఏమైనయని నిలదీయుండని కేటీఆర్ నల్లగొండ రైతులను కోరారు. రేవంత్‌రెడ్డి ఎన్నికలకు ముందు పెద్దపెద్ద మాటలు చెప్పిండని, అధికారంలోకి వచ్చినంక ఒక్క మాట కూడా నిలబెట్టుకోలేదని కేటీఆర్ విమర్శించారు. రైతు రుణమాఫీ విషయంలో రేవంత్ సర్కారు అట్టర్‌ప్లాప్ అయ్యిందన్నారు. అసెంబ్లీలో ఇదే విషయమై నిలదీస్తే రేవంత్ రెడ్డి నోరు మెదపలేదన్నారు. ఇప్పటికీ రుణమాఫీకి ప్రభుత్వం చేసిన ఖర్చు రూ.12 వేల కోట్లు కూడా దాటలేదన్నారు. ఇప్పుడు గ్రామ సభల్లో అధికారులను రైతులు నిలదీస్తున్నరు. ఏమాయె రుణమాఫీ అంటే సమాధానం లేదు. ఏమాయె ఆరు గ్యారంటీలు అంటే సమాధానం లేదు. కేసీఆర్ బిచ్చమేసినట్టు రూ.10 వేలే ఇస్తున్నడూ నేను రూ.15 వేలు ఇస్తా అని రేవంత్ రెడ్డి చెప్పిండు. మరె ఇస్తున్నడా రూ.15 వేలు..? ఆఖరికి రూ.12 వేలు ఇయ్యాలని నిర్ణయం జేసిండ్రు. పైగా అది చారిత్రాత్మక నిర్ణయం అని అంటున్నడు. మోసం చేసుడు గూడా చారిత్రాత్మకమేనా అంటూ కెటిఆర్ ఎద్దేవా చేశారు. జనవరి 26 రాత్రి నుంచే రైతుల ఖాతాల్లో రైతు భరోసా డబ్బులు పడుతాయని చెప్పాడని, కానీ ఇంతవరకు రైతు భరోసా డబ్బులు రాలేదని ఆయన ఆరోపించారు. నల్లగొండ బిడ్డలు జీవచ్ఛవాలుగా మారడానికి కారణమే కాంగ్రెస్. నల్లగొండ రైతుల అవస్థకు కారణమే కాంగ్రెస్. మిమ్మల్ని మోసం చేయడానికే కాంగ్రెస్ నేతలు కొత్త వేషాలు వేసుకుని ఎన్నికలకు వచ్చిండ్రు. మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిండ్రు' అని కేటీఆర్ మండిపడ్డారు. కాంగ్రెస్ పాలనలో మహాత్మాగాంధీ యూనివర్సిటీ లో విద్యార్థులు గొడ్డు కారంతో అన్నం తినాల్సిన దుస్థితి ఏర్పడిరదని ఆరోపించారు. ఐటీ టవర్ కళ తప్పిందని విమర్శించారు. తన రాక సందర్భంగా నల్లగొండ ప్రజల ఆదరణ చూస్తుంటే.. తాను రైతు ధర్నాకు వచ్చినట్లు లేదని, విజయోత్సవ ర్యాలీకి వచ్చినట్లు ఉందని అన్నారు. వెంకట్‌రెడ్డి వచ్చినంక అండ్ల ఎవలన్న ఉన్నరో.. లేకుంటే తాగుబోతుల అడ్డా అయిందోగానీ, మొత్తానికైతే ఐటీ టవర్ కళ తప్పింది' అన్నారు. ఒక విజయోత్సవ ఊరేగింపు జరిగినట్లుగా ఉంది. భారీగా ధర్నాకు తరలివచ్చిన నల్లగొండ రైతు బిడ్డలకు నేను కృతజ్ఞతలు తెలుపుతున్నా అని కేటీఆర్ చెప్పారు.

# అమీన్‌పూర్‌లో హైడ్రా కూల్చివేతలు

**సంగారెడ్డి జనవరి 28 (నిఘా న్యూస్):** హైడ్రా మరోసారి పంజా విసిరింది. అమీన్ పూర్‌లో హైడ్రా బుల్డోజర్లు రంగంలోకి దిగి అక్రమ నిర్మాణాలను కూల్చివేశాయి. ప్రభుత్వ స్థలాల పరిరక్షణ కోసం ఏర్పాటైన హైడ్రా అక్రమ నిర్మాణాలపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు అందిన వెంటనే హైడ్రా స్పందిస్తూ వాటిని కూల్చివేసే పనిలో పడుతోంది. ఆక్రమణదారుల వెన్నులో వణుకు పుట్టేలా చేస్తోంది హైడ్రా తాజాగా అమీన్ పూర్‌లో మరోసారి కూల్చివేతలు చేపట్టింది హైడ్రా అమీన్ పూర్ పద్మావతి లేఅవుట్‌లో అక్రమంగా వేసిన ఫెన్సింగ్‌ను మంగళవారం హైడ్రా అధికారులు తొలగించేశారు. సంగారెడ్డి జిల్లా అమీన్ పూర్ పెద్ద చెరువు సమీపంలో నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన ఫెన్సింగ్‌ను హైడ్రా కూల్చివేసింది. వైసీపీ మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డికి చెందిన ప్రహరీ గోడను గతంలో అధికారులు కూల్చివేశారు. అయితే తిరిగి మరోసారి అక్కడ ఫెన్సింగ్‌ను నిర్మించారు. దీనిపై ఐలాపూర్ రాజగోపాల్ నగర్, బందంకొమ్ము ప్రాంతాల్లో స్థానికులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. వెంటనే రంగంలోకి దిగిన హైడ్రా అధికారులు మరోసారి ఫెన్సింగ్‌ను కూల్చివేశారు. అమీన్ పూర్ చెరువు కబ్జా చేసి నిర్మించిన నిర్మాణాలను హైడ్రా కూల్చివేసింది. అక్రమాలపై వచ్చిన పలు ఫిర్యాదుల ఆధారంగా హైడ్రా అధికారులు విచారణ చేపట్టారు. ఆక్రమణ జరిగినట్లు తేలడంతో కూల్చివేతకు హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆదేశించారు. దీంతో వెంటనే హైడ్రా బుల్డోజర్లు అక్కడకు చేరకుని కూల్చివేతలు జరిపాయి. అమీన్ పూర్ పెద్ద చెరువుకు అనుకుని ఉన్న పద్మావతి నగర్ లేఅవుట్ ఆక్రమణకు గురైంది. 193, 194, 323 సర్వే నెంబర్లో 24 ఎకరాల్లో పద్మావతి లే అవుట్ విస్తరించి ఉంది. రాజకీయ పలుకుబడితో లే అవుట్‌ను కబ్జా చేసి చుట్టూ ప్రహరీ నిర్మించారు కబ్జా దారులు. ఏపీకి చెందిన ఓ మాజీ ఎమ్మెల్యే, అతని అనుచరులు కబ్జాకు పాల్పడ్డారని బాధితులు ఆరోపిస్తున్నారు. సుమారుగా 2006 నుంచి ఈ అంశంపై బాధితులు పోరాడుతున్నారు. ఏళ్లుగా స్థానికంగా ఎవరు పట్టించు కోలేదని వారు ఆరోపిస్తున్నారు. మొత్తం 294 ప్లాట్స్‌తో పద్మావతి నగర్ లే అవుట్ ఏర్పాటు చేశారు. గత నాలుగు నెలల క్రితం మొదటగా హైడ్రాను బాధితులు ఆశ్రయించారు. సర్వే చేసి మూడు నెలల క్రితం చుట్టూ నిర్మించిన గోడను హైడ్రా కూల్చివేసింది. అయితే హైడ్రా కూల్చివేతల తరువాత కొద్ది రోజులకే ఐరన్ ఫెన్సింగ్‌కు కబ్జా దారులు వేశారు. దీనిపై మరోసారి హైడ్రా ప్రజావాణిలో బాధితులు ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదుతో హైడ్రా మరోసారి కూల్చివేతలు చేపట్టింది. గతంలో కూడా అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలో పెద్దఎత్తున అక్రమ నిర్మాణాలను హైడ్రా కూల్చివేసిన విషయం తెలిసిందే. అమీన్‌పూర్‌లో అక్రమ నిర్మాణాలపై పెద్ద ఎత్తున ఫిర్యాదులు రావడంతో వెంటనే రంగంలోకి దిగిన హైడ్రా.. వాటిని కూల్చివేసింది. వందనపురి కాలనీ సర్వేనెంబర్ 848లో రోడ్డున ఆక్రమించి నిర్మించిన ఇళ్లను హైడ్రా కూల్చివేసింది. ఇళ్లు నిర్మాణంపై ఫిర్యాదులు అందడంతో వెంటనే స్పందించిన హైడ్రా అక్కడకు చేరుకుని ఇంటిని ప్రొక్లైనర్ల సహాయంతో నేటమట్టం చేసింది. భారీ బందోబస్తు నడుమ హైడ్రా కూల్చివేతలు చేసింది. హైడ్రా కూల్చివేతలపై వందనపురి కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు. చాలా కాలంగా అక్రమ ఇళ్ల నిర్మాణంపై పోరాటం చేస్తున్నట్లు వారు తెలిపారు. ఎన్నో సార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ అధకారులు ఎవరూ పట్టించుకోలేదని చివరకు హైడ్రాకు ఫిర్యాదు చేసిన రోజుల వ్యవధిల్లోనే అక్రమంగా నిర్మించిన ఇళ్లను కూల్చి వేసిందని కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు.



మెదక్ జిల్లా డిసిసి అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ ను తూప్రాన్ మండల్ యూత్ కాంగ్రెస్ నాయకులు కలిసి పెళ్లిరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఇందులో నర్సంపల్లి నాగరాజ్, జింక సుధాకర్ లంబ నరసింహులు, పోతిరెడ్డి తిరుపతిరెడ్డి, మన్నె తిరుపతి ఉన్నారు.

*–తూప్రాన్, జనవరి 28 (నిఘా న్యూస్):*

## కౌన్సిలర్ కోమిరెల్లి అనిత దంపతులకు వీడ్కోలు సన్మానం

### నిరంతరం ప్రజల సేవలోనే ఉంటాము: కోమిరెల్లి అనిత



**నాగారం, జనవరి 28 (నిఘా న్యూస్):** నాగారం మున్సిపాలిటీ 9వ వార్డు కౌన్సిలర్ గా ఐదు సంవత్సరాల పదవి కాలం దిగ్విజయంగా పూర్తి చేసుకున్న సందర్భంగా పిలిస్తే పలికె నాయకులుగా సేవలు అందించిన స్థానిక కౌన్సిలర్ కోమిరెల్లి అనిత దంపతులను మిత్రులు శ్రేయోభిలాషులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు అందించిన సేవలను అభినందించారు. రానున్న భవిష్యత్తులో ఏ ఎన్నికలు వచ్చినా తమ పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని మద్దతు ప్రకటించిచారు. ఈ కార్యక్రమంలో ఉచిడి దేవేందర్ రెడ్డి,కొత్త గోపాల్ రెడ్డి,మామిడి నవీన్ రెడ్డి,పైళ్ల మల్లా రెడ్డి,సారా బాల్ రాజ్, కోమిరెల్లి వీర రెడ్డి, మర్రికొండల్ రెడ్డి, తిరుమల రెడ్డి,చెంచి రెడ్డి,వల్లపురెడ్డి శ్రీధర్ రెడ్డి,ఏనుగు రమణ రెడ్డి,గోపిరెడ్డి నరహరి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కరోనా, వరదలు సైతం ఎదుర్కొని అభివృద్ధికి కృషి చేశాను

### తుక్కుగూడ మాజీ మున్సిపల్ చైర్మన్ కాంటేకార్ మధు మోహన్



**మహేశ్వరం, జనవరి 28 (నిఘా న్యూస్):** తుక్కుగూడ మున్సిపాలిటీ మొట్టమొదటి చైర్మన్‌గా గత నాలుగు సంవత్సరాల తొమ్మిది నెలల పాటు ప్రజలకు సేవలందించడం మున్సిపాలిటీనీ అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లే అవకాశం లభించినందుకు చాలా సంతోషంగా ఉందని చైర్మన్‌గా సేవలు అందించిన కాంటేకార్ మధుమోహన్ తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీసీ వర్గానికి చెందిన మధ్యతరగతి కుటుంబం నుంచి వచ్చిన తాను స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన మొదటి ఎన్నికల్లోనే రావిర్యాల 2వ వార్డు ప్రజలు ఆదరించి ఘన విజయాన్ని చేకూర్చారని తెలిపారు. తనకు చైర్మన్‌గా సేవలందించే అవకాశం ఇచ్చిన తుక్కుగూడ మున్సిపాలిటీ ప్రజలకు భవిష్యత్తులో తనకు పదవి ఉన్నా లేకున్నా జీవితాంతం సేవ చేస్తూనే ఉంటానని తెలిపారు. ఎమ్మెల్యే సబితా రెడ్డి కే. కేశవరావు తెలంగాణ రాష్ట్ర మాజీ హోం మంత్రి, ఎమ్మెల్సీ నాయిని నరసింహారెడ్డి , టీచర్ ఎమ్మెల్సీ జనార్దన్ రెడ్డి , ఎమ్మెల్సీ ఎగ్గె మల్లేశం ఆనాడు ఎక్స్ అఫీషియో మెంబర్స్‌గా తనకు మద్దతుగా ఓటువేసి, రాజ్యాంగబద్ధమైన చైర్మన్ పదవిలో కూర్చోవడానికి వీలు కల్పించారని, ఇందులో కీలక పాత్ర పోషించిన ఆ నాయకుకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఫిబ్రవరి ఒకటిన పద్మశాలీల ఆత్మీయ సమ్మేళనం



**ఉప్పల్, జనవరి 28 (నిఘా న్యూస్):** ఫిబ్రవరి ఒకటవ తేదీన భక్త మర్కండేయ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఉప్పల్ లోని కేకే ఆర్ గార్డెన్ లో జరిగే పద్మశాలి సంఘం ఆత్మీయ సమ్మేళనంలో ముఖ్య అతిథిగా పాల్గొవాలని ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి మందముల పరమేశ్వర్ రెడ్డిని పద్మశాలి సంఘం నాయకులు కలిసి ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం నాయకులు పాశికంటి నాగరాజు, సామల నాగరాజు, యెన్నం రాజేందర్, సామల కృష్ణ, దాసరి సురేష్, సత్యనారాయణ,గొల్లపల్లి నాగరాజు, నరేష్, మల్లేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

## నిజాంపేట్ ఆర్ ఐ జాన్సన్ కు అవార్డు



**నిజాంపేట్, జనవరి 28 (నిఘా న్యూస్):** 76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా సంగారెడ్డి జిల్లా కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో నిజాంపేట్ తహసిల్దార్ కార్యాలయంలో విధులు నిర్వహించే ఆర్ ఐ జాన్సన్ కు తెలంగాణ ప్రభుత్వం అవార్డును అందజేసింది. ఆయన విధులను గుర్తించి బెస్ట్ ఎంప్లాయిమెంట్ అవార్డును అందజేశారు. ఈ అవార్డును జిల్లా అదనపు కలెక్టర్ వల్లూరి క్రాంతి, టీజీ ఐ ఐ సి చైర్ పర్సన్ నిర్మల రెడ్డి ఎస్పీ రూపేష్ చేతుల మీదగా ఆర్ ఐ అందుకున్నారు. కార్యాలయంలో విధులు నిర్వహించే ఆర్ ఐ జాన్సన్ కు ఎమ్మార్వో నాగజ్యోతి అభినందనలు తెలిపారు.

# లక్ష డప్పులు-వెయ్యి గొంతుకల సన్నాహక ప్రదర్శన

- జనవరి 31న భువనగిరిలో నిర్వహణ
- భువనగిరి మాజీ మున్సిపల్ చైర్మన్ బర్రె జహంగీర్



**భువనగిరి, జనవరి 28 (నిఘా న్యూస్):** ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలని కోరుతూ జనవరి 31న జరిగే లక్ష డప్పులు వెయ్యి గొంతుకల మహాకళ ప్రదర్శనకు మద్దతుగా భువనగిరి జిల్లా కేంద్రంలో జరిగే ప్రదర్శనను పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని భువనగిరి మాజీ మున్సిపల్ చైర్మన్ బర్రె జహంగీర్ పిలుపునిచ్చారు.ఫిబ్రవరి 7న జరిగే లక్ష డప్పులు,వెయ్యి గొంతుల హైదరాబాద్ లో జరిగే మహాకళ ప్రదర్శన విజయవంతం చేయడంలో భాగంగా జనవరి 31న యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో వెయ్యి గొంతులు,లక్ష డప్పుల కళా బృందానికి ఘన స్వాగతం పలికి విజయవంతం చేసేందుకు పట్టణంలోని ఇందిర నగర్ వార్డులో ఎంఆర్పిఎస్ అధ్వర్యంలో డప్పు వాయిద్యాలతో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మున్సిపల్ చైర్మన్ బర్రె జహంగీర్ మాట్లాడుతూ భారతదేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇచ్చిన తర్వాత కూడా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వర్గీకరణ చేయకుండా మాదిగలకు తీవ్ర అన్యాయం చేస్తుందని దానికి నిరసనగా మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు ఫిబ్రవరి 7న కళాకారుల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున మహోత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిండు అసెంబ్లీ సాక్షిగా ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండి 30 సంవత్సరాల మాదిగల చిరకాల ఆకాంక్షను నెరవేర్చాలని కోరారు. ఎస్సీ వర్గీకరణ న్యాయమైనదని అందుకే సుప్రీంకోర్టు ఏడుగురు జడ్జిల్లా రాజ్యాంగ ధర్మాసనం చారిత్రాత్మక తీర్పును ఇచ్చిందని ఇది ఎవరికి వ్యతిరేకం కాదని అన్నారు. ఈ కార్యక్రమంలో బర్రె సుదర్శన్ మాదిగ, బందారు రవివర్ధన్ మాదిగ, బర్రె రమేష్ మాదిగ, పడిగల ప్రదీప్ మాదిగ, ఇటికల దేవేందర్ మాదిగ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి, బాణోత్ భాస్కర్ నాయక్, కర్నాల రమేష్ మాదిగ దర్గాయి గణేష్,బండారు శివశంకర్ మాదిగ, గోపే రాజు మాదిగ, పెంబర్తి రాజు మాదిగ, కర్నాల బాబు, కర్నాల లక్ష్మి మాదిగ బుశపక మనీష్ మాదిగ,భూశపక రవి మాదిగ, దండు నర్సింహ మాదిగ కోళ్ల జహంగీర్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# సమస్యలు పరిష్కరించాలని ఎంపీ శబరికి దరఖాస్తుల వెల్లువ



**నంద్యాల, జనవరి 28 (నిఘా న్యూస్):** తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎంపీ శబరికి కలెక్టర్ రేట్ లో ఫిర్యాదుల వెల్లువ. వినతులు తీసుకొని అధికారుల ద్వారా పరిష్కారం చూపించు అంటూ మంగళవారం నంద్యాల జిల్లా కలెక్టరేట్ కు జిల్లా నలుమూలల నుంచి వందలాది మంది భాధితులు వినతి పత్రాలతో తరలి రావడంతో జిల్లా కలెక్టర్ కార్యాలయం కిటకిటలాడింది. ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరికి వినతి పత్రాలు ఇచ్చేందుకు భాధితులు పోటీ పడడంతో నంద్యాల త్రీ టౌన్ సి ఐ కంబగిరి రాముడు పోలీస్ బందోబస్తూ మధ్య ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి భాధితుల నుంచి వినతి పత్రాలు స్వీకరించి సంబంధిత అధికారులకు అందించారు. ఆత్మకూరు మండలం ముష్టపల్లె, సిద్దపల్లె, పెద్ద అనంతపురం గ్రామస్థులు కర్నూలు – గుంటూరు జాతీయ రహదారి నిర్మాణం వల్ల మా గ్రామాలకు ప్రస్తుతం ఉన్న రహదారి మూసుకుపోతుందని, మండల కేంద్రం ఆత్మకూరుకు వచ్చేందుకు అదనంగా మూడు కిలోమీటర్లు దూరం చుట్టూ తిరిగి వెళ్లి, రావాల్చి వస్తుందని నేషనల్ హై వే అధికారుల ద్వారా మా గ్రామాల సమస్యకు పరిష్కారం చూపాలని, నంద్యాల మండలం అయ్యాలూరిమెట్ట వద్ద 167 కె.జాతీయ రహదారి నిర్మాణంలో ఇల్లు, స్థలాలు జీవనధారం కోల్పోతున్నామని, ముళ్ల చెట్లతో ఉన్న చక్కెర ఫ్యాక్టరీ భూములకు గజం రూ.ఐదు వేలు, 40 ఏళ్లుగా నివాసం ఉన్న మా పక్కా ఇళ్లకు గజం రూ.1500 లు ఇవ్వడం అన్యాయం అని మాకు పరిహారం పెంచి ఇప్పించాలని అయ్యలూరు మెట్ట భాదిత మహిళలు ఎంపీ శబరి కి వినతి పత్రం అందించారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ వికలాంగుల సంఘం జిల్లా అధ్యక్షులు డి పి మస్తాన్ వలి ఆధ్వర్యంలో దివ్యాంగులు జిల్లా వికలాంగుల సంక్షేమ శాఖ వారు అర్హులైన వికలాంగులకు బ్యాటరీ సైకిల్లు, వినికిడి మిషన్లు, చేతి కర్రలు, సెల్ ఫోన్లు, ల్యాప్ ట్యాప్ లు తదితర ప్రభుత్వం అందించేవి ఇవ్వడం లేదని వాటిని ఇప్పించి దివ్యాంగులకు మనో ధైర్యం కల్పించాలని ఎంపీ శబరికి వినతి పత్రం అందించారు. ఇలా గ్రామ సమస్యలు, వ్యక్తిగత, ప్రభుత్వం నుంచి రావాల్చిన నిధుల బకాయి తదితరు సమస్యలు, ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి కి వినతి పత్రాల రూపంలో భాధితులు అందించారు. మీ అందరికి అధికారుల ద్వారా దశల వారిగా పరిష్కారం చూపుతానని ఎంపీ శబరి భరోసా ఇచ్చారు.

# పేదిరిపాడ్ పాఠశాలలో రోబోటిక్స్ శిక్షణ



**మద్దూర్, జనవరి 28 (నిఘా న్యూస్):** సోహం అకాడమీ ఆఫ్ హ్యూమన్ ఎక్సలెన్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రోబోటిక్స్ ఇన్ అకాడెమిక్స్ శిక్షణ కార్యక్రమాన్ని నారాయణపేట జిల్లా మద్దూర్ మండలం పేదిరిపాడ్ గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విజయవంతంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాలకిష్టప్ప మాట్లాడుతూ కార్యక్రమంలో భాగంగా, 123 (7వ నుండి 9వ తరగతి వరకు) మంది విద్యార్థులు రోబోటిక్స్ ప్రాథమిక సూత్రాలను నేర్చుకున్నారు. ప్రతి విద్యార్థికి సర్టిఫికెట్లు అందించడమే కాకుండా, ప్రతి విద్యాసంస్థకు రోబోటిక్స్ కిట్స్ పంపిణీ చేయడం జరిగిందని అన్నారు.విద్యార్థులు శిక్షణ అనంతరం ఏడాది పొడవునా ఇన్నోవేషన్ ఛాలెంజ్‌లలో పాల్గొంటారు. అంతేకాకుండా, వారు వార్షిక రోబోటిక్స్ ప్రదర్శనల్లో పాల్గొని తమ ప్రతిభను చాటి చూపారు. విద్యార్థులకు శిక్షణ ఇవ్వడంలో స్ఫూర్తి డిగ్రీ కాలేజీ విద్యార్థులు, హైదరాబాద్ కాలేజ్ ట్రైనర్లు కీలక పాత్ర పోషించారు. ఈ కార్యక్రమాన్ని మరింత ప్రత్యేకతను కల్పించడానికి చింతలపూడి రాజేంద్ర కుమార్, శ్రీనివాస్,హెచ్. భానుప్రకాశ్ పాఠశాలను సందర్శించారు. వారు విద్యార్థులతో సంభాషిస్తూ రోబోటిక్స్ విద్య ద్వారా వారి భవిష్యత్తు సాంకేతిక పరిజ్ఞానాల్లో ఆవిష్కరణలు చేసేందుకు సిద్ధమవుతున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమం ఏ ఎమ్ డి సంస్థ స్పాన్సర్‌షిప్ తో నిర్వహించబడింది. సోహం అకాడమీ ప్రతినిధులు మాట్లాడుతూ ఈ రోబోటిక్స్ శిక్షణ విద్యార్థుల్లో సమస్య పరిష్కార నైపుణ్యాలను పెంపొందించడమే కాకుండా, వారిని భవిష్యత్తులో సాంకేతికతలో ఆవిష్కరణల వైపు నడిపించడమే మా ప్రధాన లక్ష్యం అని తెలియజేశారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న ఈ రోబోటిక్స్ విద్యా కార్యక్రమం ఇప్పటివరకు 23 జిల్లాల్లో 374 పాఠశాలల్లో 59,444 విద్యార్థులకు శిక్షణను అందించిందని తెలిపారు. నారాయణపేట జిల్లాలో ఈ శిక్షణ కార్యక్రమం పాఠశాల విద్యార్థుల భవిష్యత్తుకు తోడ్పడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# కుల దురంహకార హత్యలను ఆరి కట్టండి

### డిబిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రాజేందర్



**హనుమకొండ, జనవరి 28 (నిఘా న్యూస్):** సూర్యాపేట జిల్లా కేంద్రంలో దళిత యువకుడు వడ్లకొండ కృష్ణ అలియాస్ మాల బంటి (32) సంవత్సరాలు కులదురంహకార (పరువు)హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని,రాష్ట్రంలో కుల వివక్షను, కుల దురంహకార హత్యలను ఆరికట్టాలని, కులాంతర వివాహ జంటలకు రక్షణ కల్పించాలని దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చుంచు రాజేందర్ డిమాండ్ చేశారు. సూర్యపేట జిల్లా కేంద్రంలోని మామిండ్ల గడ్డ ప్రాంతంలో నివసిస్తున్న రియల్ ఎస్టేట్ వ్యాపారి దళిత యువకుడు వడ్లకొండ కృష్ణ అలియాస్ మాల బంటి సూర్యపేట తాళ్ళగడ్డకు చెందిన గౌడ కులానికి చెందిన బార్గవి ని గత ఐదు నెలల కింద నకిరేకల్ లో ప్రేమ వివాహం చెసుకున్నాడన్నారు. విరి ప్రేమ వివాహం చెసుకుంటారనె సమాచారంతో బార్గవి తండ్రి సైదులు, సొదరులు నవిన్ లు కులాంతర వివాహన్ని అడ్డుకోవడానికి ఒ కానిస్టేబుల్ తో పెండ్లి చేయాలని ప్రయత్నించగా, బార్గవి తన ఇంటి నుండి వచ్చి కృష్ణను పెండ్లి చెసుకున్నాదని, నాటి నుండి ఆయనను హత్య చేయడానికి ప్రయత్నం చెసి 2025 జనవరి 26 గణతంత్ర దినోత్సవం నాడు సాయంత్రం పథకం ప్రకారం తన స్నేహితుడైన బర్ల మహేష్ తో ఫొన్ చేయించడంతో నమ్మి వెళ్ళిన కృష్ణను బార్గవి సోదరుడు నవిన్ తన మిత్రులతో కలిసి ఒ ఇంట్లో బంధించి కండ్లలలో పొడిచి హింసించి ఉరి వేసి హత్య చేశారన్నారు. మృత దేహన్ని సూర్యాపేట. రూరల్ పోలీస్ స్టేషను పరిధిలోని పిల్లలమర్రి గ్రామ కెసి కెనాల్ కట్టపై పడెశారని,. మృతుడు తండ్రి పిర్యాదు మేరకు పోలీసులు అత్యాచారాల నిరొధక చట్టం కింద కేసులు నమోదు చేసినందున నిందితులందరిని తక్షణమే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిబిఎఫ్ డిమాండ్ చెస్తుందన్నారు. అదేవిధంగా ఇటివల రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం రాయపోల్ గ్రామంలో దళిత యువకుడు శ్రీకాంత్ ను కులాంతర వివాహం చేసుకున్న మహిళ కానిస్టేబుల్ నే తన తమ్ముడు అత్యంత దారుణంగా హత్య చేశాడని గుర్తు చేశారు.

# ఇల్లందులోఎమ్మెల్యేతో కలిసి రైతుల ఎడ్ల బండ్ల ర్యాలీ





**ఇల్లందు, జనవరి 28 (నిఘా న్యూస్):** ఇల్లందు పట్టణంలోని గోవింద్ సెంటర్ నుండి జగదంబ సెంటర్ వరకు ఇల్లందు నియోజకవర్గ ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆధ్వర్యంలో రైతులు ఎడ్లబండ్లతో ఆనందోత్సవ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలలో ఇందిరమ్మ ఇల్లు ఇందిరమ్మ భరోసా రేషన్ కార్డు వీటితోపాటు రైతు భరోసా ఇవ్వడంతో రాష్ట్ర ప్రభుత్వం రైతు ఖాతాలలో ఆరువేల రూపాయలు జమ చేయడం జరిగిందని అన్నారు. రైతును రాజు చేయడమే ప్రభుత్వ ఎజెండా అని మాట్లాడారు, పట్టణంలోని జగదంబ సెంటర్ నందు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మరియు మంత్రి భట్టి విక్రమార్క,పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే కోరం కనకయ్య చిత్రపటానికి రైతులు.కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాలాభిషేకం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మడుగు సాంబమూర్తి, మార్కెట్ చైర్మన్ బానోత్ రాంబాబు, ఇల్లందు పట్టణ మండల కాంగ్రెస్ నాయకులు దొడ్డ డానియల్,పులి సైదులు, కాంగ్రెస్ నాయకులు మండల రాము, కల్తీ పద్మ,పాయం స్వాతి, ఎదల పెల్లి అనసూర్య, బోళ్ల సూర్యం, గూడా బాబురావు, మొగిలి, కాంగ్రెస్ కార్యకర్తలు మహిళ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మున్నూరు కాపు సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

### హాజరైన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**ఉప్పల్, జనవరి 28 (నిఘా న్యూస్):** ఉప్పల్ నియోజకవర్గ మున్నూరు కాపు సంఘం క్యాలెండర్ ను ముఖ్య అతిథిగా హాజరై క్యాంపు కార్యాలయం వద్ద ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మున్నూరు కాపు సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మున్నూరు కాపు సంఘం సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ నియోజకవర్గ మున్నూరు కాపు సంఘం కన్వీనర్ గంధం నాగేశ్వర్ రావు, చీఫ్ అడ్వైజరీ కందుల లక్ష్మి నారాయణ పటేల్, అధ్యక్షుడు తిపిరి రాజ బాబు, నాయకులు గడ్డం శ్రీనివాస్, పంతులు నరసింహా, మున్నూరు కాపు సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.–

## వార్డు సభ్యుడి స్థాయికి దిగజారిన కేంద్ర మంత్రి బండి

### గద్దర్ పై బండి చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలి

### టీజేఏసీ జిల్లా కన్వీనర్ టీజీ శ్రీనివాస్



**పెబ్బేరు, జనవరి 28 (నిఘా న్యూస్):** గద్దర్ పై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని టిజెఎసి జిల్లా కన్వీనర్ టీజి. శ్రీనివాస్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా పనిచేస్తూ వార్డు మెంబర్ స్థాయిలో ఉన్న నాయకుడిలా మాట్లాడడం సరైంది కాదని తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో తెలంగాణ రాష్ట్ర ప్రక్రియ ఏర్పాటులో గద్దర్ పాత్ర వెలకట్టలేనిదని తన ఆట పాటలతో తెలంగాణ ఉద్యమాన్ని ముందుండి నడిపించిన ఘనత గద్దర్ కే దక్కుతుందని అన్నారు.

## రహదారి భద్రతపై విద్యార్థులకు అవగాహన

### విద్యార్థి దశ నుండే అవగాహన పెంచుకోవాలి

### ఉప్పల్ ట్రాఫిక్ సిఐ లక్ష్మీ మాధవి






**రామంతపూర్, జనవరి 28 (నిఘా న్యూస్):** విద్యార్థి దశనుంచే ట్రాఫిక్ నిబంధనల పై అవగాహన ఏర్పరుచుకోవాలని ఉప్పల్ ట్రాఫిక్ సిఐ లక్ష్మీ మాధవి సూచించారు. రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా మంగళవారం రామంతపూర్ పాలిటెక్నిక్ విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వాహనాలు నడిపే ప్రతీ ఒక్కరు డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాల న్నారు. దేశ భవిష్యత్ యువత చేతిలో ఉందని, తొందరపాటు తనంతో నిర్లక్ష్యంగా వాహనాలు నడిపి ప్రమాదాలకు గురి కావద్దన్నారు. అతి వేగంతో, అజాగ్రత్తగా వాహనాలు నడపడంతో నడిపే వారితోపాటు ఎదుటి వారు కూడా ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందన్నారు. నేటి సమాజంలో పెరుగుతున్న ఆధుని కతతోపాటు సైబర్ క్రైంలు, మోసాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన చర్యలపై వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రమేష్ ఆర్ఎస్ఐ బాల నరేష్, పాలిటెక్నిక్ కళాశాల అధ్యాపక బృందం పాల్గొన్నారు.–

## మతిస్థిమితం కోల్పోయి మాట్లాడుతున్న బండి సంజయ్

### గద్దర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన బండి క్షమాపణలు చెప్పాలి



**మహేశ్వరం, అర్బన్, జనవరి 28 (నిఘా న్యూస్):** ప్రజా యుద్ధ నౌక గద్దర్ పై కేంద్ర మంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలను మహేశ్వరం అసెంబ్లీ సోషల్ మీడియా అధ్యక్షులు ఎర్ర చంద్రమోహన్ తీవ్రంగా ఖండించారు. విలేకరులతో మాట్లాడుతూ కేంద్రమంత్రి బండి సంజయ్ మతిస్థిమితం కోల్పోయి మాట్లాడుతున్నారని అన్నారు. గద్దర్ జీవితాంతం ప్రజల కోసం ఆడి పాడారన్నారు. పాటలు, సాహిత్యం ద్వారా ప్రజల్ని చైతన్యపరచి, దొరల పాలనకు దడ పుట్టించిన వీరుడు గద్దర్ తెలిపారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో పొడుస్తున్న పొద్దు మీద నడుస్తున్న గానమా అనే పాటతో ఉద్యమానికి ఊపిరి పోశారన్నారు. తెలంగాణ ఉద్యమంలో విద్యార్థుల ప్రాణాలు కోల్పోతుంటే చూసి చలించి ముందుండి ఉద్యమాన్ని నడిపిన యుద్ధ నౌక గద్దర్ . పల్లె పట్టణ ప్రజలను చైతన్యం చేస్తూ చివరి వరకు ప్రజల కోసమే తన జీవితాన్ని త్యాగం చేసిన గొప్ప వ్యక్తి గద్దర్ గురించి కనీస అవగాహన లేని బండి సంజయ్ ఇకనైనా గద్దర్ పై చేసిన వ్యాఖ్యలని ఉపసంహరించుకోవాలన్నారు. వెంటనే క్షమాపణ చెప్పాలని కోరారు.

# పిస్తా హౌస్ వద్ద ఫుట్ ఓవర్ బ్రిడ్జితో పాటు పార్కు అభివృద్ధి

- మోడల్ గ్రేవ్ యార్డుకు శంకుస్థాపన చేసిన మేయర్ గద్వాల
- పాల్గొన్న డిప్యూటీ మేయర్, కార్పొరేటర్ బన్నాల



**చిలుకానగర్, జనవరి 28 (నిఘా న్యూస్):** గ్రేటర్ లో ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ఫోకస్ పెట్టినట్లు మేయర్ గద్వాల్ విజయలక్ష్మి వెల్లడించారు. మంగళవారం ఉప్పల్ సర్కిల్ చిలుకా నగర్ వార్డు లో సుమారు రెండు కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన మోడల్ గ్రేవ్ యార్డ్ ను డిప్యూటీ మేయర్ శ్రీలత, చిలుకా నగర్ కార్పొరేటర్ బన్నాల గీత, జోనల్ కమీషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ లతో కలిసి మేయర్ శంకుస్థాపన చేశారు. అనంతరం చిలుకా నగర్ లోని పలు కాలనీల సమస్యల పై కార్పొరేటర్ బన్నాల గీత వివరించగా వాటిని డిప్యూటీ మేయర్, అధికారులతో కలిసి సమస్యలను పరిశీలన చేసిన మేయర్ అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మేయర్ పిస్తా హౌస్ వద్ద ఫుట్ ఓవర్ బ్రిడ్జితో పాటు అక్కడ ఉన్న ఖాళీ స్థలంలో పార్కు అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. బ్యాంకు కాలనీలో ఓపెన్ డ్రైనేజీ స్థానంలో బాక్స్ డ్రైనేజీ పనులకు అంచనా ప్రాతిపదికకు అనుగుణంగా నిధులు మంజూరు కాలేదని, ఇంతకు ముందు ప్రతిపాదించిన అంచనా మేరకు నిధులు మంజూరు చేయాలని కార్పొరేటర్ కోరగా, అవసరమైన నిధుల మంజూరుకు నివేదిక పంపాలని జోనల్ ఎస్.ఈ ని మేయర్ ఆదేశించారు. చిలుకా నగర్ మెయిన్ రోడ్డు పోచమ్మ టెంపుల్ చౌరస్తా వద్ద బోడుప్పల్ మున్సిపాలిటీ నుండి స్టామ్ వాటర్ డ్రైన్, ఇండస్ట్రియల్ స్టామ్ వాటర్ ఓవర్ ఫ్లో నీరు కాలనీలోకి రావడంతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారని కార్పొరేటర్ బన్నాల గీత వివరించి, ప్రధాన ట్యాంక్ లైన్ నిర్మాణం చేపట్టాలని కోరగా, మేయర్ పరిశీలన చేసి వాటర్ వర్క్స్ ఎండి తో మాట్లాడి తగు చర్యలు తీసుకుంటామన్నారు. నాచారం చెరువు మత్తడి నుండి ఓవర్ ఫ్లో తో కాలనీలోకి చెరువు నీరు రావడంతో ఇబ్బందులు పడుతున్నట్లు మల్లికార్జున్ నగర్ కాలనీవాసులు మేయర్ కు విన్నవించగా వరద నివారణకు చర్యలు తీసుకోవాలని జోనల్ ఎస్ ఈ ని ఆదేశించారు. అజాం పూర్ అలకపూరి నార్త్ కాలని వద్ద పార్కు అభివృద్ధి కి చర్యలు తీసుకుంటామని ఓపెన్ జిమ్ ఏర్పాటు తో పాటుగా వాకింగ్ ట్రాక్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని మేయర్ అధికారులను ఆదేశించారు. మిస్టాట్ ఎన్ క్లేవ్ నాలా క్రాసింగ్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని గతంలో ఉన్న క్రాసింగ్ బ్రిడ్జి వరద నీరు నిలిచి దెబ్బతిన్న నేపథ్యంలో



ఎత్తయిన బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని కాలనీవాసులు కోరారు. ఇందిరా నగర్ ప్రస్తుతం ఉన్న కమ్యూనిటీ హాల్ నిర్మాణం తొలగించి మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్ నిర్మాణం చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని మేయర్ కాలనీవాసులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, ఎస్సీ నిత్యానందం, డిప్యూటీ కమిషనర్ ఆంజనేయులు, ఏ ఎమ్ హెచ్ ఓ రంజిత్, హార్టికల్చర్ డిడి అన్నపూర్ణ, పోలీసు ఏసిపి చక్రపాణి, సీఐ. ఎలక్షన్ రెడ్డి, ఎస్.ఐ లు చిరంజీవి, మాధవరెడ్డి, ప్రాజెక్ట్ ఆఫీసర్ రాధా రాణి, ఈఈ నాగేందర్, హరిలాల్, ఈ ఈ. నాయక్, డి ఈ. రవీందర్, డి ఈ. వెన్నెల గౌడ్,ఏఈ. వినీత్ తదితరులు పాల్గొన్నారు.

## రంగంపేటఎక్సైజ్ స్టేషన్ లో ఆకస్మిక తనిఖీలు

### కమిషనర్ ఆఫ్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్, నిశాంత్



**రంగంపేట, జనవరి 28 (నిఘా న్యూస్):** తూర్పుగోదావరి జిల్లా అనపర్తి నియోజకవర్గంలోని రంగంపేట ప్రొహిబిషవన్ ఎక్సైజ్ స్టేషను నందు కమిషనర్ ఆఫ్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్, నిశాంత్ మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ముందుగా కమీషనర్ కి సర్కిల్ ఇన్స్పెక్టర్ సుధారాణి పుష్పగుచ్ఛంతో ఆహ్వానం పలికారు. అనంతరం కార్యాలయం నందు రికార్డుల పరిశీలించి నేరములను నియంత్రించుటకు తగు సూచనలు ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంగంపేట ప్రొహిబిషవన్, ఎక్సైజ్ స్టేషన్ కార్యాలయం నందు రికార్డులను పనితీరును పరిశీలించడం జరిగిందని నాటు సారా వివిధ రాష్ట్రాల నుంచి వస్తున్న మద్యం ఏ విధంగా నియంత్రించాలనే వాటిపై సూచనలు ఇవ్వడం జరిగిందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో రంగంపేట ప్రొహిబిషవన్, ఎక్సైజ్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## రామాలయం నిర్మాణానికి లక్ష రూపాయల విరాళం

### శ్రీ కృష్ణానగర్ అధ్యక్షులు దారం శివ గుప్తా



**కుత్బుల్లాపూర్, జనవరి 28 (నిఘా న్యూస్):** కుత్బుల్లపూర్ నియోజకవర్గం శ్రీ కృష్ణ నగర్ లో నూతన రామలయం గుడి నిర్మాణం కోసం 129 డివిజన్ కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ చేతుల మీదుగా శ్రీ కృష్ణానగర్ అధ్యక్షులు దారం శివ గుప్తా రామలయం గుడి నిర్మాణం కోసం స్వయంగా లక్ష రూపాయలు విరాళం ఇచ్చారు. దేవుడి కృప లేనిదే మనం లేము అలాంటిది రామాలయం గుడికి. రూ లక్ష రూపాయలు ఇవ్వడం సంతోషంగా ఉంది అని వ్యక్తంచేశారు. రోజు మనం పూజించే దేవుడికి విరాళం ఇవ్వడం సంతోషంగా ఉందని అన్నారు. రాబోయే రోజుల్లో అనేకంగా అభివృద్ధి పనులు చేస్తామని తెలిపారు.


## పెదపూడిలో గోగులమ్మ వారి సంబరం



**పెదపూడి, జనవరి 28 (నిఘా న్యూస్):** అనపర్తి నియోజకవర్గం పెదపూడి మండలంగొల్లల మామిడాడలో సంత మార్కెట్ వద్ద గోగులమ్మ అమ్మవారి సంబరం ఘనంగా జరిగింది. ఈ సంబరంలో తీన్మార్ డప్పులు,గరగ నృత్యాలు చూపరులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి ద్వారంపూడి వెంకటరెడ్డి (చింతపండు)సబ్బెళ్ళ గంగిరెడ్డి,జి ఎన్ రెడ్డి, మేడపాటి హరి నారాయణ రెడ్డి, మురమళ్ళ వెంకటరమణ, కాకి సత్యనారాయణ, మేడపాటి వరప్రసాద్ రెడ్డి, జుత్తుక సూరికుమారి, ద్వారంపూడి, కొవ్వూరి, కడిమి వంశస్థులు, భక్తులు అమ్మవారి దర్శనం చేసుకున్నారని ఆర్గనైజింగ్ సెక్రటరీ కృష్ణ సుధాకర్, ఆలయ కమిటీ చైర్మన్ కడిమి వీర వెంకట మురళీకృష్ణ తెలిపారు.

## పీర్జాదిగూడ కమిషనర్ కు తుంగతుర్తి సన్మానం

### ఉత్తమ కమిషనర్ అవార్డు అందుకున్న త్రిల్లేశ్వర్ రావు



**మేడిపల్లి, జనవరి 28 (నిఘా న్యూస్):** పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ త్రిలేశ్వర రావు కు ఉత్తమ కమిషనర్ అవార్డు వచ్చిన సందర్భంగా పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. స్థానికంగా ఉన్న సమస్యల పరిష్కారానికి కమిషనర్ తో చర్చలు జరిపి, ప్రజల సమస్యలను త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పీర్జాదిగూడ కాంగ్రెస్ కమిటీ సభ్యులు, సీనియర్ నాయకులు, ఎస్సీ సెల్, ఎస్టీ సెల్, బీసీ సెల్, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ, మహిళా నాయకులు, అలాగే పార్టీకి చెందిన అన్ని విభాగాల నాయకులు పాల్గొన్నారు.



**నల్గొండ జిల్లాలో నిర్వహిస్తున్న రైతు ధర్నాలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తో కలిసి పాల్గొన్న అంబర్ పేట కార్పొరేటర్ ఇ.విజయ్ కుమార్ గౌడ్. ఈ కార్యక్రమంలో అంబర్ పేట డివిజన్ బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మల్లేష్ యాదవ్, సింగ జోగి శ్రీను, ధరమ్, సంతోష్ చారి తదితరులు పాల్గొన్నారు.**

*-నల్గొండ, జనవరి 28 (నిఘా న్యూస్):*

## తుర్కపల్లి లో మందకృష్ణ చిత్రపటానికి పాలాభిషేకం





### పద్మశ్రీ మందకృష్ణ చిత్రపటానికి పాలాభిషేకం

**ముస్తాబాద్, జనవరి 28 (నిఘా న్యూస్):** రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం తుర్కపల్లి గ్రామంలో ప్రతిష్టాత్మక పురస్కారం పద్మశ్రీ అవార్డుకు ఎంపికైన మందకృష్ణ మాదిగ చిత్రపటానికి ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. మాదిగ జాతికి ఎనలేని సేవలు చేసిన జాతి బిడ్డకు గౌరవం దక్కడం హర్షించదగ్గ విషయమని నాయకులు అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల ఉపాధ్యక్షుడు నాగరాజు మాదిగ, ఎమ్మార్పీఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు అశోక్ మాదిగ, ఉపాధ్యక్షుడు దుర్గాప్రసాద్ మాదిగ, అంబేద్కర్ సంఘ అధ్యక్షుడు మల్లేష్ మాదిగ, నాయకులు మాజీ సర్పంచులు దుర్గాప్రసాద్, అంకని భాను, నాయకులు ఎల్లం, దేవయ్య, రాజయ్య, ఎల్లయ్య బద్దయ్య ,రాములు చిన్న బాలయ్య అంజయ్య రంజిత్, భానుచందర్, నర్సింగం, ప్రవీణ్, కర్రోళ్ల నవీన్ విజయ్ తదితరులు పాల్గొన్నారు. పోతుగల్ లో ఎమ్మార్పీఎస్ నూతన కార్యవర్గం ముస్తాబాద్ మండలం పోతుగల్ గ్రామంలో మాదిగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ నూతన గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షుడు మాజీ ఎంపిటిసి కొండని బాలకిషన్, ఉపాధ్యక్షుడు చేపూరి హరిప్రసాద్, ప్రధాన కార్యదర్శి సర్వని శ్రీనివాస్, క్యాషియర్ పెంటం కృష్ణ,మారిగాని శ్రీకాంత్ లు బాధ్యతలు చేపట్టారు. ఫిబ్రవరి 7న హైదరాబాద్ లో తలపెట్టిన వేయి గొంతులు లక్ష డప్పులు ఎమ్మార్పీఎస్ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో జరగబోయే కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాదిగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రగుట్ల రాజు, క్యాషియర్ బాలెల్లయ్య, రాజమల్లయ్య, పర్శరాములు,అనిల్, దేవరాజు, వెంకటేష్, విక్రమ్, వేణు, రమేష్,పోచయ్య, దేవరాజు,నరేష్,శంకర్, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## యూజిసి గైడ్ లైన్స్ సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధం


### ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి సామిడి వంశీ వర్ధన్



**అబ్దుల్లాపూర్ మెట్, జనవరి 28 (నిఘా న్యూస్):** యూజిసి గైడ్ లైన్స్ సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంమని ఏఐఎస్ ఎఫ్ జిల్లా కార్యదర్శి సామిడి వంశి వర్ధన్ అన్నారు. అబ్దుల్లాపూర్ మెట్టు మండలం అఖిలభారత విద్యార్థి సమాఖ్య ప్రధాన కార్యదర్శి చింత వెంకటేష్ ఆధ్వర్యంలో రావి నారాయణ రెడ్డి కాలనీలో ఏర్పాటు చేసిన కౌన్సిల్ కార్యవర్గ సమావేశానికి ఏఐఎస్ఎఫ్ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి సామిడి వంశీ వర్ధన్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ కేంద్రం ఇటీవలే విడుదల చేసిన యూ జి సి గైడ్ లైన్స్ సర్క్యులర్ ను వెంటనే రద్దు చేయాలనీ డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయం వలన రాష్ట్రాలలో ఉన్న యూనివర్సిటీ లు తమ స్వభావం స్వయం ప్రతిపతిని కోల్పోతాయని, వీసీల నియామకాలలో రాజకీయ ప్రాబల్యం, డబ్బు ప్రమేయం ఉండే అవకాశం ఉంటుందని, అలాకాకుండా విద్యావేతలు వైస్ ఛాన్స్ లర్స్ గా ఎంపిక చేయాలంటే కేంద్ర గైడ్లైన్స్ ను వెంటనే రద్దు చేయాలని లేదంటే ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో వట్టి కార్తీక్ రెడ్డి,కాటి శ్రావణి, సంకి పార్వతి, అరవింద్, చందు, రాఘవ తదితరులు పాల్గొన్నారు.-

## అర్హులైన పేదలకు రేషన్ కార్డులు ఇవ్వాలి

### మాజీ మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రా రెడ్డి



**నాగారం, జనవరి 28 (నిఘా న్యూస్):** నాగారం మున్సిపల్ పరిధిలో రేషన్ కార్డుల లబ్ధిదారుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయిందని, గతంలో దరఖాస్తు చేసుకున్న సుమారు 600 మంది లబ్ధిదారుల జాబితా ఎంపిక అయి ఉండగా, ఇంటింటి సర్వే అనంతరం కేవలం 253 మందికి మాత్రమే అర్హత అధికారులు ప్రకటించారని మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రా రెడ్డి అన్నారు. ఈ విషయమై మున్సిపల్ మాజీ చైర్మన్ చంద్రా రెడ్డి మాట్లాడుతూ ఇంకా వందలాది అర్హులైన కుటుంబాలు రేషన్ కార్డుల కోసం ఎదురు చూస్తున్నాయని తెలిపారు. సర్వేలో సరైన లబ్ధిదారులను ఎంపిక చేయడంలో లోపాలున్నాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, కార్డులను తొలగించడం బాధాకరమని ఆయన వ్యాఖ్యానించారు. రేషన్ కార్డుల కోసం ప్రయత్నిస్తున్న పేదలు ప్రభుత్వంపై తమ అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మాకు రేషన్ కార్డులు రాలేదు, మా కుటుంబాలు ఆకలితో అలమటిస్తున్నాయని బాధితులు వాపోయారని అన్నారు. ఈ రేషన్ కార్డుల ద్వారా ఆరోగ్యశ్రీ, విద్యుత్ బిల్ మాఫీ, గ్యాస్ సబ్సీడీ,ఇందిరమ్మ ఇల్లు వంటి కీలక సంక్షేమ పథకాలు లభిస్తుండటంతో, ప్రతి కుటుంబానికి ఈ కార్డులు అవసరమని స్థానికులు పేర్కొన్నారని ఆయన అన్నారు. ఈ పథకాలతో పేదల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయనే నమ్మకం ఉందని, కానీ వాస్తవంలో పేదల ఆశలు నెరవేరడం లేదని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు అందించేలా చర్యలు తీసుకొని, మున్సిపల్ పేద ప్రజల సమస్యను తక్షణమే పరిష్కరించాలని మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రా రెడ్డి అన్నారు.

## బాల్య వివాహ యత్నాన్ని అడ్డుకున్న అధికారులు



**రావికమతం, జనవరి 28 (నిఘా న్యూస్):** రావికమతం మండలం తట్టబంద గ్రామంలో పదహారేళ్ళ మైనర్ బాలికకు అదే గ్రామానికి చెందిన 30 ఏళ్ల యువకుడితో ఫిబ్రవరి 16న వివాహం నిశ్చయించారు. తమకు అందిన సమాచారంతో రావికమతం సెక్టార్ సూపర్వైజర్ సరోజినీ తో పాటు అంగన్వాడి కార్యకర్తలు నాగమణి ధర్మవతి సచివాలయం మహిళా పోలీస్ పావని హెల్ప్ లైన్ అధికారి రాజు మంగళవారం బాలిక ఇంటికి వెళ్లి మైనర్ బాలిక వివాహం జరిపించడంపై ఆరా తీసి బాలిక తల్లిదండ్రులను బంధువులను ప్రశ్నించారు.

## ఉద్యమంలో పాల్గొనని..

## ఉద్యమకారులకు ఎఫ్ఐఆర్, బైండోవర్ పత్రాలు లభించవు



**వలిగొండ, జనవరి 28 (నిఘా న్యూస్):** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ పట్టణ కేంద్రంలో మంగళవారం తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కో కన్వీనర్ శీలం స్వామి, మండల అధ్యక్షుడు మారగోని శ్రీనివాస్ గౌడ్ ఒక పత్రిక ప్రకటనలో ఈ విధంగా తెలియజేశారు. తెలంగాణ ఉద్యమకారులకు ఉండవలసిన ధృవపత్రాలలో ఎఫ్ఐఆర్లు గానీ, బైండ్ ఓవర్ కేసులు గాని ఉండాలని నియమ నిబంధనలు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తుందని, కొందరు ఉద్యమ నాయకులు ఎఫ్ ఐ ఆర్ ధృవపత్రాలు, బైండోవర్ ధృవపత్రాలు ఇప్పించడానికి ప్రయత్నం చేస్తున్నారని, అవి మోసపూరితమని వారు అన్నారు. వారు చేసే చిల్లర ఎత్తులు సాగవని, స్పష్టంగా ఉద్యమకారులను గుర్తించడానికి ప్రభుత్వం కమిటీలు వేయాలని, కమిటీ వేసి, ఉద్యమకారులను గుర్తించి, గుర్తింపు కార్డులు ఇవ్వాలని, గత ఆరు సంవత్సరాలుగా ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేస్తూ ఉన్నామని, ఇందుకు ప్రభుత్వం సానుకూలంగానే స్పందించి ఉద్యమకారులకు అత్యంత నాయకుడు మంత్రి పొన్నం ప్రభాకర్ మా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జరిపిన అనేక సర్వ సభ్య సమావేశాలలో వాగ్దానం చేసినారు కనుక, తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా తెలంగాణ ఉద్యమకారులను ఇంతకు పూర్వం కూడా, ఎక్కడా, ఎవరినీ డబ్బులు అడగడం లేదని, గతంలో మా రాష్ట్ర చైర్మన్ డాక్టర్ చీమ శ్రీనివాస్ ప్రకటించి ఉన్నారు. అదే దారిలో యాదాద్రి భువనగిరి జిల్లా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం కూడా కొనసాగుతుందని వారు అన్నారు. వారు స్పష్టం చేసేది ఏమిటంటే, ఎక్కడ ఎవరిని డబ్బులు అడగడం లేదనీ, ఎవరైనా అడిగితే వారిని నిలదీయాలని విజ్ఞప్తి చేస్తున్నారు ఇప్పటివరకు మాకు మేమే, మాకు ఉన్న పరిమిత మైన వనరులతో, ఎవరి డబ్బులు వారు, ఎవరి చార్జీలు వాళ్ళు భరిస్తూ కార్యక్రమాలను కొనసాగిస్తున్నామన్నారు. ఉద్యమకారుల ఫోరంలో జిల్లా, మండలాలలో బయటనే అత్యధిక మంది ఉద్యమకారులు ఉన్నారని, అందుకే ఉద్యమకారులను గుర్తింపు డిమాండ్ రాష్ట్ర ప్రభుత్వానికి పెట్టి ఉన్నామని, ఉద్యమకారుల ఆశలు ఆకాంక్షలను లైవ్లో ఉంచుతున్నది. మాత్రం తెలంగాణ ఉద్యమకారుల పోరం మాత్రమేననీ గంటాపథంగా చెప్పుచున్నామని, ఎవరెన్ని దుర్మార్గపు, తప్పుడు ప్రచారాలు చేసినా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ముందుకే సాగుతుందని పత్రికాముఖంగా తెలంగాణ ఉద్యమకారులకు తెలియపరుస్తున్నామన్నారు.

## పాపాయపాలెంలో పశు వైద్య శిబిరం



**బెల్లంకొండ, జనవరి 28 (నిఘా న్యూస్):** మండలంలోని పాపాయపాలెం గ్రామంలో ఉచిత పశు ఆరోగ్య శిబిరం నిర్వహించడం జరిగింది. మండల పశు వైద్యులు డాక్టర్ జి బాలకృష్ణ రెడ్డి పశువులకు పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 587 అందులో 5 ఎదగరాని పశువులు,4 సూడి పరీక్షలు, పెద్ద పశువులు140, దూడలు 92 నట్టల నివారణ మందు తాగించడం జరిగింది. అలాగే గొర్రెలు మేకలు నట్టల నివారణలు త్రాగించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మాజి సర్పంచి, మండల పశువైద్యులు డాక్టర్ జి బాలకృష్ణ రెడ్డి, పశు వైద్యశాల సహాయక సిబ్బంది అరుణ దేవయ్య భార్గవ్ నాగార్జున వెంకటేష్, రిటైర్డ్ ఎల్ ఎస్ ఏ దాసు, పాల్గొన్నారు.

## రఫీని సన్మానించిన మార్వాడి గంగరాజు



**ముస్తాబాద్, జనవరి 28 (నిఘా న్యూస్):** ముస్తాబాద్ మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన మహమ్మద్ రఫీ అసిస్టెంట్ ఇంజనీరింగ్ ఫలితాలలో ఉద్యోగం సంపాదించిన సందర్భంగా అతన్ని మహాత్మ జ్యోతిబాపూలే గ్రంథాలయం వ్యవస్థాపకుడు మార్వాడి గంగరాజు సన్మానించారు. ఈ సందర్భంగా గంగరాజు మాట్లాడుతూ కొండాపూర్ గ్రామంలో గతంలో అనేక రంగాలలో ఉద్యోగాలు సంపాదించిన యువకులను సన్మానిస్తూ ప్రోత్సహించడం చాలా సంతోషంగా ఉందని పేర్కొన్నారు. యువత కష్టపడి చదివి ఉన్నత విద్యను అభ్యసించి మంచి స్థాయిలో ఉన్నప్పుడే సమాజంలో మంచి గౌరవం గుర్తింపు లభిస్తుందన్నారు. రాబోయే భవిష్యత్ తరాలు ఆదర్శంగా తీసుకొని ఉద్యోగస్తులుగా నియాకం కావడానికి ఆస్కారం ఉంటుందన్నారు. మన గ్రామానికి చెందిన ఉద్యోగస్తులను ఆదర్శంగా తీసుకొని రాబోయే భవిష్యత్ తరాలు మంచి విద్యను అభ్యసించి జీవితంలో ఉన్నత స్థాయిలో స్థిరపడి, తల్లిదండ్రులకు గ్రామానికి మంచి పేరు తేవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ కమిటీ చైర్మన్ కనమేని పెంటా రెడ్డి, వైస్ చైర్మన్ పెద్దూరి శ్రావణ్ కుమార్, సెక్రటరీ మహమ్మద్, కానిస్టేబుల్ హైమద్, ముస్లిం కమిటీ యూత్ సభ్యులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.




హైదరాబాద్ రాష్ట్ర జూనియర్ కాలేజ్ ఫిజికల్ డైరెక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్ ను (2025) రాష్ట్ర ఇంటర్మీడియట్ బోర్డు కమిషనర్ ఎస్.కృష్ణ ఆదిత్య మంగళవారం విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జూనియర్ కాలేజ్ ఫిజికల్ డైరెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ బి,లక్ష్మయ్య ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎం.పర్వతాలు గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ బిక్కు నాయక్, మహిళా కార్యదర్శి డాక్టర్ కె.ఉమారావు, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు డాక్టర్.జగ్గయ్య తదితరులు పాల్గొన్నారు.
*-అంబర్ పేట, జనవరి 28 (నిఘా న్యూస్):*

## రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి



**మేడిపల్లి, జనవరి 28 (నిఘా న్యూస్):** మేడిపల్లి పిఎస్ పరిధి కాచవాని సింగారంలో పదో తరగతి విద్యార్థి మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కాచివాని సింగరానికి చెందిన పదో తరగతి విద్యార్థి తేజస్ చౌదరి (14) పర్వతాపూర్ సమీపంలో టూ వీలర్ పై ట్యూషన్ కి వెళ్లి వస్తుండగా కాచివాని సింగారంలో ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీ కొనడంతో విద్యార్థి అక్కడికక్కడే మృతి చెందాడు. లారీ డ్రైవర్ నిర్లక్ష్యంతో ప్రమాదం సంభవించిందని స్థానికులు తెలిపారు. విద్యార్థి కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. సంఘటనా స్థలానికి చేరుకున్న మేడిపల్లి పోలీసులు కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు.

## ప్రజా క్షేత్రంలో ఉన్నప్పుడే నాయకులకు గుర్తింపు



**ఘట్ కేసర్, జనవరి 28 (నిఘా న్యూస్):** పదవి ఉన్నా లేకున్న ప్రజా క్షేత్రంలో ఉన్నప్పుడే నాయకులకు గుర్తింపు ఉంటుందని మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి తెలిపారు. ఘట్కేసర్ మున్సిపాలిటీ బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు బండారి శ్రీనివాస్ గౌడ్ నేతృత్వంలో పదవి కాలం ముగిసిన బీఆర్ఎస్ పార్టీ మాజీ వైస్ చైర్మన్ పలుగుల మాధవరెడ్డి, సహకార సంఘం డైరెక్టర్ రేసు లక్మారెడ్డి, మాజీ కౌన్సిలర్లు చందుపట్ల వెంకట్ రెడ్డి, కొమ్మగోని రమాదేవి, బండారి అంజనేయులు గౌడ్, బండారి వసంత, కొమ్మిడి అనురాధ, హేమలత, షేక్ జహంగీర్, బేతాళ నర్సింగ్ రావు, కో ఆప్షన్ సభ్యులు పల్లె అరుణ, బొట్టు అరుణ, షౌకత్ మియా, బీఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పన్నాల కొండల్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ మేకల నర్సింగ్ రావు, నాయకులు ప్రేమలత, విమల, శేఖర్, బాబురావు, పల్లె విజయ్, యాదిరెడ్డి, సంజయ్, సలీం మాజీ మంత్రి మల్లారెడ్డిని కలిశారు. పదవి కాలం ముగిసిన వైస్ చైర్మన్, కౌన్సిలర్లను మల్లారెడ్డి శాలువాలతో ఘనంగా సన్మానించారు. ప్రజా సంక్షేమం కోసం తాను ఎల్లప్పుడు అండగా ఉంటానని, అభివృద్ధి పనుల నిమిత్తం తన సహకారం తప్పక ఉంటుందని చెప్పారు. అర్హులైన ప్రజలందరికి ప్రభుత్వ పథకాలు వర్తించేలా నిరంతరం కృషి చేస్తు ప్రజా క్షేత్రంలో ఉండాలని సూచించారు.

## మహిళా సాధికారతపై అవగాహన సదస్సు



**ధర్మపురి, జనవరి 28 (నిఘా న్యూస్):** నియోజకవర్గంలోని ధర్మారం మండలం నాయకంపల్లి తాండలో మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా సాధికారత కేంద్రం కోఆర్డినేటర్ దయా అరుణ మాట్లాడుతూ ఆడపిల్లల సంరక్షణ,మహిళల హక్కులు,అలాగే బేటి బచావో బేటి పడావో ముఖ్య ఉద్దేశం వివరిస్తు అంగన్వాడీ సేవలను,బాల్య వివాహాలను అరికట్టాలని, ఆడపిల్లల పట్ల వివక్షత చూపవద్దని,చైల్డ్ హెల్ప్ లైన్, సఖి సేవలు, సీనియర్ సిటిజన్స్, పని ప్రదేశాల్లో మహిళలపైన జరుగుతున్న దాడులకు సంబంధించిన చట్టం,ఋతు క్రమం,సైబర్ నేరాలపై, అత్యవసర సమయంలో అవసరమయ్యే హెల్ప్ లైన్ నెంబర్ లపై అవగాహన కల్పించడం జరిగింది.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్ బ్లాండిన,టీచర్లు పద్మ,వరలక్ష్మి ,ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు సుమలత, శ్రీధర్, గ్రామీణ మహిళలు పాల్గొన్నారు.

## వివేకానంద కళాశాలలో ఫేర్వెల్ డే సెలబ్రేషన్స్



**వేములవాడ, జనవరి 28 (నిఘా న్యూస్):** వేములవాడ పట్టణం లోని వివేకా నంద జూనియర్ కళాశాలలో ఫేర్వెల్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఫేర్వెల్ డే వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొని డాన్సులతో అలరించారు. అనంతరం మొదటి సంవత్సరం విద్యార్థులు రెండవ సంవత్సరం విద్యార్థులకు వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ శ్యామ్ సుందర్ మాట్లాడుతూ రాబోయే పరీక్షల్లో విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించి కళాశాలతో పాటు తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతలు తీసుకు రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ ముప్పిడి సుధీర్, డైరెక్టర్లు చెన్నమనేని చందు, మల్యాల పరశురామ్,అలిపిరి సురేష్,గుగ్గిళ్ళ అనిల్,ఎర్ర రాకేష్, జయప్రకాశ్ పాల్గొన్నారు.

# కృష్ణానదిని తోడేస్తున్న ఇసుకాసురులు.. అనుమతి ఒకచోట, తవ్వకాలు మరోచోట

**పెబ్బేరు, జనవరి 28 (నిఘా న్యూస్):** దొరికితే దొంగ లేకపోతే దొర అన్నచందంగా మారింది ఇసుక మాఫియా విషయంలో రెవెన్యూ అధికారుల తీరు. అక్రమార్కులతో చేతులు కలిపి అక్రమ సంపాదనకు తెర లేపుతున్నారు ప్రభుత్వ రెవెన్యూ అధికారులు.పెబ్బేరు మండలంలో ఇసుక మాఫియా అక్రమ అనుమతుల పేరిట అక్రమంగా తవ్వకాలు చేపడుతున్నా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తుండగా, రెవెన్యూ అధికారుల తీరుతో కొన్ని ఘటనలు అందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. అక్రమ ఇసుక తరలింపు విషయంలో పోలీసు యంత్రాంగం పట్టించుకున్న రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు తలెత్తుతున్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ముఠాగా ఏర్పడి కొంతమంది ఇసుక దందా చేసేవాళ్లు అదే మాఫీయా రుచి మరిగిన కుక్క కరవదు అన్నట్టు పెబ్బేరు మండలంలోని రంగాపురం గ్రామం సరిహద్దుల్లోని కృష్ణానదిలో అనుమతుల పేరిట ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. గత కొన్ని రోజులుగా మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రభుత్వ పనులు ఎన్ఆర్ఈజీఎస్,సిసి రోడ్ల పేరిట,నూతన గ్రామపంచాయతీల పేరిట రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై గత ప్రభుత్వంలో ఇసుక మాఫియా చేసిన నాయకులు రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై అనుమతులు తెచ్చుకుని, ఈ అనుమతులను ఆసరాగా చేసుకుని ఇసుక కాంట్రాక్టర్లు, అక్రమార్కులు అనుమతి ఇచ్చిన చోట కాకుండా వేరే చోట తవ్వకాలు జరుపుతూ రూ.లక్షల్లో విలువ చేసే ఇసుకను గుట్టుగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అనుమతి ఒకచోట, తవ్వకాలు మరోచోట చేస్తున్నారని విమర్శలు వస్తున్నాయి.కృష్ణానదిలో ఇష్టారీతిన ఇసుక తవ్వకాలు జరపడంతో పరివాహక గ్రామాల్లో భూగర్భజలాలు అడుగంటుతున్నాయని తవ్వకాలు నిలిపివేయాలంటూ గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. అనుమతి ఒక చోట తవ్వకాలు మరో చోట ఇసుక కాంట్రాక్టర్లకు, ఇసుకాసురులకు తవ్వకాలకు అనుమతులు ఇవ్వడమే తరువాయి కృష్ణానదిలో ఇసుకాసురులు గద్దల్లా వాలిపోయి విచ్చల విడి తవ్వకాలు జరుపుతుంటారు. పెబ్బేరు మండలంలోని శాఖాపురం గ్రామ పరిధిలోని ఒక చెట్టు వాగు దగ్గర ఇసుక తవ్వకాలకు రెవెన్యూ అధికారుల యంత్రాంగం అనుమతులు ఇవ్వడమే ఇసుకాసురులకు వరంగా మారింది. ప్రభుత్వం ప్రకటించిన రీచ్ ప్రదేశంలో మాత్రమే అధికారులు గుర్తించిన ప్రదేశాల్లో ఇసుక తవ్వకాలు జరపాల్సి ఉంటుంది. కానీ ఇసుకాసురులు అనుమతి ఒకచోటనైతే తవ్వకాలు మరోచోట జరుపుతున్నారని స్థానిక గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. దీనిపై పోలీస్ అధికారులు స్పందిస్తున్న రెవెన్యూ అధికారులు మాత్రం ఇసుకాసురులకు వత్తాసు పలుకుతూ పర్మిషన్ ఇచ్చామంటూ చేతులు దులిపించుకోవడం రెవెన్యూ అధికారులు మామూలుగానే తీసుకుంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అంతేకాక



తాసిల్దార్ లక్ష్మి




నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వకాలు చేపడుతూ ట్రాక్టర్లలో పరిమితికి మించి ఇసుకను తరలిస్తున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. ప్రతిరోజూ రూ.లక్షల విలువ చేసే ఇసుకను అక్రమంగా తరలిస్తుండడంతో ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయానికి గండి కొడుతున్నారు. ఇదంతా స్థానిక రెవెన్యూ అధికారులకు తెలిసినప్పటికీ ఏమీ పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. అక్రమంగా అనుమతుల పేరుతో ఇసుక మాఫియాను అరికట్టడంలో పోలీసు యంత్రాంగం పట్టించుకున్నప్పటికీ అక్రమ ఇసుక తరలింపును అడ్డుకోవాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులపై కూడా ఉందని స్థానిక ప్రజలు విమర్శిస్తున్నారు. చట్టపరమైన చర్యలు తీసుకుంటాం... తహసీల్దార్ లక్ష్మి, అనుమతి లేకుండా ఇసుక రవాణా చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.గతంలో భారీ మొత్తంలో రాంపురం, శాఖాపురం గ్రామంలో ఇసుక డంపింగ్లను సీజ్ చేశాం. ఇసుక దందాకు పాల్పడే వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదు. ఇసుక ట్రాక్టర్లపై ప్రత్యేక నిఘా... పెబ్బేరు ఎస్ఐ హరిప్రసాద్ రెడ్డి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ల పై ప్రత్యేక నిఘా ఉంచుతాం. గతంలో అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ల పై కేసులు నమోదు చేశాం. వారిని తహసీల్దార్ ముందు బైండోవర్ చేసాం. అనుమతి లేని ఇసుక రవాణాపై తమ దృష్టికి వస్తే వెంటనే చర్యలు తీసుకుంటాం. రైతు బందు, దళిత బందు... కెసిఆర్ పాలనలో బిఆర్ఎస్ బంధువులకే అప్పగింత కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు కర్రె రాజేష్ ఘట్ కేసర్ జనవరి 28 (నిఘా న్యూస్) కెసిఆర్ పాలనలో దళిత బంధు, రైతు బంధు, బీసీ బందు అన్ని బందే ఏ ఒకటి నిజమైన లబ్ధిదారునికి అందలేదని ఘట్కేసర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కర్రే రాజేష్ ఎద్దేవా చేశారు. పోచారం మున్సిపాలిటీ పరిధిలోని అన్నోజిగూడ సింగిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కెసిఆర్ చాలా మేధావి. ఆయన ఆయంలో తలపెట్టిన పథకాలన్నీ బంధువు పథకాలు కావు అన్ని బంధు పథకాలే అని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 14



నెలలు అవుతుంది. ఇందులోనే రైతు భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలను అమలు చేశామని గర్వంగా చెప్పుకుంటున్నామన్నారు. అతి కొద్ది కాలంలోనే మేము అమలు చేస్తున్నటువంటి పథకాలను చూసి ఓర్వలేక బిజెపి, బిఆర్ఎస్ పార్టీల నాయకులు అవాకులు చెవాకులు పిలుస్తూ ప్రజలను మభ్య పెట్టాలని చూస్తున్నారని ఆయన విమర్శించారు. ప్రజలందరూ గమనిస్తూనే ఉన్నారని ఆయన తెలిపారు. అనంతరం పోచారం మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సింగిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను రెండు రోజులు అటు ఇటు అయినా తప్పకుండా నెరవేరుస్తుందని ఆయన అన్నారు ప్రతి పేదవాడికి ఖచ్చితంగా ఇల్లు రేషన్ కార్డు వంటి ప్రభుత్వ పథకాలు వారికి అందేలా ఇందిరమ్మ కమిటీ నాయకుల పర్యవేక్షణలో ఖచ్చితంగా అందజేస్తామని వారు తెలిపారు. టిఆర్ఎస్ పార్టీ ఆయంలో బంగారు తెలంగాణ అంటూ గరీబ్ తెలంగాణను చేశారని ఆయన విమర్శించారు. బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఏ ఒక్క పేదోడికైనా రేషన్ కార్డు లేదు ఇల్లు లేదు ప్రభుత్వ పథకాలకు ఆమడ దూరంలో ఉన్నాయని ఆయన ఘాటుగా విమర్శించారు. ఈ కార్యక్రమంలో పోచారం మున్సిపాలిటీ మహిళ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఎర్ర మాధవి, ఘట్కేసర్ మండల పార్టీ ఉపాధ్యక్షుడు పల్లె బాబురావు మాజీ ఎంపీటీసీ భాస్కర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ బి వెంకటేష్ గౌడ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వినోద్, రూరల్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు మహేష్, మాజీ గ్రామపంచాయతీ సభ్యుడు భోజిరెడ్డి, నరేష్ గౌడ్, జాఫర్ హుస్సేన్, సహదేవ్ గౌడ్, లక్ష్మణ్ గౌడ్ నాగరాజ్ గౌడ్, లక్ష్మి, లక్ష్మి భాయ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాలు సురక్షితం

**వికారాబాద్, జనవరి 28 (నిఘా న్యూస్):** గర్భిణీ స్త్రీలు ప్రభుత్వ ఆసుపత్రులలోనే ప్రసవాలు చేయించుకోవడం తల్లికి నవజాత శిశువుకు సురక్షితమని మోమిన్ పెట్ డాక్టర్ సుజల వెల్లడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తనతోపాటు ఆసుపత్రి డ్రాయింగ్ అధికారి డాక్టర్ రషీద్ రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడానికి కృషి చేస్తున్నామని వివరించారు. మోమిన్ పేట్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గత నెలలో నలుగురు గర్భిణీ స్త్రీలకు సుఖ ప్రసవాలు చేయడం జరిగిందని, తల్లి నవజాత శిశువు అందరూ ఆరోగ్యంగా ఉన్నారని పేర్కొన్నారు. మోమిన్ పెట్ మండల పరిధిలో 43 వేల జనాభా ఉన్నారని వెల్లడించారు. ఆసుపత్రి పరిధిలో 9 ఆరోగ్య ఉప కేంద్రాలు ఉన్నాయని చెప్పారు. ఆరోగ్య కేంద్రంలోని ఓపి విభాగంలో రోజుకి 110 నుండి, 120 మందికి వైద్య సేవలు అందించడం జరుగుతుందని వివరించారు. ప్రతి శుక్రవారం, ప్రతి సోమవారం 30 మంది గర్భిణీ స్త్రీల వరకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, వైద్య సేవలు అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. అదేవిధంగా ఆరోగ్యం పై వివరించి అవగాహన కల్పించడం జరుగుతుందని అన్నారు. మహిళలు గర్భం దాల్చిన వెంటనే డాక్టర్లకు, వైద్య సిబ్బందినీ



సంప్రదించి మాతా శిశు ఆరోగ్య సంరక్షణ కార్డులో పేరును నమోదు చేసుకుని, ప్రతి నెల ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. గర్భిణీ స్త్రీలు ప్రభుత్వ ఆసుపత్రులలోనే ప్రసవాలు చేయించుకోవడం ఉత్తమమైన మార్గమని హితవు పలికారు.

# పంట పొలాలను పరిశీలించిన శాస్త్రవేత్తలు

**బెల్లంకొండ, జనవరి 28 (నిఘా న్యూస్):** మండలంలోని మన్నె సుల్తాన్ పాలెం ఎమ్మాజిగూడం గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఐ.మురళి, శాస్త్రవేత్త మద్ది నగేష్ మరియు వి హనుమంతరావు సహాయ వ్యవసాయ సంచాలకులు (రె ) క్రోసూరు వారు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో క్షేత్ర సందర్శనలో భాగంగా రబి వరి పంటను సందర్శించడమైనది. వరిలో అగ్గి తెగులు మచ్చలు, కాండం తొలుసు పురుగు గమనించడమైనది. అగ్గి తెగులు నివారణగాను ట్రైసైక్లోజోల్ 120 గ్రాములు ఎకరాకు చొప్పున పైరుపై పిచికారి చేసుకోవాలని సూచించినారు. కాండము తొలుసు పురుగు ఉనికి, ఉధృతి తెలుసుకొనుటకు ఎకరాకు 4 లింగాకార్షక బుట్టలు పెట్టి రోజుకు 8 తల్లి రెక్కల పురుగులు బుట్టలో పడినట్లు గమనించినచో ఆర్థిక నష్ట పరిమితి దాటినట్లుగా గుర్తించి నివారణకు ఫ్లూబెండమైడ్ 40 మి లీ లేదా, క్లోరాంట్రనిలిప్రోలు 60 మి లీ ఎకరాకు చొప్పున పైపాటుగా పిచికారీ చేయటం లేదా కార్బోఫ్యూరాను 3 జి గుళికలు ఎకరాకు 10 కేజీలు చొప్పున 20 కేజీల ఇసుకతో కలిపి మడిలో చిలప నీరు ఉంచి ఎద చల్లుకోవాలని తదుపరి 48 గంటలు నీరు నిలుపుదల చేయుట వలన కాండం తొలుసు పురుగును సమర్థవంతంగా నివారించుకోవచ్చని సూచించినారు. కంది పంటలో కాయ ఈగ నివారణకు ప్రొఫెనోఫాస్ 400 మి లీ లేదా అలాంటో 160 మి.లీ. ఎకరాకు చొప్పున పిచికారి చేసుకోవాలని, మొక్కజొన్న పైరులో మొవ్వ తొలుచు పురుగు నివారణకు కార్బోఫ్యూ రాన్ 3జి గుళికలు ఎకరాకు 4 కేజీలు మొక్కజొన్న మొవ్వసుడుల్లో వేసుకోవాలని సూచించినారు. చౌడు



భూముల్లో వరి సాగుకు ముందు జీలుగ సాగు చేసి భూమి లో కలియ దున్నినచో చౌడు శాతం తగ్గి పంట దిగుబడులు పెంచుకోవచ్చని తెలిపినారు. నత్రజని, బాస్వరం,పొటాష్ ఎరువులు వాడకంలో సమతుల్యత పాటించి చీడ,పీడ ల ఉధృతి తగ్గించుటతో పాటు నాణ్యమైన దిగుబడులు పొందవచ్చని తెలిపారు. కంది పంట దిగుబడులు కనీస మద్దతు ధరకు అమ్మదలచిన రైతులు గ్రామస్థాయిలోని రైతు సేవ కేంద్రం సిబ్బందిని సంప్రదించి నమోదు చేసుకోవాలని తెలిపారు. తదుపరి పామాయిల్ తోటల యాజమాన్య పద్ధతుల గురించి సంబంధిత సిబ్బంది పలు సూచనలు చేయడమైనది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి డి కృష్ణయ్య, పామాయిల్ తోటల పెంపకం సంబంధించి నవీన్ (మేనేజర్) రైతు సేవ కేంద్ర సిబ్బంది సాయికిరణ్, అక్కల వెంకటరామి రెడ్డి, వై.హనుమంతరావు, రామకృష్ణ, ఆనంద్ గ్రామ రైతులు పాల్గొన్నారు.

### రైతు బందు, దళిత బందు..

# కెసిఆర్ పాలనలో బిఆర్ఎస్ బంధువులకే అప్పగింత

## కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు కర్రె రాజేష్



**ఘట్ కేసర్, జనవరి 28 (నిఘా న్యూస్):** కెసిఆర్ పాలనలో దళిత బంధు, రైతు బంధు, బీసీ బందు అన్ని బందే ఏ ఒకటి నిజమైన లబ్ధిదారునికి అందలేదని ఘట్కేసర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కర్రే రాజేష్ ఎద్దేవా చేశారు. పోచారం మున్సిపాలిటీ పరిధిలోని అన్నోజిగూడ సింగిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కెసిఆర్ చాలా మేధావి. ఆయన ఆయంలో తలపెట్టిన పథకాలన్నీ బంధువు పథకాలు కావు అన్ని బంధు పథకాలే అని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 14 నెలలు అవుతుంది. ఇందులోనే రైతు భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలను అమలు చేశామని గర్వంగా చెప్పుకుంటున్నామన్నారు. అతి కొద్ది కాలంలోనే మేము అమలు చేస్తున్నటువంటి పథకాలను చూసి ఓర్వలేక బిజెపి, బిఆర్ఎస్ పార్టీల నాయకులు అవాకులు చెవాకులు పిలుస్తూ ప్రజలను మభ్య పెట్టాలని చూస్తున్నారని ఆయన విమర్శించారు. ప్రజలందరూ గమనిస్తూనే ఉన్నారని ఆయన తెలిపారు. అనంతరం పోచారం మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సింగిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను రెండు రోజులు అటు ఇటు అయినా తప్పకుండా నెరవేరుస్తుందని ఆయన అన్నారు ప్రతి పేదవాడికి ఖచ్చితంగా ఇల్లు రేషన్ కార్డు వంటి ప్రభుత్వ పథకాలు వారికి అందేలా ఇందిరమ్మ కమిటీ నాయకుల పర్యవేక్షణలో ఖచ్చితంగా అందజేస్తామని వారు తెలిపారు. టిఆర్ఎస్ పార్టీ ఆయంలో బంగారు తెలంగాణ అంటూ గరీబ్ తెలంగాణను చేశారని ఆయన విమర్శించారు. బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఏ ఒక్క పేదోడికైనా రేషన్ కార్డు లేదు ఇల్లు లేదు ప్రభుత్వ పథకాలకు ఆమడ దూరంలో ఉన్నాయని ఆయన ఘాటుగా విమర్శించారు. ఈ కార్యక్రమంలో పోచారం మున్సిపాలిటీ మహిళ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఎర్ర మాధవి, ఘట్కేసర్ మండల పార్టీ ఉపాధ్యక్షుడు పల్లె బాబురావు మాజీ ఎంపీటీసీ భాస్కర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ బి వెంకటేష్ గౌడ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వినోద్, రూరల్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు మహేష్, మాజీ గ్రామపంచాయతీ సభ్యుడు భోజిరెడ్డి, నరేష్ గౌడ్, జాఫర్ హుస్సేన్, సహదేవ్ గౌడ్, లక్ష్మణ్ గౌడ్ నాగరాజ్ గౌడ్, లక్ష్మి, లక్ష్మి భాయ్ తదితరులు పాల్గొన్నారు.

## కలుషిత నీటిని అరికట్టండి

### నల్లకుంట డివిజన్ కార్పొరేటర్ అమృత



**నల్లకుంట, జనవరి 28 (నిఘా న్యూస్):** నల్లాలలో కలుషిత నీటి సరఫరాను పూర్తిస్థాయిలో అరికట్టే దిశగా చర్యలు తీసుకోవాలని నల్లకుంట డివిజన్ కార్పొరేటర్ వై.అమృత జలమండలి అధికారులను ఆదేశించారు. నల్లకుంట డివిజన్ లోని టిఆర్టి క్వాటర్స్ లో మంగళవారం కార్పొరేటర్, జలమండలి మేనేజర్ రోహిత్ తో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలోని నల్లాలలో గత కొంతకాలంగా కలుషితమైన నీరు సరఫరా అవుతుందని స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చారు. నల్లాలలో సరఫరా అవుతున్న కలుషిత నీటిని పరిశీలించిన కార్పొరేటర్ వెంటనే సమస్యను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు నర్సింగ్ రావు తదితరులు పాల్గొన్నారు.


## కడకుదురు.. రాజమండ్రి ఆర్టీసీ బస్సు కనబడుట లేదు

- అనేక సంవత్సరాలుగా నడుస్తున్న బస్సును నిలిపివేయడంపై ఆందోళన
- ఎక్కడుందో కొంచెం చెప్పండి డిఎం గారు అంటూ ప్రశ్నించిన స్థానికులు




**బిక్కవోలు, జనవరి 28 (నిఘా న్యూస్):** కాకినాడ జిల్లా పెదపూడి మండలం కడకుదురు గ్రామం నుండి తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి సిటీకి వెళ్లడానికి పూర్వకాలం నుండి ఒక ఆర్టీసీ బస్సు తిరుగుతూ ఉండేది ఏ ప్రభుత్వం వచ్చినా ఎన్ని కష్టాలు వచ్చినా ఆ బస్సు మాత్రం ఎప్పుడు తిరుగుతూ అనపర్తి నియోజకవర్గం లోని రెండు మండలాల మీదుగా రాజమండ్రి ప్రయాణించే ప్రయాణికులకు అనుకూలంగా ఉండేది అయితే గత కొద్ది కాలంగా ఈ బస్సు రావడంలేదని స్థానికులు వాపోతున్నారు. రాజమండ్రి వెళ్లడానికి సామాన్య ప్రజలకు ముఖ్యంగా బట్టల వ్యాపారస్తులకు ఈ బస్సు చాలా అనుకూలంగా ఉండేదని అయితే ఎటువంటి నోటీసు ఇవ్వకుండా ఈ బస్సును నిలిపి వేయడంపై పలు విమర్శలు వినిపిస్తున్నాయి. బస్సు ఏమైంది చెప్పండి డిఎం, అంటూ స్థానికులు అడుగుతున్నారు. కనుక సంబంధిత అధికారులు ఇప్పటికైనారాజమండ్రికడకుదురు సర్వీసును పునఃప్రారంభించాలని, లేని పక్షంలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడం జరుగుతుందని స్థానికులు తెలిపారు.

## రాజు పాలెంలో పర్యటించిన జిల్లా కలెక్టర్



**బెల్లంకొండ, జనవరి 28 (నిఘా న్యూస్):** పల్నాడు జిల్లా కలెక్టర్ పి. అరుణ్ బాబు మంగళవారం రాజుపాలెం మండలంలో పర్యటించారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, ఎంపీపీ పాఠశాలకు కో లోకెట్ చేసిన అంగన్ వాడీ కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ చదువుతున్న పదవ తరగతి విద్యార్థులతో ముచ్చటించారు. పాఠాలు అర్థమవుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. స్టడీ మెటీరియల్ ను చక్కగా వినియోగించుకుని విద్యార్థులంతా వందశాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో మాట్లాడి వారి అభ్యాస స్థాయిలను పరీక్షించారు. పాఠశాలలో రికార్డులు, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని పరిశీలించారు. జిల్లా కలెక్టర్ పర్యటనలో డీఈవో చంద్రకళ, సత్తెనపల్లి ఆర్డీవో రమణా కాంత్ రెడ్డి పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే మేఘారెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం



**పెబ్బేరు, జనవరి 28 (నిఘా న్యూస్):** తెలంగాణలో రైతులకు పెట్టుబడి సాయం కింద ప్రభుత్వం అందజేస్తున్న రైతు భరోసా స్కీమ్‌కు సంబంధించి నిధులను ప్రభుత్వం జనవరి 26న రైతుల ఖాతాల్లో జమ ప్రారంభించింది. ఏడాదికి ఎకారానికి రూ.10 వేల నుంచి రూ.12 వేలకు పెంచిన ఆర్థిక సహాయం రైతుల ఖాతాల్లో జమ అవుతున్నది. రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసిన 606 గ్రామాల్లో సోమవారం నుంచి రైతుల ఖాతాల్లో నిధులను జమ చేయడం ప్రారంభించింది. రూ.570 కోట్ల నగదును రైతుల ఖాతాల్లో జమ చేసింది. దీంతో రైతుభరోసా సాయం కోసం ఎదురు చూస్తున్న రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా పెబ్బేరు మండలంలోని పైలట్ ప్రాజెక్టు కింద ఈర్లదిన్నె గ్రామాన్ని ఎంపిక చేశారు. ఆ గ్రామాన్ని ఎంపిక చేయడంతో ఇల్లదిన్నె గ్రామంలో టపాసులు కాల్చి వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి చిత్రపటానికి చిత్రపటానికి పాలాభిషేకం చేసి ఆ గ్రామస్తులు,రైతులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్మన్ ఎద్దుల విజయవర్ధన్ రెడ్డి,బ్లాక్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్,వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేష్ సాగర్, మాజీ సర్పంచులు సురేందర్ గౌడ్,రవీందర్ నాయుడు, మార్కెట్ డైరెక్టర్ నరసింహ నాయుడు,శివకుమార్,సుధాకర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, బాలస్వామి,రాజశేఖర్ రెడ్డి, నరేష్, వేణు, లక్ష్మణ్, జయన్న రైతులు పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన



**ఉప్పల్, జనవరి 28 (నిఘా న్యూస్):** ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఉప్పల్ ఎన్.ఎస్.ఎస్.ఆధ్వర్యంలో ఎన్.ఎస్.ఎస్.వాలంటీర్లకు, విద్యార్థులకు ట్రాఫిక్ నియమాలను వివరిస్తూ రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.విజయకుమార్ అధ్యక్షత వహించగా, వైస్.ప్రిన్సిపాల్ డా.ఎ.రవికుమార్, డా.సిహెచ్ సత్యనారాయణ, ఎన్ ఎస్ ఎస్ పిఓ జె.విశ్వనాథ్ కుమార్ తదితర కళాశాల సిబ్బంది పాల్గొన్నారు. ఉప్పల్ ట్రాఫిక్ సిఐ లు జి.మల్లేష్, ఆర్.బాబ్యనాయక్ లు ముఖ్య అతిథులుగా విచ్చేసి వాలంటీర్లకు రోడ్డుభద్రతపై అవగాహన కల్పించారు. అతివేగం ప్రమాదకరమని, హెల్మెట్, లైసెన్స్ తప్పనిసరి అని, మద్యపానం చేసి వాహనాలు నడపరాదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం కళాశాల ఎన్.ఎస్.కమిటీ డా.ఎన్ రాజశ్రీ, డా.జి.తిరుపతయ్య, పి.వెంకటేశ్వర్లు, కె.గీత, పి.విజయ్ కుమార్, డా.ఎస్.యమున, డా.వి.శ్రీనివాసరావు, ఆర్ చంద్రసాగర్, పి.ధనలక్ష్మి, జి.శ్రీదేవి,మమత, భాగ్యలత, ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## మందకృష్ణకు పద్మశ్రీ పట్ల హర్షం

### పెబ్బేరు మండల దండోరా నాయకులు

**పెబ్బేరు, జనవరి 28 (నిఘా న్యూస్):** కేంద్ర ప్రభుత్వం మందకృష్ణ మాదిగకి పద్మశ్రీ అవార్డు రావడాన్ని స్వాగతిస్తూ హర్షిస్తూ మంగళవారం దండోరా నాయకులు పెబ్బేరు ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాసేవకు పద్మశ్రీ అవార్డు వచ్చిందని,మందకృష్ణ మాదిగ ఈ రాష్ట్రంలో దళితుల అభ్యున్నతి కోసం ఆయన చేసిన కృషి ఎంతో ఉందని మరో అంబేద్కర్ లా దళిత జాతుల కోసం 1994 సంవత్సరం నుంచి దండోరా ఉద్యమాన్ని స్థాపించి 40 సంవత్సరాల సుదీర్ఘ పోరాటంలో దండోరా ఉద్యమం ద్వారా అనేక సంక్షేమ పథకాలు సాధించి ప్రజలకు అందించారని వారు అన్నారు. ఆరోగ్యశ్రీ వృద్ధులు, వితంతువులకు, వికలాంగులకు, పెన్షన్స్ తో పాటు ఎన్నో సంక్షేమ పథకాలు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తెలంగాణ ప్రజలకు ఆయన చేసిన కృషి చరిత్రలో ఎంతో గొప్పగా చెప్పుకోవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు.కావున మందకృష్ణ మాదిగని కేంద్ర ప్రభుత్వం గుర్తించి అవార్డు ప్రకటించినందుకు కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ మందకృష్ణ మాదిగకి శుభాకాంక్షలు తెలియజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో దళిత నాయకులు రాజశేఖర్,పెద్దింటి వెంకటేష్, ఎద్దుల సాయినాథ్,మాలపల్లి మన్నెం,మధు, గోపి బాబు, మొగులన్న, సురేష్ బాబు,అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## రోగులకు రొట్టెలు పాలు పండ్లు పంపిణీ



**గోకవరం, జనవరి 28 (నిఘా న్యూస్):** విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షులు, భారతీయ జనతా పార్టీ నాయకులు కంబాల శ్రీనివాస రావు చేపట్టిన ప్రజా సేవ కార్యక్రమాలు నిరంతరాయంగా కొనసాగుతున్నాయి. ఇందులో ముఖ్యంగా రోగులకు పండ్లు, పాలు, రొడ్డులు పంపిణీ కార్యక్రమం ఒకటి. సుమారుగా ఏడాది నుంచి గోకవరం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లో గర్భిణీలు, అక్కడికి చికిత్స కోసం వచ్చే రోగులకు ఎటువంటి ఆటంకాలు లేకుండా ప్రతి మంగళవారం పండ్లు, పాలు, రొట్టెలను కంబాల శ్రీనివాసరావు ఉచితంగా అందజేస్తున్నారు. ఈ మంగళవారం యధావిధిగా అయన సిబ్బంది రోగులకు పాలు, పండ్లు, రొట్టెలను అందజేశారు. తన సేవా కార్యక్రమాలు నిరంతరాయంగా కొనసాగుతూనే ఉంటాయని, తన వద్దకు కష్టం అని వచ్చిన వారికి, లేదు అనకుండా సహాయం చేసి తిరిగి పంపిస్తున్నానని, కంబాల శ్రీనివాసరావు అన్నారు. ఈ కార్యక్రమంలో రామసేన సభ్యులు, బీజేపీ నాయకులు మామిడి అయ్యప్ప, ఇనకోటి బాపన్న దొర, వరసాల ప్రసాద్, డాక్టర్ వల్లూరి జగన్నాథరావు శర్మ, కట్టా కళ్యాణ్, డాక్టర్ వనజా, రామసేన సిబ్బంది వరలక్ష్మి, భారతి, సుదర్శన్, దుర్గ ప్రసాద్, అభి, తదితరులు పాల్గొన్నారు.

# 450 కోట్లతో బడంగ్ పేట అభివృద్ధి

- పాఠశాలల అభివృద్ధికి మున్సిపల్ నిధులు కేటాయించాలి
- ఐదేళ్ల పదవీ కాలం సంతృప్తినిచ్చింది
- మాజీ డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్



**బాలాపూర్, జనవరి 28 (నిఘా న్యూస్):** ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, నిర్వహణకు ప్రభుత్వ నిధులతో పాటు స్థానిక సంస్థల నుండి నిధులు కేటాయించాలని బడంగ్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్ అన్నారు. కార్పొరేటర్, డిప్యూటీ మేయర్ గా ఐదేళ్ల పదవీకాలం ముగిసిన సందర్భంగా ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను కార్పొరేషన్ లో 15 డివిజన్ నుండి రిజర్వేషన్ స్థానంలో ఎన్నికయ్యానని అందుకు కారణమైన రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ కు కృతజ్ఞతలు తెలిపారు. మూడుసార్లు ప్రజా ప్రతినిధిగా ఎన్నుకున్నందుకు బాలాపూర్ గ్రామ ప్రజలకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పదవీకాలం ముగిసినా కూడా సమస్యల పరిష్కారానికి బాలాపూర్ ప్రజలకు అందుబాటులో ఉంటానని తెలిపారు. బడంగ్పేట్ కార్పొరేషన్ ను గడిచిన ఐదు సంవత్సరాలలో 450 కోట్ల నిధులతో అభివృద్ధి చేశామని, దానికి సహకరించిన మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా రెడ్డి, మేయర్ పారిజాత, సహచర కార్పొరేటర్లకు ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. బడంగ్పేట్ మున్సిపాలిటీకి 2022 లో స్వచ్ఛ అవార్డు రావడం సంతోషంగా ఉందని, అవార్డు రావడానికి కృషి చేసిన సానిటేషన్ సిబ్బందికి అధికారులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ వారి సమస్యలు తీర్చడానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. కార్పొరేషన్ లో సుమారు 9 కోట్లతో స్మశానవాటికలు, 11 కోట్లతో చెరువుల అభివృద్ధి, 36 కోట్లతో బీటీ రోడ్లు, 90 కోట్లతో యూజీడి పనులు, 9.5 కోట్లతో పార్కుల అభివృద్ధి, 39 కోట్లతో ఎస్ఎన్డీపీ నాలాల నిర్మాణం వంటి పనులు చేసినట్లుగా తెలిపారు. కార్పొరేషన్ ప్రజలకు వంద శాతం మౌలిక వసతులు కల్పించామన్న సంతృప్తి ఉందని అన్నారు. అయితే ఎండోమెంట్, క్రీడా, ఇరిగేషన్ అన్ని డిపార్ట్మెంట్లు ఉన్నా మున్సిపాలిటీ నుండి నిధులు కేటాయిస్తూ వాటిని అభివృద్ధి చేసుకుంటున్నామని అయితే ప్రభుత్వ పాఠశాలలకు నిధులు కేటాయించమని ఎన్నిసార్లు పాలకవర్గాన్ని అభ్యర్థించినా కార్పొరేటర్లు సహకరించలేదని అన్నారు. అయితే ప్రభుత్వ పాఠశాలలను ఇంత నిర్లక్ష్యం చేస్తున్నందుకు బాధగా ఉందని, ప్రభుత్వ పాఠశాలలకు స్థానిక సంస్థల నుండి నిధులు కేటాయించే వరకు బిఎస్పి కోఆర్డినేటర్ గా రాష్ట్ర వ్యాప్తంగా పోరాడుతూనే ఉంటానని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో బాలికలకు టాయిలెట్స్ లేక ఇబ్బందులు పడుతున్నారని ఇటీవల ఎన్నో సంఘటనలు చోటు చేసుకున్నా అధికారులు, ప్రభుత్వం కానీ ప్రభుత్వ పాఠశాలలపై నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

## రాజ్యాంగాన్ని తగలబెట్టిన వ్యక్తికి ఉరిశిక్ష విధించాలి

### జిల్లా షెడ్యూల్ కులాల హక్కుల పరిరక్షణ సంఘం



**ఉప్పల్, జనవరి 28 (నిఘా న్యూస్):** అంబేద్కర్ విగ్రహం ధ్వంసం చేసిన రాజ్యాంగ పుస్తకాన్ని తగలబెట్టిన కిరాతకున్ని ఉరిశిక్ష విధించాలని షెడ్యూల్ కులాల హక్కుల పరిరక్షణ సంఘం ఏ ఐ ఎస్ సి ఆర్ పి ఎస్ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు ఉప్పల్ నియోజకవర్గ మాల సంఘాల ఇంచార్జ్ మాస శేఖర్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ జనవరి 26న పంజాబ్ లోని అమృత్ సర్ లో ఓ కిరాతకుడు అంబేద్కర్ విగ్రహం మెట్లు ఎక్కి విగ్రహాన్ని సుత్తితో కొట్టడం జరిగిందని, అంబేద్కర్ విగ్రహం దగ్గర ఉంచిన రాతి రాజ్యాంగ పుస్తకాన్ని తగలబెట్టడానికి ప్రయత్నం చేశాడని ఆవేదన వ్యక్తం చేశారు. బాబా సాహెబ్ అంబేద్కర్ భారత రాజ్యాంగ నిర్మాత అడుగుజాడల్లో నడవవలసిన భారత ప్రభుత్వం ఏం చేస్తుందని ఆయన ప్రశ్నించారు. ఆ విగ్రహం వద్ద సీసీ ఫుటేజ్, ప్రజలు లేరా ఒక భారత రాజ్యాంగ నిర్మాతను అవమానపరిస్తే ప్రభుత్వానికి సిగ్గుచేటు కాదా ప్రశ్నించడం జరిగింది. ఏది ఏమైనప్పటికీ ఇలాంటి సంఘటన జరుగుతే పెద్ద ఎత్తు న ఆందోళన చేస్తామని హెచ్చరించారు.



మండలంలోని నాగిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన పుల్లలచెరువు శ్రీనివాసరావు (40) అనారోగ్యంతో మృతి చెందటంతో మండల టిడిపి కోరు కమిటీ సభ్యులు వెన్న సీతారామి రెడ్డి గ్రామ పార్టీ అధ్యక్షుడు బద్దూరి వీరారెడ్డి, యువ నాయకుడు బద్దూరి వెంకటకృష్ణారెడ్డి పార్టీ నాయకులు ఆ కుటుంబానికి రూ.10 వేలు ఆర్థిక సాయం చేశారు. ఈ కార్యక్రమంలో బద్దూరి సుబ్బారెడ్డి, బూతుకూరి గోవిందరెడ్డి, మర్రి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

*-బెల్లంకొండ, జనవరి 28 (నిఘా న్యూస్):*

## మాజీ కార్పొరేటర్ ను పరామర్శించిన మంత్రి సురేఖ



**వరంగల్, జనవరి 2 (నిఘా న్యూస్):** మాజీ కార్పొరేటర్ బోలు గొడ్డు సారయ్య సతీమణి విమలా దేవి మరణించగా వారి కుటుంబ సభ్యులకు మంగళవారం దేవదాయ శాఖ మంత్రి కొండ సురేఖ, ఎమ్మెల్సీ మాజీ మంత్రి బసవరాజు సారయ్య ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో 41 డివిజన్ కార్పొరేటర్ పోశాల పద్మ, 42 వ డివిజన్ కార్పొరేటర్ గుండు చందనా కొంతం మోహన్ కెడల జనార్దన్ పద్మ మూతినేని రామ్మూర్తి జనతా పరపతి సంఘం అధ్యక్షులు కేడల మల్లేశం ప్రధాన కార్యదర్శి పోషాల మల్లికార్జున్ వినాయక పరపతి సంఘం అధ్యక్షులు బత్తిని వీరభద్రయ్య విలాసాగరం శ్రీను బసవరాజ్ కుమారస్వామి జన్ను రవి కార్పొరేటర్ దిడ్డి కుమార స్వామి సయ్యద్ బషీర్ పాకాల రాజేందర్ మునుకుంట్ల చంద్రమౌళి కాంగ్రెస్ సీనియర్ నాయకులు వనం వేణు, జింక రమేష్, విలాసాగరం చిన్న శ్రీను విశ్వనాథ్ శంకేసి అనిల్ కోట సతీష్ శ్రీధర్ చిగిరి కుమారస్వామి బక్కి వీర సాయి ప్రసాద్ శ్రీధర్ బజ్జూరి మధుసూదన్ పోతు రమేష్, తదితరులు పాల్గొని విమలాదేవి భౌతిక ఖాయానికి శ్రద్ధాంజలి ఘటించారు. కుమారుడు హరి అమెరికా నుండి విచ్చేసి ఈరోజు అంతిమ యాత్ర పాల్గొనడం జరిగింది.

## రేవంత్ చిత్ర పటానికి నాయి బ్రాహ్మణ సంఘం పాలాభిషేకం






**ఖమ్మం, జనవరి 28 (నిఘా న్యూస్):** తెలంగాణ రాష్ట్ర నాయి బ్రాహ్మణ సమైక్య సంక్షేమ సేవా సంఘం రామవరపు నాగరాజు ఆధ్వర్యంలో సంజీవరెడ్డి భవన్ నుండి డిప్యూటీ సీఎం క్యాంప్ కార్యాలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయి బ్రాహ్మణ సమైక్య సంక్షేమ సేవ సంఘ నాయకులు మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా ఎంతో వెనుక బాటకు గురైన నాయి బ్రాహ్మణ కులానికి కాంగ్రెస్ ప్రభుత్వ పాలనాలో 33 జిల్లాలో ఖమ్మం మంచిర్యాల జిల్లాల నాయి బ్రాహ్మణులకు జిల్లాస్థాయి నామినేట్ పదవులైన ఆర్టిఏ (రోడ్ ట్రాన్స్పోర్ట్ అథారిటీ) డైరెక్టర్ గా గజ్జల వెంకన్నను నియమించడం పట్ల నాయి బ్రాహ్మణులు సంతోషాన్ని వ్యక్తపరిచారు. అందుకు సంఘీభావంగా కృతజ్ఞతలు తెలుపుతూ, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మల్లు భట్టి విక్రమార్క తుమ్మల నాగేశ్వరావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ రథసారధి పువ్వాళ్ళ దుర్గ ప్రసాద్ చిత్రపటాలకు పాలభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు పట్టణ నాయి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షులు ముత్యాల లక్ష్మణ్ గౌరవ అధ్యక్షులు కంది సదానందం సభ్యులు ముత్యాల శేఖర్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## చికిత్స కోసం పది వేల సహాయం




**గోకవరం, జనవరి 28 (నిఘా న్యూస్):** పేదల పాలిట పెన్నిధిగా విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షులు, బీజేపీ నాయకులు కంబాల శ్రీనివాసరావు నీరజనాలు అందుకుంటున్నారు. అయన వద్దకు సాయం కోసం వచ్చిన వారికి లేదనకుండా సహాయం చేసి పంపిస్తున్నారు. అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఓ బాధితురాలకు కంబాల పది వేల రూపాయల ఆర్థిక సాయం చేశారు. గోకవరం గ్రామం అంబేద్కర్ కాలానికి చెందిన రొట్టా తులసికి శరీరమంతా ఇన్ఫెక్షన్ వచ్చింది. గోకవరం కేర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. ఆమె కుటుంబం నిరుపేదలు, రోజు కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కంబాల శ్రీనివాసరావు పేదలకు చేస్తున్న సాయం, సేవ కార్యక్రమాలు తెలుసుకొని ఆమె భర్త ప్రవీణ్ కుమార్, కుటుంబ సభ్యులు తంటికొండ రోడ్డులోని సీఎండీ ఆఫీస్, బీజేపీ నియోజకవర్గ కార్యాలయానికి సోమవారం రాత్రి వచ్చి పరిస్థితి వివరించి, వైద్య ఖర్చులకు సహాయం చేయాలని కోరగా తక్షణమే స్పందించిన కంబాల శ్రీనివాసరావు ఆమె ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని, పదివేల రూపాయలు నగదును కుటుంబ సభ్యులకు అందజేశారు. అన్ని విధాల సహాయ, సహకరాలు అందిస్తానని, ధైర్యంగా ఉండాలని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా బాధితురాలు భర్త ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ అనారోగ్యంతో ఉన్న తన భార్య వైద్య ఖర్చుల కోసం సాయం చేయాలనీ కంబాల శ్రీనివాసరావుని కోరగా తమ పాలిట దేవుడు లాగా కంబాల శ్రీనివాసరావు నేనున్నానంటూ భరోసా కల్పించి, పదివేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేసారన్నారు. ఆయన తమలాగా ఆపదలో ఉన్న ఎంతో మందికి సాయం చేస్తున్నారని, ఆయన సేవలకు అంతు లేదని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రామసేన సభ్యులు, బీజేపీ నాయకులు మామిడి అయ్యప్ప, ఇనకోటి బాపన్న దొర, వరసాల ప్రసాద్, డాక్టర్ వల్లూరి జగన్నాథరావు శర్మ, కట్టా కళ్యాణ్, దళిత నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కాజిపేట్ అభివృద్ధి సిగలో మరో కీలక ఘట్టం

- దశాబ్దాల కల సాకార పోరులో నేడు తొలి అడుగు
- ఎమ్మెల్యే నాయిని కృషితో బస్ స్టేషన్ నిర్మాణానికి అడుగులు



**వరంగల్, జనవరి 28 (నిఘా న్యూస్):** హైదరాబాద్ తరువాత రెండు రాజధానిగా వరంగల్ నగరం అభివృద్ధి చెందుతుందని,ప్రతికూల వాతావరణం ప్రజా ప్రభుత్వం కల్పిస్తున్నదని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుండి కాజీపేట రైల్వే ఆవరణలో బస్ స్టాండ్ నిర్మాణం కోసం అడిషన్ డివిజన్ రైల్వే మేనేజర్ సికింద్రాబాదు ఎం.గోపాల్, సీనియర్ డివిజనల్ ఇంజనీర్ ప్రంజల్ కేశర్వాణి బృందంలతో ఎంపీ కడియం కావ్య, మేయర్ గుండు సుధారాణి,జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య తో కలిసి రైల్వే స్టేషన్ ఆవరణలో నూతన బస్ స్టేషన్ కావాల్సిన స్థలాలను పరిశీలించారు. హైదరాబాద్ నుంచి వచ్చిన రైల్వే అధికారుల బృందం ఉదయం నుంచి స్థలాలను పరిశీలించారని,ఇక్కడి నివేదికను పై అధికారుల దృష్టికి తీసుకెళ్తారని వెల్లడించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ ఎంతో మంది నాయకులు,ప్రజలు కాజీపేట బస్ స్టేషన్ నిర్మాణం కావాలని పోరాటాలు చేశారు, గతంలో నేను కూడా ధర్నాలు రాస్తారోకో చేసినమనిగుర్తు చేశారు. కాజీపేట బస్ స్టాండ్ ఏర్పాటు,కాజీపేట రైల్వే డివిజన్ ఏర్పాటు కోసం ఎంపీ ,మేయర్ ,జిల్లా కలెక్టర్,ప్రజా ప్రతినిధులు అందరూ కలిసి రైల్వే అధికారులను కలవడం జరిగిందని,రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టితో ఈ రోజు రైల్వే అధికారులు మొదటి అడుగు వేశారని తెలిపారు.రానున్న అతికొద్ది రోజుల్లోనే రైల్వే బ్రిడ్జి నిర్మాణం కూడా పూర్తి అవుతుందని,తదనంతరం కాజీపేట బస్ స్టేషన్ నిర్మాణానికి అనుమతులు వస్తాయని రైల్వే అధికారులు సహకారాలు అందిస్తారని ఆశాభావం వ్యక్తంచేశారు. గతంలో కాజీపేట బస్ స్టేషన్ పేరిట ఎందరో నాయకులు తమ సొంత లాభాలకు వాడుకున్నారని,నా కల బస్ స్టేషన్ నిర్మించడమని అన్నారు.రానున్న రోజుల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాజీపేట నగరాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని,త్వరలో కాజీపేటలో డిగ్రీ కళాశాల,మెరుగైన వైద్యం కోసం దవాఖాన ఏర్పాటు చేస్తామని తెలిపారు. రైల్వే స్టేషన్ ఎదురుగా ఉన్న కుడి వైపున కానీ ఎడమ వైపున కానీ బస్ స్టాండ్ నిర్మాణానికి అనువైన స్థలాలను ఉన్నాయని రైల్వే అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యులు బత్తిని శ్రీనివాస్ రావు,మాజీ ఎమ్మెల్సీ పుల్లపద్మావతి, స్థానిక కార్పొరేటర్లు, సంకు నర్సింగ్, విజయ, సయ్యద్ రజావాలి, జక్కుల రవీందర్ మాజీ కార్పొరేటర్లు, సీనియర్ నాయకులు, డివిజన్ అధ్యక్షులు,అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కుంభమేళాలో టెలికమ్ సేవలు అద్భుతం

### కోట్లాది మంది వచ్చినా అంతరాయం లేకుండా సేవలు



**లక్నో,జనవరి28(నిఘా న్యూస్):** ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక వేడుక మహా కుంభమేళా ఘనంగా జరుగు తోంది. కోట్లాదిమంది తరలి వస్తున్నా..టెలికామ్ సేవలకు ఎక్కడా అంతరాయం కలగడం లేదు. ప్రయాగ్ రాజ్ త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు లక్షలాది మంది తరలి వస్తున్నారు. ఇంతమందికి సౌకర్యాలు కల్పించడమంటే మాటలా? అంతేకాదు ఇంతమందికి ఎలాంటి అంతరాయం లేకుండా టెలికాం సేవలు అందించడమూ కత్తిమీద సామే. అలాంటిది భక్తజనం పోటెత్తుతున్నా కాల్స్‌కు అంతరాయం లేకుండా, మెరుగైన ఇంటర్నెట్ సేవల్ని స్థానిక యంత్రాంగంతో కలిసి టెలికాం కంపెనీలు అందిస్తున్నాయి. మహా కుంభమేళాకు వచ్చే ప్రజలకు ఎటువంటి అంతరాయం లేకుండా నెట్‌వర్క్ సేవల్ని అందించాలనే లక్ష్యంతో దాదాపు అన్ని టెలికాం సంస్థలు ఈ ప్రాంతంలో తమ సేవల్ని పెంచుకున్నాయని ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ అండ్ కమాండ్ సెంటర్ (ఎఅఅఅ) నిర్వాహకులు తెలిపారు. ఎయిర్‌టెల్, బీఎస్ఎన్ఎల్, జియో, వొడాఫోన్ ఐడియా కలిసి కుంభమేళా జరిగే ప్రాంతంలో మూడు విపత్తు ప్రతిస్పందన నిర్వహణ కేంద్రాల్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అత్యవసర సమయాల్లో కమ్యూనికేషన్ కోసం, సంక్షోభ పరిస్థితుల్లో వెంటనే చర్యలు చేపట్టేందుకు ఇవి సాయం చేస్తాయని తెలిపారు. అంతేకాదు టెలికాం ప్రొవైడర్లు 53 వరకు సహాయక కేంద్రాల్ని ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. ప్రయాగ్‌రాజ్‌లో కొత్తగా 328 టవర్లు, మొత్తం 328 బీటీఎస్‌లు ఏర్పాటు చేశారు. హై స్పీడ్ నెట్‌వర్క్ కవరేజ్ అందించేందుకు 92 కిలోమీటర్ల వరకు ఆప్టికల్ ఫైబర్ కేబుల్స్ వేశారు. కుంభమేళాలో పొరపాటున ఎవరైనా తప్పిపోతే వారి సమాచారం తెలుసు కొనేందుకు నెట్‌వర్క్ సదుపాయం అనేది కీలకం. దీంతో టెలికాం సంస్థలు తమ నెట్‌వర్క్ సేవల్ని మెరుగుపరుచుకున్నాయి. ఎయిర్‌టెల్ కొత్తగా 287 సైట్స్ (టవర్స్), 78 సెల్స్ ఆన్ వీల్స్ ఏర్పాటు చేసింది.

మునుపటి కుంభమేళాతో పోలిస్తే ప్రస్తుతం నెట్‌వర్క్ సదుపాయం మెరుగ్గా ఉందని మహాకుంభ్ నగర్ అదనపు జిల్లా మెజిస్ట్రేట్ వివేక్ చతుర్వేది తెలిపారు. డిజిటల్ పేమెంట్ సదుపాయం ఉండటంతో డబ్బును వెంట తీసుకెళ్లే సమస్య లేదన్నారు. ఇక ఏదైనా సమస్య ఎదురైతే అధికారులకు సమాచారం అందించడం కూడా ప్రస్తుతం సులువుగా మారిందన్నారు. పన్నెండేళ్లకు ఒకసారి జరిగే ఈ కుంభమేళా ఫిబ్రవరి 26 వరకు జరగనుంది. ఈ వేడుక ముగింపు నాటికి 40 కోట్లకు పైగా భక్తులు తరలివస్తారని అంచనా. ఇలా 45 రోజుల పాటు ఈ జరగనుంది. ఇప్పటి వరకు 8 కోట్ల మంది భక్తులు త్రివేణీ సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించారు. బుధవారం మౌని అమావాస్య రోజు సుమారు 10 కోట్ల మంది భక్తులు తరలివస్తారని అంచనా.

## విషాదంగా యూపి లడ్డూ మహోత్సవం

### వేదిక కూలి ఐదుగురు దుర్మరణం

**లక్నో,జనవరి28(నిఘా న్యూస్):** ఉత్తర ప్రదేశ్‌లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. లడ్డూ మహోత్సవం నిర్వహిస్తున్న ఓ వేదిక కుప్పకూలింది. ఈ ఘటనలో ఐదుగురు మృతి చెందగా.. 60 మందికి పైగా భక్తులు గాయపడ్డారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. యూపీలోని బాగ్‌పత్‌లో ఆదినాథుడి నిర్వాణ లడ్డూ ఉత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈసందర్భంగా చెక్కతో ఏర్పాటుచేసిన వేదిక కుప్పకూలింది. ఈ ఘటనలో ఐదుగురు మృతి చెందారు. అంతేకాక.. జైన శిష్యులు, పోలీసు సిబ్బందితో సహా 60 మందికి పైగా గాయపడ్డారు. మరికొంత మంది శిథిలాల కింద చిక్కుకున్నట్లు తెలుస్తోంది. అధికారులు సహాయక చర్యలు కొనసాగిస్తున్నారు. ఈ ప్రమాదంపై సీఎం యోగి ఆదిత్యనాథ్ స్పందించారు. ఘటనా స్థలంలో సహాయక చర్యలు వేగవంతం చేయాలని, క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు.

## నాటి సీఎం కేసీఆర్ ఎవరినీ పోల్చలేం : జగదీశ్‌రెడ్డి

**నల్లగొండ,జనవరి28(నిఘా న్యూస్):** రైతు పక్షాన నిలబడి వారి శ్రేయస్సు కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టిన నాటి సీఎం కేసీఆర్‌తో ఎవరినీ పోల్చలేమని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. నల్లగొండ కుక్క మూతి నేతలకు మేం భయపడం. తెలంగాణ రాష్ట్రం రైతాంగం మద్దతుతో ఏర్పడిందని జగదీష్ రెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లాలోని క్లాక్ టవర్ వద్ద ఏర్పాటు చేసిన రైతు మహా ధర్నాలో ఆయన కేటీఆర్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగదీష్ రెడ్డి మాట్లాడుతూ..తెలంగాణలో కరెంట్ ధరల పెంపును ఒప్పుకోను అని చెప్పి నాడు కేసీఆర్ రాజీనామా చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు రైతులే మద్దతుగా నిలిచారన్నారు. 'కేసీఆర్ చచ్చుడో తెలంగాణ వచ్చుడో' నినాదాలతో తెలంగాణ సాధించారని గుర్తు చేశారు. రాష్ట్రం వచ్చాక ప్రజల కోరిక మేరకు అధికారం చేపట్టారు. అధికారంలోకి వచ్చాక రైతులను రాజులను చేసి దేశంలోనే అగ్రస్థానంలో నిలబెట్టిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీస్తే కేసులు పెట్టి జైళ్లకు పంపుతున్నారు. అయినా కేసీఆర్ ఆదేశాలతో కేటీఆర్, రైతులు నల్లగొండకు భారీగా తరలి వచ్చారు. కేటీఆర్‌కు రాహుల్ గాంధీనే పోటీ, ఇక్కడ జిల్లా నేతల గురుంచి కాదని స్పష్టం చేశారు.

## ఢిల్లీల నాలుగంతస్థుల భవనం కూలి నలుగురు మృతి

**న్యూఢిల్లీ,జనవరి28(నిఘా న్యూస్):** ఉత్తర ఢిల్లీలోని బురారి ప్రాంతంలో సోమవారం సాయంత్రం నాలుగంతస్తుల భవనం కూలి ఇద్దరు అమ్మాయిలు సహా మొత్తం ముగ్గురు మరణించారని పోలీసులు మంగళవారం తెలిపారు. ఆస్కర్ పబ్లిక్ స్కూల్ సమీపంలో కొత్తగా కడుతున్న భవనం కూలిపోయింది. ఇప్పటి వరకు 12 మందిని కాపాడినట్లు, మూడు శవాలను శిథిలాల నుంచి వెలికి తెచ్చినట్లు పోలీసులు తెలిపారు. చనిపోయిన వారిలో సాధన(17), రాధిక(7), మరో వ్యక్తిని ఇంకా గుర్తించాల్సి ఉందని పోలీసులు వివరించారు. ఇప్పటికీ రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతున్నట్లు సమాచారం. 'మేము దర్యాప్తును ప్రారంభించాము. అనేక టీమ్‌లను రూపొందించాము. బిల్డింగ్ ఓనర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకుంటాము' అని ఓ పోలీస్ అధికారి తెలిపారు. ఇదిలావుండగా ఢిల్లీ ముఖ్యమంత్రి ఆతిషి 'ఎక్స్' పోస్ట్‌లో బాధితులకు వీలయినంత సాయం అందిస్తామని పేర్కొన్నారు. కాగా సాయక చర్యలో సాయపడమని స్థానిక పార్టీ ఎంఎల్ఏకు మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఆదేశించారు. ఢిల్లీ అగ్నిమాపక దళం చీఫ్ సాయక చర్యల వీడియోను మంగళవారం విడుదలచేశారు. శిథిలాల కింద చిక్కుకుపోయిన వారిని వెలికి తీయడానికి డిఎఫ్ఎస్ సిబ్బంది రాత్రింబవళ్లు శ్రమిస్తున్నారని డిఎఫ్ఎస్ చీఫ్ అతుల్ గార్గ్ తెలిపారు.

## ఫార్ములాను అడ్డుకున్న సిఎం రేవంత్

### పోలీసులకు ఫిర్యాదు చేసిన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

**హైదరాబాద్,జనవరి28(నిఘా న్యూస్):** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బిఆర్ఎస్ నేత ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్ ఫోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫార్ములా ఈ కేసు వ్యవహారంలో సీఎంపై కేసు నమోదు చేయాలని నార్సింగి పోలీస్ స్టేషన్ కు వెళ్లి ఆర్ఎస్‌పి ఫిర్యాదు చేశారు.ఆయన వెంట పలువురు బిఆర్ఎష్ నేతలు ఉన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేను రాజకీయాల్లో రాకముందు ఐపీఎస్ అధికారిగా, క్రైమ్ బ్రాంచ్ డీసీపీగా, అడిషనల్ డీజీపీగా, వార్ క్రైమ్స్ ఇన్వెస్టిగేటింగ్ అధికారిగా ఐక్యరాజ్యసమితిలో పనిచేశా. రేవంత్ రెడ్డి అనాలోచిత నిర్ణయాల వల్ల లేని అవినీతిని పేపర్ మీద పెట్టి అనవసరంగా తెలంగాణకు నష్టం చేస్తున్నాడు అని మండిపడ్డారు. కాగా, ఫార్ములా ఈ రేసు కేసులో మాజీ మంత్రి కెటిఆర్.. చట్ట విరుద్ధంగా, ఆర్బీఐ అనుమతి లేకుండా విదేశీ కంపెనీకి దాదాపు రూ.53 కోట్లు ట్రాన్స్ ఫర్ చేసినట్లు గుర్తించిన ఏసీబీ ఆయనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న సంగతి తెలిసిందే.

## పవన్‌కల్యాణ్ ఉండగా లోకేశ్‌కు ఏలా ఇస్తారు డిప్యూటీ సీఎం పదవి

### టీడీపీ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి

**అమరావతి,జనవరి28(నిఘా న్యూస్):** నారా లోకేశ్‌కు డిప్యూటీ సీఎం పదవి ఇవ్వాలని టీడీపీ కార్యకర్తలు చేస్తున్న డిమాండ్‌పై టీడీపీ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి స్పందించారు. లోకేశ్‌కు డిప్యూటీ సీఎం పదవి ఇవ్వాలని డిమాండ్ చేయడం సరికాదని అన్నారు. తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రిలో బుచ్చయ్య చౌదరి మీడియాతో మాట్లాడుతూ.. ఇప్పటికే పవన్ కల్యాణ్ డిప్యూటీ సీఎంగా ఉన్నారని తెలిపారు. అలాంటప్పుడు లోకేశ్‌కు డిప్యూటీ సీఎం ఎందుకు ఇవ్వడమని ప్రశ్నించారు. తెలుగుదేశం పార్టీ కోసం లోకేశ్ ఎంతగానో కష్టపడ్డారని.. అందుకు సముచిత స్థానం ఇచ్చారని తెలిపారు. గత ప్రభుత్వంలో పెట్టుబడిదారులు పారిపోయారని గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. కూటమిపై వైసీపీ తప్పుడు ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. విశాఖ, రాయలసీమ కేంద్రాలుగా పెట్టుబడులు రాబోతున్నాయని తెలిపారు. ఎన్నికల హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. కేంద్రం సహకారంతో ఏపీ, తెలంగాణ ముందుకు వెళ్తున్నాయని అన్నరు. ఉమ్మడి ఆస్తుల విషయంలో ఇంకా క్లారిటీ రావాల్సి ఉందని చెప్పారు. మాజీ ఎంపీ విజయసాయి రెడ్డిపై గోరంట్ల బుచ్చయ్య చౌదరి తీవ్ర విమర్శలు గుప్పించారు. విశాఖ కేంద్రంగా విజయసాయిరెడ్డి దోపిడీ చేశారని మండిపడ్డారు. వేల ఎకరాలు, లక్షల కోట్లు దోచుకున్న వ్యక్తి విజయసాయి రెడ్డి అని అన్నారు. ఏ2గా ఉన్న విజయసాయి కేసుల నుంచి తప్పించుకోవడానికే రాజీనామా చేశారని మండిపడ్డారు. అవినీతి అక్రమాలకు పాల్పడిన ఎవరికైనా సరే శిక్ష తప్పదని హెచ్చరించారు. అధికారం పోయిన తర్వాత పార్టీలో చేరిపోదామనుకుంటే.. చేర్చుకోవడం సరైనది కాదని అన్నారు. విజయసాయిని బీజేపీ చేర్చుకుంటుందని అనుకోవడం లేదని తెలిపారు. వైసీపీ రాబోయే రోజుల్లో కనుమరుగవుతుందని అభిప్రాయపడ్డారు. తొందరలోనే వైసీపీలో అందరూ సర్దుకుంటారని అన్నారు.

## కార్పోరేటర్లు అభివృద్ధిపై దృష్టి పెట్టాలి

- మరోమారు మేయర్కావాలని కోరుకోవడం లేదు
- జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి స్పష్టీకరణ



**హైదరాబాద్,జనవరి28(నిఘా న్యూస్):** ఇది ఎలక్షన్ ఇయర్.. అభివృద్ధిపై కార్పొరేటర్లు దృష్టి పెట్టాలని జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. గొడవలు చేసేందుకు కౌన్సిల్ వేదిక కాదని చెప్పారు. మళ్లీ కార్పొరేటర్‌గా తాను పోటీ చేయనని అన్నారు. మళ్లీ మేయర్ అయ్యే ఆలోచన తనకు లేదని తెలిపారు.మేయర్, డిప్యూటీ మేయర్‌పై అవిశ్వాసం పెట్టేందుకు ప్రతిపక్షాలకు హక్కు ఉందని విజయలక్ష్మి అన్నారు. అవిశ్వాసానికి స్వాగతిస్తున్నానని చెప్పారు. అవిశ్వాసానికి ఎంతమంది కావాలో కూడా బీఆర్ఎస్, బీజేపీ పార్టీలకు తెలియదని అన్నారు. పిబ్రవరి 11వ తేదీ వరకు తామే మేయర్, డిప్యూటీ మేయర్ అని స్పష్టం చేశారు. ఫిబ్రవరి 11వ తేదీ తర్వాత అవిశ్వాసం పెట్టాలి అంటే ముందుగా కార్పొరేటర్లు, ఎక్స్ ఆఫీసియో సభ్యులు 98 మంది కలెక్టర్‌కు లెటర్ ఇవ్వాలని అన్నారు. అదంతా అవ్వాలి అంటే మార్చి అవుతుందని చెప్పారు. ఈ నెల 30వ తేదీన జరిగే జీహెచ్ఎంసీ కౌన్సిల్ మీటింగ్‌లో ప్రజా సమస్యలపై చర్చ జరగాలని అన్నారు. అందుకు అందరూ సహకరించాలని చెప్పారు. తనపై అవినీతి ఆరోపణలు చేసిన బీఆర్ఎస్ నాయకులకు తన గురించి తెలుసునని చెప్పారు. అక్రమంగా ఆస్తి సంపాదించాల్సిన అవసరం, ఖర్మ తనకు లేదని అన్నారు. బీఆర్ఎస్‌లో తాను ఉంటే చేయని ఆరోపణలు, ఇప్పుడు ఎందుకు చేస్తున్నారో అందరికీ తెలుసునని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి పేర్కొన్నారు.

## తీర్థయాత్రలో ఘట్కేసర్ మాజీ బిఆర్ఎస్ కౌన్సిలర్లు



**ఘట్‌కేసర్, జనవరి 28 (నిఘా న్యూస్):** ఘట్కేసర్ మున్సిపాలిటీ మాజీ పాలకవర్గం తీర్థయాత్రలలో సేద తీరుతున్నారు. ఘట్కేసర్ మున్సిపాలిటీ పాలకవర్గం జనవరి 27 కు పాలకవర్గం పదవి కాలం ముగియడంతో ప్రశాంతత కోసం మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ పలుగుల మాధవరెడ్డి ఆధ్వర్యంలో కేవలం బిఆర్ఎస్ పార్టీకి చెందిన కౌన్సిలర్లు కోఆప్షన్లు మాత్రమే తీర్థయాత్రలకు బయలుదేరారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ పలుగుల మాధవరెడ్డి మాట్లాడుతూ ఐదు సంవత్సరాల కాలంలో మా కౌన్సిలర్లు ఏమాత్రం ఇబ్బంది పెట్టలేదు వారికి కూడా నేను ఏమాత్రం ఇబ్బంది పెట్టలేదు. అందరం చక్కగా కలిసిమెలిసి పాలనను సాగించి తమ వార్డులను అభివృద్ధి చేసుకుందామని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా అందరమూ సంతోషంగా ఉండాలి అని ఏడుపాయల కనకదుర్గమ్మ అమ్మవారి ఆశీస్సుల కోసం వచ్చామని వారు వివరించారు 9 మంది కౌన్సిలర్లు నలుగురు కో ఆప్షన్లు కలిసి ఆనందంగా బయలుదేరామన్నారు. ఈ కార్యక్రమంలో ఘట్కేసర్ మున్సిపాలిటీ బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు బండారి శ్రీనివాస్ గౌడ్, మాజీ కౌన్సిలర్లు చందుపట్ల వెంకటరెడ్డి కొమ్మ గోని రమాదేవి, మహిపాల్ గౌడ్, చిలుకూరి హేమలత, గోపాల్ రెడ్డి, కొమ్మిడి అనురాధ కొమ్మిడీ రాఘవరెడ్డి, బండారి ఆంజనేయులు గౌడ్, బండారి వసంత శ్రీనివాస్ గౌడ్, షేక్ జాంగిర్, బేతాళ నర్సింగ్ రావు, కోఆప్షన్ సభ్యులు ఎస్.కె షౌకత్ మియా, పల్లె అరుణ బొట్టు అరుణ, కృపానిధి, ఘట్కేసర్ రైతు సహకార సంఘం డైరెక్టర్ రేసు లక్ష్మారెడ్డి, ఘట్కేసర్ మండల పార్టీ బిఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి పన్నాల కొండల రెడ్డి, మాజీ ఎంపీటీసీ మేకల నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

## మేము అధికారంలోకి వచ్చాక మీ కార్యకర్తలను కాపాడుకుంటారా.?

### వైసీపీ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి

**అమరావతి,జనవరి28(నిఘా న్యూస్):** కూటమి ప్రభుత్వం వచ్చిన ఆరు నెలలకే వైసీపీ నేతలను టార్గెట్ చేసి.. వారిపై దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని వైసీపీ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ఆరోపించారు. ముఖ్యంగా నెల్లూరులో మంత్రి నారాయణ.. వైసీపీ నేతలను టార్గెట్ చేసి ఇబ్బంది పెట్టేందుకు.. వైసీపీ నేతలు, కార్యకర్తల ఇళ్లపై దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. బాలకృష్ణారెడ్డి కొత్తగా నిర్మించిన ఇంటిని అక్రమ నిర్మాణమని కూల్చేయడమే అందుకు నిదర్శనమని అన్నారు. మంత్రి నారాయణ ఆదేశాలతో అధికారులు ఇంటిని కూల్చేయడం ఏమిటని పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి మండిపడ్డారు. ప్రజలకు సంక్షేమ పాలన అందిస్తారని భావించి కూటమి ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకువస్తే.. నెల్లూరులో ప్రజల ఇళ్లను కూల్చివేసి.. వారి దుఃఖానికి కారణం అవుతున్నారన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి నారాయణ, టీడీపీ నేత కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డికి ఇది తగదని ఇలాంటి చర్యలను ప్రజలు ఎవరు ఉపేక్షించరని హెచ్చరించారు. నెల్లూరులో ప్రజలకు అందించే సంక్షేమ పాలన ఇదేనా అని టీడీపీని పర్వతరెడ్డి నిలదీశారు. దీనికి నారాయణ, శ్రీనివాసరెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఎల్లకాలం టీడీపీ అధికారంలో ఉండదని.. వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అప్పుడు టీడీపీ నేతలు.. వాళ్ల కార్యకర్తలను కాపాడుకోగలరా అని ప్రశ్నించారు. వైసీపీ కార్యకర్తలపై టీడీపీ నేతలు దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని.. ఇలాంటి పరిణామాలు పునరావృతమైతే.. తెలుగుదేశం పార్టీ తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

## షరియా పట్ల నాకు విశ్వాసం లేదు

### భారతీయ వారసత్వ చట్టమే వర్తింప చేయండి

### సుప్రీంలో కేరల ముస్లిం మహిళ పిటిషన్

న్యూఢిల్లీ,జనవరి28(నిఘా న్యూస్): షరియాకు బదులు భారతీయ వారసత్వ చట్టమే తనకు వర్తించాలని అభ్యర్థిసూ ఒక ముస్లిం మహిళ దాఖలు చేసిన పిటిషన్‌పై కేంద్రం వైఖరి ఏమిటని సుప్రీం కోర్టు మంగళవారం అడిగింది. 'కేరళ పూర్వపు ముస్లింలు' సంస్థ ప్రధాన కార్యదర్శి, అళప్పుళ వాసి సఫియా పిఎం పిటిషన్ సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా, న్యాయమూర్తులు సంజయ్ కుమార్, కెవి విశ్వనాథన్‌తో కూడిన ధర్మాసనం ముందుకు వచ్చింది. కేంద్రానికి ప్రాతినిధ్యం వహిస్తున్న సొలిసిటర్ జనరల్ (ఎస్‌జి) తుషార్ మెహతా ఈ పిటిషన్ ఒక ఆసక్తిదాయక ప్రశ్నను లేవనెత్తిందని అన్నారు. 'పిటిషనర్ మహిళ జన్మతః ముస్లిం. తనకు షరియాలో విశ్వాసం లేదని ఆమె చెబుతోంది, అది ఒక తిరోగమన చట్టం అని ఆమె భావిస్తోంది' అని మెహతాపేర్కొన్నారు. 'ఇది మత విశ్వాసాల వ్యాప్తంగా వర్తిస్తుంది. మీరు కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయవలసి ఉంటుంది' బెంచ్ సూచించింది. ఆదేశాలు తీసుకుని, కౌంటర్ అఫిడవిట్ దాఖలుకు మూడు వారాలు కావాలని మెహతా కోరారు. బెంచ్ నాలుగు వారాలు మంజూరు చేసి, ఈ విషయాన్ని మే 5న మొదలయ్యే వారంలో వింటామని తెలియజేసింది.ఈ పిటిషన్‌పై కేంద్రం, కేరళ ప్రభుత్వ స్పందనలను సర్వోన్నత న్యాయస్థానం నిరుడు ఏప్రిల్ 29న కోరింది. తాను అధికారికంగా ఇస్లాంను వదిలిపెట్టకపోయినప్పటికీ తాను విశ్వాసపరురాలిని కానని, అధికరణం 25 కింద తన మత ప్రాథమిక హక్కు అమలును కోరుకుంటున్నానని తెలిపిన పిటిషనర్ దానిలో 'విశ్వసించని హక్కు'ను కూడా చేర్చాలని అన్నారు. ముస్లిం పర్సనల్ లా తమకు వర్తించకూడదని ఆకాంక్షిస్తున్న వ్యక్తులను మరణ శాసనంలేని, నిబంధన వారసత్వం విషయాల్లో 'దేశం సెక్యులర్ చట్టం' భారతీయ వారసత్వ చట్టం 1925ను వర్తించేలా అనుమతించేలా ఒక డిక్లరేషన్‌ను జారీ చేయాలని కూడా ఆమె కోరారు. షరియా చట్టాల కింద ఆస్తిలో మూడింట ఒక వంతు వాటాకు ముస్లిం మహిళలు అర్హులని న్యాయవాది ప్రశాంత్ పద్మనాభన్ ద్వారా దాఖలైన సఫియా పిటిషన్ స్పష్టం చేసింది. పిటిషనర్‌కు ముస్లిం పర్సనల్ లా వర్తించదనే డిక్లరేషన్ కోర్టు నుంచి రావలసి ఉంటుందని, లేనిచో ఆమె తండ్రి ఆస్తిలో మూడింట ఒక వంతు ఇవ్వలేకపోవచ్చునని న్యాయవాది సూచించారు. ముస్లింలను మినహాయించినందుకు భారతీయ వారసత్వ చట్టాన్ని, ఇతర నిబంధనలను సవాల్ చేసేందుకు తగు విధంగా పిటిషన్‌ను సవరించేందుకు సఫియాను సర్వోన్నత న్యాయస్థానం అనుమతించింది. దేశవ్యాప్తంగా విస్తృత స్థాయిలో విపరిణామాలు సంభవించవచ్చునని సూచిస్తూ పిటిషన్ జోక్యం చేసుకోవలసిందిగా బెంచ్‌కు విజ్ఞప్తి చేసింది. సుప్రీం కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసు ముస్లిం మహిళలు అందరి కోసం అని, కాని ప్రస్తుత పిటిషన్ ముస్లింగా జన్మించి మతాన్ని వీడాలని ఆకాంక్షించే వారి కోసమని పిటిషన్ పేర్కొన్నది.

## జగన్ పాలనా వైఫల్యాలనుంచి కోలుకునేలా కృషి

### ప్రభుత్వ పథకాలు పక్కాగా అమలుకు చర్యలు

### మంత్రి కందుల దుర్గేశ్ వెల్లడి

**గుంటూరు,జనవరి28(నిఘా న్యూస్):** జగన్ పాలనలోని వైఫల్యాల నుంచి ఏపీ కోలుకునేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. గుంటూరు జిల్లాలో ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణలో ఎదురవుతున్న ఇబ్బందులను గుర్తించామని అన్నారు. మంగళవారం గుంటూరు జిల్లా అభివృద్ధిపై మంత్రి కందుల దుర్గేష్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. అనంతరం మీడియాతో మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడారు. క్షేత్రస్థాయిలో జరగాల్సిన అంశాలపై జలవనరులు, వ్యవసాయం, నగర అభివృద్ధిపై సమీక్ష చేశామని చెప్పారు. ప్రభుత్వ పథకాలు పగడ్బందీగా అమలు చేసేందుకు చర్యలు

# ఇంత క్రూరంగా కూడా చంపుతారా ?

- వెంకటమాధవి హత్య కేసులో నివ్వెరపోయే నిజాలు
- గురుమూర్తిని అరెస్ట్ చేసి సీన్ రీ కన్‌స్ట్రక్షన్ చేసిన పోలీసులు
- వివరాలు వెల్లడించిన రాచకొండ సీపీ సుధీర్‌బాబు





**హైదరాబాద్, జనవరి28 (నిఘా న్యూస్):** తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన మీర్‌పేట హత్య కేసులో నిందితుడు గురుమూర్తిని పోలీసులు మంగళవారం మీడియా ఎదుట ప్రవేశపెట్టారు. కేసు వివరాలను రాచకొండ సీపీ సుధీర్‌బాబు వెల్లడించారు. వెంకట మాధవి హత్య కేసు దర్యాప్తులో ఆధారాలు సేకరించేందుకు సిబ్బంది తీవ్రంగా శ్రమించాల్సి వచ్చిందన్నారు. 'ఒక మనిషిని ఇంత క్రూరంగా చంపుతారా?' అని మేం నివ్వెరపోయామన్నారు. భార్యను ఇంత దారుణంగా చంపిన గురుమూర్తిలో ఎలాంటి పశ్చాత్తాపం కనిపించడం లేదన్నారు.' క్షణికావేశంలో జరిగిన హత్య కాదు.. పథకం ప్రకారమే హత్య చేశాడు. గురుమూర్తి స్వతహాగానే క్రూరుడు' అని సీపీ వివరించారు. 'సంక్రాంతి పండగకు మాధవి, గురుమూర్తి తమ పిల్లల్ని తీసుకుని బంధువుల ఇంటికి వెళ్లారు. 15న పిల్లల్ని బంధువుల ఇంటి వద్దే వదిలేసి వెంకటమాధవి, గురుమూర్తి రాత్రి 10.41 గంటలకు ఇంటికి చేరుకున్నట్లు సీసీటీవీ ఫుటేజ్‌లో గుర్తించాం. 16న ఉదయం 8 గంటలకు ఆమెతో అకారణంగా గొడవ పెట్టుకొని ఘర్షణకు దిగాడు.

మాధవి తలను గోడకేసి కొట్టి కిందపడిపోయిన తర్వాత గొంతు నులిమి హతమార్చాడు. ఇంట్లో ఉన్న కత్తితో కాళ్లు, చేతులు, శరీరం, తల నాలుగు భాగాలుగా కట్ చేశాడు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ మృతదేహాన్ని ముక్కలు చేసినట్టు గుర్తించాం. వాటర్ హీటర్‌తో నీళ్లు మరిగించి శరీర భాగాలను ఉడక బెట్టాడు. ఆ తర్వాత వాటిని స్టవ్‌పై పెట్టి కాల్చాడు. రోకలి బండతో ఆ భాగాలను దంచి పొడి చేశాడు. ఆ పొడిని ప్లాస్టిక్ బకెట్‌లో తీసుకెళ్లి జిల్లెలగూడ చెరువులో పోశాడు. ఇంట్లో మొత్తం ఆనవాళ్లు లేకుండా చేసిన తర్వాత బంధువుల ఇంటికి వెళ్లి పిల్లల్ని తీసుకొచ్చాడు' 'అమ్మ ఏది' అని పిల్లలు అడిగితే ఎక్కడికో వెళ్లిందని చెప్పాడు. చంపినట్లు భౌతిక ఆధారాలు లేకుంటే.. కేసు నుంచి తప్పించుకోవచ్చని భావించాడు. పిల్లలు ఉంటే సాక్ష్యం చెబుతారనే అనుమానంతో వారిని బంధువుల ఇంటి వద్దే ఉంచాడు. రెండ్రోజుల తర్వాత మాధవి తల్లిదండ్రులు అడిగితే.. పోలీస్ స్టేషన్‌కు వచ్చి మిస్సింగ్ కేసు పెట్టారు.

ఈ విషయాలన్నీ మాధవి మేనమామకు గురుమూర్తి చెప్పాడు. గురుమూర్తి చాలా క్రూరమైన స్వభావం కలిగిన వ్యక్తి. ఆర్మీలో 15 ఏళ్లు పనిచేశాడు. ఒక పథకం ప్రకారమే భార్యను హత్య చేశాడు. సాంకేతిక ఆధారాలు సేకరించాం అని వివరించారు. వెంకటమాధవి హత్య కేసును లోతుగా దర్యాప్తు చేస్తున్నాం. భార్యను కిరాతకంగా చంపడంపై గురుమూర్తిలో కొంచమైనా పశ్చాత్తాపం లేదు. హత్య కేసులో నిందితుడు ఉపయోగించిన స్టవ్, కత్తి, రోలర్, రోలర్ స్టోన్, బకెట్, వాటర్ హీటర్, రూమ్ ఫ్రెషనర్, యాసిడ్ బాటిల్, డోర్ మ్యాట్, స్క్రాప్ బకెట్, సర్ఫ్ ప్యాకెట్, బ్లాక్ కలర్ షర్ట్, మృతురాలి డ్రెస్, రెండు మొబైల్ ఫోన్లు సహా మొత్తం 16 వస్తువులను సీజ్ చేశాం' అని సీపీ సుధీర్‌బాబు తెలిపారు. ఈ క్రమంలో మీర్‌పేట హత్య కేసు నిందితుడు గురుమూర్తిని పోలీసులు అరెస్టు చేశారు. అతడిని ఇంటికి తీసుకెళ్లి సీన్ రీ కన్‌స్ట్రక్షన్ చేశారు. తన భార్య వెంకట మాధవిని గురుమూర్తి కిరాతకంగా హత్య చేసి, మృతదేహాన్ని ముక్కలు, ముక్కలుగా చేసి కుక్కర్‌లో ఉడికించిన సంగతి తెలిసిందే. ఎముకలను కాల్చి బూడిద చేసి చెరువులో పడేశాడు. ఆ తర్వాత ఏమీ తెలియనట్లు ఆమె తల్లి సుబ్బమ్మతో కలిసి జనవరి 16న మీర్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గురుమూర్తిని అదుపులోకి తీసుకుని విచారించారు. దీంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. తానే భార్యను హత్య చేశానని గురుమూర్తి అంగీకరించాడు. గురుమూర్తి చెప్పిన విషయాలపై ఆధారాలు సేకరించిన పోలీసులు తాజాగా అతడిని అరెస్టు చేశారు.



## శ్రీకాళహస్తిలో ఇస్రో చైర్మన్ పూజలు

శ్రీకాళహస్తి, జనవరి 28 (నిఘా న్యూస్): శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానానికి బుధవారం ఉదయం జరగబోయే రాకెట్ లాంచింగ్ ప్రయోగం విజయవంతం కావాలని ఇస్రో చైర్మన్ స్వామినాథ గురుకుల్ పూజలు నిర్వహించారు. వారిని దేవస్థానం ఏఈఓ లోకేష్ రెడ్డి స్వాగతం పలికి శ్రీ జ్ఞాన ప్రసూనాంబికా సమేత శ్రీకాళహస్తి స్వామి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో టెంపుల్ ఇన్స్పెక్టర్ హరి యాదవ్, టెంపుల్స్ ఇన్స్పెక్టర్ సుబ్రహ్మణ్యం యాదవ్ ఏ.పీ.ఆర్.ఓ రవి, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

## మూడు కోట్లతో డిపిఆర్.. రూ.1.98 కోట్లతో స్మశాన వాటిక నిర్మాణం

- స్మశాన వాటిక శంకుస్థాపనలో అధికారులను నిలదీసిన బిజెపి
- స్మశాన వాటిక లోనే ఇతర పనులకు వినియోగిస్తామని జోనల్ కమిషనర్ హామీ



చిలుకానగర్, జనవరి 28 (నిఘా న్యూస్): చిలుకనగర్ స్మశానవాటిక అభివృద్ధి కోసం గత ఐదు సంవత్సరాలుగా చిలుకా నగర్ వాసులు అనేక పోరాటాలు చేశామని, గత ఉప్పల్ కమీషనర్‌ని వారి ఛాంబర్లో స్మశాన వాటిక అభివృద్ధి కార్యక్రమాలు వెంటనే చేపట్టాలని నిలదీశామని ఉప్పల్ బిజెపి కన్వీనర్ దేవసాని బాలచందర్ పేర్కొన్నారు. పోరాటాల తరువాత ఏడాది కిందటే మూడు కోట్లతో స్మశాన వాటికను అభివృద్ధి చేస్తున్నామని, డిపీఆర్ ని తయారు చేశారు. కానీ మంగళవారం రూ. 1.98 కోట్లతో స్మశానవాటిక నిర్మాణ వ్యయం అని శంకుస్థాపన శిలాఫలకంపై ఉండడం, డిపిఆర్ వేరుగా ఉండడం చూసి జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పటేల్, ఉప్పల్ డిప్యూటీ కమీషనర్ ఆంజనేయులు, పూర్వ ఈ ఈ నాగేందర్, ప్రస్తుత ఈఈ. హరిలాల్ అధికారులను ఉప్పల్ నియోజకవర్గం బిజెపి కన్వీనర్ దేవసాని బాలచందర్ నిలదీశారు. ఈఈ నాగేందర్ జిఎస్టి అని, సెస్ అని చెప్పే ప్రయత్నం చేయగా దానిని ఖండిస్తూ రెండు కోట్లకు గాను జీఎస్టీ 36లక్షలు అవుతుందని మిగితా 64లక్షల ఏమి చేస్తున్నారని బాలచందర్ ప్రశ్నించారు. నిధులను ఎక్కడికి బదలాయించారని నిలదీయగా,అధికారుల వద్ద సమాధానం లేక నీళ్లు నమిలారు. ఈ విషయంపై జిహెచ్ఎంసి ప్రిన్సిపల్ సెక్రెటరీ దాన కిషోర్‌కి ఫిర్యాదు చేస్తామని బిజెపి నాయకులు పేర్కొనడంతో జోనల్ కమీషనర్ హేమంత్ పటేల్ కలుగ చేసుకొని మిగిలిన నిధులను ఈ హిందు స్మశానవాటిక లోనే ఇతర పనుల కోసం కేటాయిస్తామని, నిధులని ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు బదలాయించమని హామీ ఇవ్వడం జరిగింది.


## నారాయణపేటలో 11క్వింటాళ్ళ నల్ల బెల్లం పట్టివేత



నారాయణపేట, జనవరి 28 (నిఘా న్యూస్): వాహనాల తనిఖీల్లో 11.40క్వింటాళ్ల నల్ల బెల్లం పట్టుకోవడం జరిగిందని సీఐ శివ శంకర్, ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం సోమవారం అర్ధరాత్రి సమయంలో నారాయణపేట జిల్లా కేంద్రంలో ఎస్సై వెంకటేశ్వర్లు, పోలీస్ సిబ్బంది వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో గుర్మిత్కల్ నుండి మహబూబ్ నాగర్ వెళ్తున్న బొలెరో వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా అందులో నల్ల బెల్లం ఉన్నట్టు గుర్తించి విచారించగా కిరణ్, రాజు అనే వ్యక్తులు గుర్మిత్కాల్లోని హనుమాన్ నాయక్ అనే వ్యక్తి వద్ద బెల్లం కొనుగోలు చేసి మహబూబ్నగర్ తీసుకెళ్తున్నామని తెలిపారు. అట్టి నల్ల బెల్లం 38బ్యాగ్‌లు, 11.4క్వింటాళ్ల ఉండగా వాటి విలువ లక్షకుపైగా ఉంటుందని నల్ల బెల్లాన్ని అక్రమంగా తరలిస్తున్న బొలెరో వాహన డ్రైవర్ కిరణ్‌ను పట్టుకొగా రాజు పారిపోయాడని తెలిపారు. అట్టి వాహనాన్ని సీజ్ చేసి బెల్లం అమ్మిన వ్యక్తి హనుమాన్ నాయక్, కిరణ్, రాజులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సిఐ శివ శంకర్, ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు.

## చెత్త నుండి సంపద కేంద్రాలను సృష్టించాలి

పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణ తేజ వీడియో కాన్ఫరెన్స్



పెదపూడి, జనవరి 28 (నిఘా న్యూస్): కాకినాడ జిల్లా పెదపూడి మండలం పెదపూడి మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ రాజ్ కమిషనర్ ఆధ్వర్యంలో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీడీవో నరేందర్ రెడ్డి ఈ ఓ ఆర్ డి మేడపాటి సత్యనారాయణ రెడ్డి ఆర్ డబ్ల్యు ఎస్ ఏ ఈ గంగాధర్ అన్ని పంచాయతీల నుండి ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ఈ వీడియో కాన్ఫరెన్స్ లో హాజరయ్యారు ఈ సందర్భంగా సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ కమిషనర్ కృష్ణ తేజ ఉత్తర్వులు ప్రకారం ప్రతి గ్రామంలోనూ ఫిబ్రవరి 15 నాటికి గ్రామాల్లో ఉన్న అన్ని చెత్త నుండి సంపద కేంద్రాలు వినియోగానికి రావాలని అలా రాని యెడల సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని అలాగే మార్చి 15వ తేదీ నాటికి ప్రతి ఇంటి నుండి వేస్ట్ కలెక్ట్ చేసి సంపద కేంద్రానికి తరలించాలని క్లాప్ మిత్రలును నియమించుకోవాలని ఉత్తర్వులు జారీ చేశారని ఆయన అన్నారు అలాగే పనికి ఆహార పథకం నుండి ప్రతి ఇంట్లోనూ కూడా తయారవుతున్న కిచెన్ వేస్ట్ అదే ఇంట్లో గోతులో కిచెన్ వేస్ట్ ద్వారా తయారైన కంపోస్టును స్థలం ఉన్న వారికి మార్పు చేసి కూరగాయలు ప్రకృతి సిద్ధంగా పండించి వాడుకొనుటకు తగిన ఏర్పాట్లు చేయాలని డ్రైనేజీలో ఉండే బ్లాక్ వాటర్ పంటపొలాల్లోకి వెళ్లకుండా ఏ మంచి నీటి కాలువలో కలువకుండా వీధి చివర కమ్యూనల్ సోప్ పెట్టి నిర్మించి అందులోకి డ్రైనేజీ వాటర్ ని నింపి ఫిల్టరైజేషన్ ద్వారా భూగర్భ జలాలను పెంపొందించే దిశగా కార్యక్రమాలు చేపట్టాలని ఆయన అన్నారని ఈఓఆర్‌డి తెలిపారు.

# బీసీ ముసుగులో..

# లీడర్ల దందా..?



**పాఠశాలలు కళాశాలల యాజమాన్యం ఆందోళన**

కరీంనగర్, జనవరి 28 (నిఘా న్యూస్): విద్యార్థుల భవిష్యత్తులను తీర్చిదిద్దేది పాఠశాలలు కళాశాలలు. ఒక వ్యక్తి జీవితానికి సంబంధించిన అన్ని విషయాలను ప్రాథమికంగా పాఠశాలలో ఆ తర్వాత కళాశాలలో నేర్చుకుంటాడు. విద్యార్థులు చదువుతో పాటు సమాజంపై కూడా అవగాహన కలిగి ఉండే సమయం కూడా ఇదే. అయితే ఇదే అదనుగా తీసుకున్న కొందరు తమ రాజకీయ భవిష్యత్తుకు విద్యార్థులను పావుగా వాడుకుంటున్నారు. ముఖ్యంగా బీసీ సంఘాలు అని చెప్పుకుంటూ కొందరు లీడర్లు కళాశాలల్లో పర్యటిస్తూ విద్యార్థులను తమ వైపు తిప్పుకునే ప్రయత్నం చేస్తున్నారు. భవిష్యత్తు గురించి విద్యార్థులకు ఏవేవో విషయాలు చెప్పి వారిని అయోమయానికి గురి చేస్తున్నారు. ప్రైవేట్ పాఠశాలలు కళాశాలనే ధ్యేయంగా ఎంచుకున్న కొందరు అక్రమ దందాకు పాల్పడుతున్నట్లు సమాచారం. ఇటీవల ఓ పాఠశాలలో కొందరు తాము బీసీ నాయకులు అని చెప్పుకొని పాఠశాలలో విద్యార్థులకు అన్యాయం చేస్తున్నారంటూ యాజమాన్యంపై ఒత్తిడి తీసుకొచ్చారు. అంతేకాకుండా బీసీ విద్యార్థులకు అన్యాయం చేస్తున్నారు అంటూ పాఠశాల యాజమాన్యంపై విరుచుకుపడ్డారు. అయితే పాఠశాలల్లో లేదా కళాశాలలో సౌకర్యాల గురించి యాజమాన్యంతో చర్చించాల్సిన అవసరం ఉంది. కానీ తమ అవసరాల కోసం విద్యార్థులను అడ్డంగా పెట్టుకుని పాఠశాలల యాజమాన్యంతో విభేదాలు ఏర్పరచుకొని వారిని బెదిరిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కొంతకాలంగా బీసీ నినాదం ఎక్కువగా వినిపిస్తోంది. బీసీకి చెందినవారు తమ హక్కుల కోసం పోరాడాలని కొన్ని సంఘాలు నినదిస్తున్నాయి. దీనిని అదునుగా చేసుకున్న కొందరు తాము బీసీ సంఘ నాయకులమని చెప్పుకుంటూ అక్రమంగా వసూలు చేస్తున్నారు. పాఠశాలల్లో కళాశాలల్లో సౌకర్యాలు లేని, లేదా బీసీ విద్యార్థులకు అన్యాయం జరుగుతుందని వారిని బెదిరింపులకు గురి చేస్తున్నట్లు ఆరోపించారు.

నిజంగా బిసి విద్యార్థుల కోసం పోరాడితే అది న్యాయ పరంగా ఉండాలని దందా లాగా ఉండొద్దని కొందరు అంటున్నారు. అంతేకాకుండా గుర్తింపు పొందిన బీసీ సంఘం నాయకులు అయితే పర్వాలేదు కానీ కొందరు ఏదో పేరు చెప్పి తాము బీసీ సంఘం నాయకులు అంటూ బెదిరింపులకు గురి చేయడం వల్ల ఇబ్బందులకు గురవుతున్నామని పాఠశాల యాజమాన్య సంఘాలు తెలుపుతున్నాయి. ఇలాంటి వారి విషయంలో నిజమైన బీసీ సంఘాలు దృష్టి పెట్టాలని కోరారు.

## మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో ఎగిరిన జెండా





- 76 సంవత్సరాల తొలిసారి నిర్వహణ
- డిఐజి సూరజ్ పాల్ వర్మ

చింతూరు, జనవరి 28 (నిఘా న్యూస్): చత్తీస్గఢ్ రాష్ట్రంలోని మారుమాల ప్రభావిత ప్రాంతాల్లో రిపబ్లిక్ డే సందర్భంగా మూడు రంగుల జెండాను 76 సంవత్సరాల తర్వాత ఎగురవేసినట్లు సిఆర్పిఎఫ్ కుంట డిఐజి సూరజ్ పాల్ వర్మ తెలిపారు. ఓపిఎస్ రేంజ్ కొంటా, 76వ గణతంత్ర దినోత్సవం జరుపుకుందని అంతర్గత భద్రతను పరిరక్షించడంలో అగ్రగామిగా, నాయకత్వం వహిస్తున్న సిఆర్పిఎఫ్ 76వ గణతంత్ర దినోత్సవాన్ని 26 జనవరి-2025న దేశమంతటా జరుపుకుందని, దీనిలో భాగంగా మావోయిస్టుల ముప్పుతో పోరాడేందుకు ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో కొంటా, మారుమూల మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో మోహరించిన సిఆర్పిఎఫ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా, కుంట రేంజ్ డిఐజి (ఆప్స్)సూరజ్ పాల్ వర్మ, కొంటలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిఆర్‌పిఎఫ్ సీనియర్ అధికారులు, ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర సివిల్ పోలీసు అధికారులు పాల్గొన్నారు. ఈ చారిత్రాత్మక సంఘటన దేశం సార్వభౌమాధికారం, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను గౌరవించేలా పరివర్తనకు ప్రతీకగా సూరజ్ పాల్ వర్మ డిఐజిపి ప్రసంగిస్తూ నక్సల్స్ బారి నుండి స్థానికులను విముక్తి చేయడానికి, మావోయిస్టుల కోటలో మౌలిక సదుపాయాలను నిర్మించడంలో పోలీసు బలగాలు ప్రత్యేకించి సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ అందించిన కృషి అపారమైన త్యాగాన్ని గుర్తు చేసారు . నక్సల్స్ హింసను విడనాడి ప్రధాన స్రవంతిలో చేరాలని, గిరిజన ప్రాంతంలో అభివృద్ధికి బాటలు వేయాలని సూచించారు. కేంద్ర హెూంమంత్రి దార్శనికత ప్రకారం మార్చి 2026 చివరి నాటికి సుక్మా జిల్లాతో పాటు ఛతీస్‌గఢ్ రాష్ట్రంలో మావోయిస్టుల నిర్మూలనకు మరింతగా కృషి చేయాలని సిఆర్పిఎఫ్, పోలీసు సిబ్బందిని ప్రోత్సహించారు. డిఐజి సూరజ్ పాల్ వర్మ, కుంటలోని పాఠశాల విద్యార్థులకు, అనాథ శరణాలయాలకు మిఠాయిలు, అవసరమైన వస్తువులను పంపిణీ చేయడంతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

## సిద్దేశ్వరం వద్ద... తీగల వంతెనకు బదులు బ్రిడ్జి కం బ్యారేజ్ నిర్మించాలి

- సాగు, తాగు నీటికి శాశ్వత పరిష్కారం లభిస్తుంది
- గత ప్రభుత్వంలో జల్ జీవన్ నిధులను దుర్వినియోగం చేశారు
- నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి




నంద్యాల, జనవరి 28 (నిఘా న్యూస్): విద్యుత్ ఉత్పత్తి పేరుతో శ్రీశైలం రిజర్వాయర్ నుంచి దిగువకు నీటిని తీసుకెళ్తూ శ్రీశైలం ప్రాజెక్టును ఒక వైపు ఖాళీ చేస్తూ మరో వైపు జల్ జీవన్ మిషన్ ద్వారా జిల్లాలోని ఐదు రిజర్వాయర్లతో అనుసంధానం చేసి ప్రజలకు తాగునీరు అంటున్నారు, నంద్యాల జిల్లా అలగనూరు రిజర్వాయర్ ప్రధానకట్ట కుంగి, ఐదేళ్ళుగా అలగనూరు రిజర్వాయర్‌లో చుక్క నీరులేదు. నీరు ఉండాల్సిన చోట రిజర్వాయర్‌లో పశువులు మేపుకుంటూ కొందరు పొలాలు సాగుచేసుకుంటున్నారని ఇలా రాయలసీమలోని అన్ని రిజర్వాయర్లలో ఉండాల్చిన టీఎంసి ల నీరు నిల్వ ఉంచడానికి అవకాశం లేదు, ఉన్న నీటిని రైతుల ఆయకట్టు సాగుకు, పరిశ్రమలకే సరిపోవడం లేదని, జల్ జీవన్ మిషన్ నిధులు కేంద్ర ప్రభుత్వం ఇచ్చినా, ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ప్రతి ఇంటికి తాగునీటి కుళాయి, స్వచ్ఛమైన తాగునీరు అందించే లక్ష్యం నెరవేరడం లేదని, ప్రధానమంత్రి మోడీ లక్ష్యం నెరవేరాలంటే నంద్యాల జిల్లా కొత్తపల్లి మండలం సిద్దేశ్వరం వద్ద కృష్ణానది పై తీగల వంతెన బదులు బ్రిడ్జి కం బ్యారేజ్ నిర్మాణం చేయడమేనని, దీంతో సంగమేశ్వరం వద్ద కృష్ణా నదిలో సుమారు 60 టీఎంసీ ల నీరు నిలుస్తుందని, నంద్యాల జిల్లాతో పాటు రాయలసీమ ప్రాజెక్టులకు నీరు అంది సాగు, తాగునీరు అందుతుందని, ఆ దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేయాలని లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. మంగళవారం నంద్యాల జిల్లా కలెక్టరేట్ లోని సెయింటనరీ హాల్‌లో 20సూత్రాల పథకం అమలు పై రాష్ట్ర చైర్ ఫర్సన్ లంకా దీనకర్ అధ్యక్షతన, నంద్యాల జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి, ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి, జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ తదితర జిల్లా స్థాయి అధికారులతో విసృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో వస్తావ పరిస్థితులకు అనుగుణంగా అధికారులు అంచనా వేసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సక్రమంగా నివేదికలు అందించి నిధులు దుర్వినియోగం కాకుండా నిజమైన భాధితులకు పథకాలు అందేలా చూడాలని, గత వైసీపీ పాలనలో కేవలం వైసీపీ నాయకుల లబ్దికోసం జల్ జీవన్ మిషన్ నిధులు దుర్వినియోగం చేశారని, ఆలాంటి పొరపాటు మళ్ళీ మా ఉమ్మడి ప్రభుత్వంలో జరుగకుండా చూడాలని అధికారులను ఎంపీ శబరి కోరగా 20సూత్రాల పథకం అమలు రాష్ట్ర చైర్ ఫర్సన్ లంకా దినకర్ వెంటనే జిల్లా ఆర్ డబ్ల్యూ ఎస్ ఎస్. ఈ మనోహర్ ను ఎంపీ, జిల్లా కలెక్టర్, జిల్లా పరిషత్ చైర్మన్‌ల మాటలు విన్నారుగా గత ప్రభుత్వ తప్పిదాలు మళ్ళీ జరుగకుండా చేస్తూ జల్ జీవన్ మిషన్ నంద్యాల జిల్లాలో సక్రమంగా అమలు అయ్యేలా చూడాలని ఆదేశించారు.

## హిందూత్వం పేరుతో..

# అణగారిన వర్గాలను హత్య చేసిన బిజెపి

- దేశంలో జరిగిన ఏ ఉద్యమంలోనూ బిజెపి పాత్ర లేదు
- గద్దర్‌ను విమర్శించడం తెలంగాణ ఉద్యమాన్ని కించపర్చడమే
- బండి సంజయ్ భేషరతుగా క్షమాపణ చెప్పాలి
- ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వలి ఉల్లా ఖాద్రి, ప్రధాన కార్యదర్శి ధర్మేంద్ర




కరీంనగర్, జనవరి 28 (నిఘా న్యూస్): కేంద్రహెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ప్రజా యుద్ధ నౌక గద్దర్ ను అవమానించేలా అనుచిత వ్యాఖ్యలు చేశారని, ఆ వ్యాఖ్యలను బండి సంజయ్ వెనక్కి తీసుకుని భేషరతుగా క్షమాపణ చెప్పాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు, వలి ఉల్లా ఖాద్రీ, ప్రధాన కార్యదర్శికల్లూరు ధర్మేంద్ర లు డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ కరీంనగర్ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం మంగళవారం బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలి ఉల్లా ఖాద్రీ, ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర సంయుక్తంగా మాట్లాడుతూ సాహిత్య కళారూపం ద్వారా తెలంగాణ రాష్ట్ర సాధనలో క్రియాశీలకంగా ప్రజలను చైతన్య పరుస్తూ పోరాడిన యుద్ధ నౌక గద్దర్ పై అర్థరహితంగా బండి సంజయ్ మాట్లాడటం సిగ్గు చేటు అన్నారు. బీజేపీ నేతలను హత్య చేయించిన గద్దర్ కు అవార్డ్ ఇవ్వాలా అంటూ నిరాధార ఆరోపణలు చేస్తూ మీడియా సాక్షిగా మాట్లాడిన సంజయ్ కేంద్ర మంత్రిగా ఉంటూ అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్నారన్నారు. బీజేపీ చరిత్ర దేశ ప్రజలకు స్పష్టంగా తెలుసని గాంధీని చంపిన గాడ్సేది బీజేపీ ఆర్ఎస్ఎస్ కాదా అని వారు ప్రశ్నించారు. వాస్తవానికి బీజేపీ ది హత్యా రాజకీయాల చరిత్ర అని వారు ఎద్దేవా చేశారు. దేశంలో హిందూత్వం పేరుతో అణగారిన వర్గాల ప్రజలను గుజరాత్, ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రాలలో మారణహెూమం చేసిన బీజేపీ ఈ దేశానికి ప్రమాదమని వారు ఉద్ఘాటించారు. దేశ స్వాతంత్ర్యంలో బీజేపీ పాత్రే లేదని, దేశంలో జరిగిన ఏ పోరాటంలో బీజేపీ పాత్ర లేకున్నా చరిత్రను వక్రీకరించడంలో బీజేపీ నీచ రాజకీయాలు చేస్తూ దేశంలో మత అజెండాతో అవలంభిస్తున్నారని అన్నారు. అందుకే బండి సంజయ్ బహిరంగంగా తన మాటలను వెనక్కి తీసుకోవాలని లేనిపక్షంలో ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బ్రాహ్మణపల్లి యుగంధర్, రాష్ట్ర సమితి సభ్యులు భోనగిరి మహేందర్, ఏఐవైఎఫ్ కరీంనగర్ జిల్లా కన్వీనర్ లంకదాసరి కళ్యాణ్ నాయకులు సురేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## కొమురవెల్లి ఆలయ ప్రాంగణంలో కత్తితో అఘోరి హల్చల్

**బట్టలు వేసుకుని వస్తేనే దర్శనం కల్పిస్తామన్నా అధికారులు**

**భయభ్రాంతులకు గురైన భక్తులు**

సిద్దిపేట, జనవరి 28 (నిఘా న్యూస్): కొమురవెల్లి మల్లన్న గుడిలో అఘోరి నాగసా ధువు నానా రచ్చ చేసింది. కత్తితో పలువురిపై దాడి చేస్తూ భక్తులను బయాంభ్రాంతులకు గురిచేసింది. ఆలయ ప్రధాన ద్వారం నుంచి స్వామివారి దర్శనానికి అనుమతి ఇవ్వాలని మొండి పట్టు పట్టింది. పూర్తి దిగంబరంగా ఆల యానికి వచ్చిన అఘోరీ ఆలయం ప్రధాన ద్వారం నుంచి తనను దర్శనానికి అనుమతించాలంటూ హల్చల్ చేసింది. అయితే వస్త్ర ధారణతో దర్శనానికి వస్తే అనుమ తినిస్తామం టూ ఆలయ అధికారులు సూచించారు. తనను ఇలాగే దర్శనానికి అనుమతించాలంటూ ఆలయ అధికారులతో వాగ్వివాదానికి దిగిన అఘోరీ కత్తితో అక్కడున్న వారిపై ఆకస్మికంగా దాడి చేసింది. అఘోరీ దాడిలో పలువురికి గాయాలయ్యా యి. మొదటి నుంచి కూడా అఘోరీ తెలుగు రాష్ట్రాల్లో వివాదాస్పద వైఖరితో ఉద్రిక్తతలు సృష్టిస్తున్నారు. సికింద్రాబాద్ ముత్యాలమ్మ గుడిలో పూజలతో వెలుగు లోకి వచ్చిన మహిళా అఘోరి శ్రీకాళహస్తి సహా ఏపీలోని పలు దేవాలయాల సందర్శనల సందర్భంగా గొడవకు దిగింది. ఈ విషయంలో ఆలయ అధికారులు కూడా మొండి పట్టు పట్టారు. బట్టలు వేసుకుని దర్శనానికి రావాలని సూచించారు. భక్తులు ఆమె తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

## ట్యాంక్ బండ్ అగ్ని ప్రమాదంలో ఇద్దరి మృతి

**గాయపడిన ఫైర్ క్రాకర్స్ ఆపరేటర్ గణపతి**

**గల్లంతైన అజయ్ మృతదేహం లభ్యం**

**ఫైర్ క్రాకర్స్ నిర్వాహకులపై చర్యలకు డిమాండ్**





హైదరాబాద్, జనవరి 28 (నిఘా న్యూస్): భారత్ మాతా మహా హారతి సందర్భంగా ట్యాంక్ బాండ్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఫైర్ క్రాకర్స్ ఆపరేటర్ గణపతి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో ఈనెల 26వ తేదీ గణతంత్ర దినోత్సవం సందర్భంగా పీపుల్స్ ప్లాజా వద్ద భారతమాత మహాహారతి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ట్యాంక్ బాండ్‌లోని పడవల ద్వారా పెద్ద ఎత్తున బాణాసంచాను కాల్చారు. ఈ సందర్భంగా ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం జరిగి పడవలోని బాణసంచా పేలిపోయి ఫైర్ క్రాకర్స్ ఆపరేటర్ గణపతికి 80శాతం గాయాలయ్యాయి. దీంతో పోలీసులు అతడిని యశోద ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఇతని స్వస్థలం రాజమండ్రి. అదేవిధంగా ఈ ప్రమాదం భారీ నుంచి రక్షించుకునే ప్రయత్నంలో ట్యాంక్ బండ్‌లో దూకిగల్లంతైన అజయ్ మృతదేహం మంగళవారం రాత్రి పోలీసులు కనుగొన్నారు. గత రెండు రోజులుగా మృతదేహం కోసం పోలీసులు గాలించగా చివరకు లభ్యమైనది. ఈ ప్రమాదంలో బోట్స్ డ్రైవర్ లు పల్లె ప్రణీత్, దుబాసి సునీత్‌లకు కూడా తీవ్ర గాయాలై వారు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరి పరిస్థితి కూడా విషమంగా ఉన్నట్లు తెలిసింది.

## సూర్యాపేటలో పరువు హత్య

**దుండగులను కఠినంగా శిక్షించాలి**

**మాల మహానాడు మండల అధ్యక్షులు కూచిమల్ల నాగేష్**



వలిగొండ, జనవరి 28(నిఘా న్యూస్): యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ సూర్యాపేటలో యువకుడిని బండ రాళ్లతో మోది హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని వలిగొండ మాల మహానాడు మండల అధ్యక్షులు కూచిమల్ల నాగేష్ మంగళవారం పత్రిక ప్రకటనలో డిమాండ్ చేశారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని మామిళ్లగడ్డ ఎస్సీ మాల కులానికి చెందిన వడ్లకొండ కృష్ణ (30) అలియాస్ మాల బంటి, సూర్యాపేట మండలం పిల్లలమర్రికి చెందిన భార్గవి ప్రేమించుకున్నారు. ఆమె ప్రేమ విషయం తన తల్లిదండ్రులకు చెప్పగా కులాలు వేరు కావడంతో వారు ఒప్పుకోక పోవడంతో కృష్ణ, భార్గవి గత ఏడాది ఆగస్టులో ప్రేమ వివాహం చేసుకున్నారు. అనంతరం కృష్ణ సూర్యాపేటలోనే రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసుకుంటూ భార్గవితో కలిసి ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి బైరు మహేశ్ అనే మిత్రుడి నుంచి కృష్ణకు ఫోన్ రావడంతో ఇప్పుడే వస్తానంటూ భార్య భార్గవికి చెప్పి బయటకు వెళ్లిన కృష్ణ అదే రాత్రి హత్యకు గురయ్యాడని, కులాంతర వివాహం చేసుకున్నందుకు కక్ష పెంచుకున్న నా సోదరుడు నవీన్ ఈ హత్య చేసినట్లు మృతుని భార్య ఆరోపిస్తున్నందున ఆ దిశగా పోలీసులు దర్యాప్తు చేసి దుండగులను కఠినంగా శిక్షించాలని కోరారు. గతంలో కూడా సూర్యాపేట కేంద్రంలో కులాంతర వివాహం చేసుకున్నాడని ప్రణయ్ ని దారుణంగా హత్య చేశారని ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఇలాంటి వైఫల్యాలకు కారణం పోలీసు వ్యవస్థ, ప్రభుత్వమే కారణమని ఆరోపించారు. కులాంతర వివాహాలు చేసుకున్న వారికి ప్రత్యేకమైన చట్టం తీసుకువచ్చి వారిని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానికి, పోలీసు వ్యవస్థకు ఉండాలన్నారు. ఇలాంటి పరువు హత్యలు పునరావృతం కాకుండా చూడాలని, ఆ దుండగులను కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని కోరారు.

Printed Published by Ch.Srinivas, Printed at M/s Apsara Printing Works, H.No. G9 Ground Floor, Maruti Complex, Nagole Cross Road, Hyderabad, Telangana India - 500068.
Editor : Ch.Srinivas RNI Reg.No.APTEL/2010/35098. Phone: +91 90142 77465 email: nighareporters@gmail.com